



www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక






Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 05 బుధవారం ఫిబ్రవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 141
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur

# జంపింగులకు నోటీసులు!



- పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు
- పార్టీ ఎందుకు మారారు..ఎవరైనా ప్రలోభ పెట్టారా..
- నోటీసుల్లో పేర్కొన్న అసెంబ్లీ కార్యదర్శి
- స్పీకర్ నిర్ణయం తీసుకునేందుకు ఇంకెంతకాలం పడుతుందని సుప్రీం వ్యాఖ్యల నేపథ్యంలో నోటీసులు

2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

తెలంగాణలో రాజకీయాలు వేడెక్కాయి. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు తాజాగా అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. మొత్తం 10 మంది శాసన సభ్యులకు నోటీసులు జారీ చేస్తూ.. అసెంబ్లీ కార్యదర్శి నిర్ణయం తీసుకున్నారు. ఎందుకు పార్టీ మారారు? ఆ అవసరం ఏమొచ్చింది? ఈ క్రమంలో మీపై ఏమైనా వత్తిళ్లు ఉన్నాయా? ప్రలోభ పెట్టారా? అంటూ.. సదరు నోటీసుల్లో పేర్కొనడం మరింత ఆశ్చర్యంగా ఉంది. పార్టీ ఫిరాయించడానికి గల కారణాలు.. పేర్కొంటూ తగిన సమాధానం చెప్పాలని కోరారు. దీంతో ఆయా ఎమ్మెల్యేలు ఇప్పుడు పెద్ద చిక్కుల్లో పడ్డారు. వారు చెప్పే రీజన్లతో పనిలేకుండా.. స్పీకర్ తగిన నిర్ణయం తీసుకునేందుకు అవకాశం ఉంది. అయితే.. రాజకీయంగా పలు రాష్ట్రాల్లో ఇలాంటి పరిణామాలే జరుగుతున్నందున స్పీకర్లు కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. కానీ, మహారాష్ట్ర ఉదంతం తర్వాత.. తెరమీదికి వచ్చిన తెలంగాణ.. విషయంపై సుప్రీంకోర్టు ఇటీవల సీరియస్ కామెంట్లు చేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ నిర్ణయం తీసుకునేందుకు.. ఇంకెంత సమయం పడుతుందని ప్రశ్నించింది. నయన్ ఎలా రియాక్ట్ అవుతుందో మహారాష్ట్ర స్పీకర్ మాదిరిగా చేయాలని అనుకుంటున్నారా? అని కూడా సుప్రీంకోర్టు ప్రశ్నించడం గమనార్హం. ఈ నేపథ్యంలో తాజాగా సభ ప్రారంభమైన కొద్ది సేపటికే కార్యదర్శి ఆయా జంపింగులకు నోటీసులు జారీ చేశారు. మొత్తం పది మంది ఎమ్మెల్యేలు.. ప్రతిపక్ష బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. వీరిలో దానం నాగేందర్ వంటి సీనియర్లు కూడా

# ఏపీ బడ్జెట్‌పై కసరత్తు

- పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు ఆర్థిక మంత్రి పయ్యావుల కసరత్తు
- ఇప్పటికే కేంద్ర నిధులపై 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్‌ను కలిసిన సీఎం
- కేంద్ర బడ్జెట్ నుంచి వచ్చే నిధులను బట్టి బడ్జెట్ రూపకల్పన
- ఈసారి బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు ఎక్కువ నిధుల కేటాయింపు

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీ బడ్జెట్ ఎంత...పయ్యావుల కసరత్తు మొదలు పెట్టారు.అయితే ఈసారి పూర్తిస్థాయి బడ్జెట్ ని ప్రభుత్వం పెట్టాల్సి ఉంది. దాని కోసం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా 50 లక్షల కోట్ల రూపాయలతో బడ్జెట్ ని 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టింది. ఇపుడు ఏపీ వంతుగా ఉంది. ఏపీలో కూడా కొత్త ఆర్థిక సంవత్సరం కోసం బడ్జెట్‌ని పూర్తి స్థాయిలో ప్రవేశ పెట్టాల్సి ఉంది. గత ఏడాది జూన్ 12న అధికారం చేపట్టిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఆ ఏడాది చివరిలో బడ్జెట్‌ని ప్రవేశపెట్టింది. అయితే ఈసారి పూర్తిస్థాయి బడ్జెట్ ని ప్రభుత్వం పెట్టాల్సి ఉంది. దాని కోసం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తున్నారు. ఈ మధ్యనే ఢిల్లీలో 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగారియాతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటుగా పయ్యావుల కలిశారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి నిధుల కేటాయింపుపై చర్చించారు. ఏపీ ఆర్థికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి రాష్ట్ర ఆర్థిక స్థితి గురించి పనగారియా బృందానికి చంద్రబాబునాయుడు వివరణాత్మకమైన ప్రెజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను అధిగమించేందుకు వీలుగా నిధులను ఉదారంగా కేటాయించాలని ఆయన కోరారు. మరో వైపు చూస్తే కేంద్ర బడ్జెట్ నుంచి ఏపీకి వివిధ రంగాల ద్వారా ఏ మేరకు ఎంతెంత నిధులు వస్తాయన్నది కూడా బేరీజు వేసుకుంటున్నారు. ఇవన్నీ కలుపుకుని ఏపీ బడ్జెట్‌ని రూపొందించే పనిలో పయ్యావుల ఉన్నారు ఈసారి బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు పెద్ద ఎత్తున కేటాయింపులు ఉంటాయని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు పూర్తి అవుతున్నందువల్ల

# బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తాం

- మేము ఇస్తాం..మీరు సిద్ధంగా ఉన్నారా..బీఆర్ఎస్, బీజేపీకి అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి సవాల్
- స్థానికసంస్థల్లో బీసీలకు 42శాతం ఇవ్వాలంటే రాజ్యాంగ సవరణ జరగాలి
- చట్టప్రకారం 42 శాతం ఇవ్వడం సాధ్యం కాకపోతే పార్టీపరంగా సీట్లిస్తాం

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణ అసెంబ్లీలో కులగణన సర్వేపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. బీసీలకు రిజర్వేషన్లపై సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్, బీజేపీలకు సవాల్ విసిరారు. చట్టప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం ఇవ్వాలంటే రాజ్యాంగ సవరణ జరగాలన్నారు. చట్ట ప్రకారం 42 శాతం ఇవ్వడం సాధ్యం కాకపోతే పార్టీపరంగా బీసీలకు 42 శాతం సీట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మేం సిద్ధంగా ఉన్నాం.. మీరు సిద్ధంగా ఉన్నారా అంటూ బీఆర్ఎస్, బీజేపీలను ఉద్దేశించి సీఎం రేవంత్ సవాల్ విసిరారు. బీసీలకు న్యాయం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని ముఖ్యమంత్ర రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



రాజ్యాంగ మార్పులు అవసరమైతే.. దానికైనా కృషి చేస్తామన్నారు. అప్పటివరకు రాజకీయంగా, నైతికంగా కట్టుబడి కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించబోతోందన్నారు. కులగణన సర్వేపై తెలంగాణ అసెంబ్లీలో జరిగిన చర్చలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను సీఎం రేవంత్ రెడ్డి తిప్పికొట్టారు. బీఆర్ఎస్ నేతలు

## ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ సానుకూలం

- వర్గీకరణకు మద్దతుగా అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేశామన్న కేటీఆర్
- 2001 నుంచి తమ పార్టీ ఎస్సీ వర్గీకరణపై స్పష్టతతోనే ఉందని వెల్లడి
- బీసీల విషయంలో ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ శాసనసభ నుంచి వాకౌట్



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ పార్టీ సానుకూలంగా ఉందని, ప్రభుత్వం నిర్ణయాన్ని తాము సమర్థిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెం ట్ కేటీఆర్ స్పష్టం చేశారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ అంశంపై ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వర్గీకరణకు మద్దతు తెలుపుతూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించామని ఆయన వెల్లడించారు. 2001 సంవత్సరం నుంచి తమ పార్టీ ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన వైఖరితోనే ఉందని ఆయన పేర్కొన్నారు.

# జారుతున్న వైసీపీ నేతలు

- ఆత్మస్థైర్యాన్ని కోల్పోయిన వైసీపీ కార్యకర్తలు
- నాలుగున్నరేళ్లు ఓపిక పడితే తమదే సర్కార్
- ధైర్యాన్ని నూరిపోస్తున్న అధినేత జగన్
- టీడీపీ పెట్టే కేసులను భయపడవద్దని సూచన



2

**అమరావతి-నవభూమిబ్యూరో**

వైసీపీ నేతలలో భయం ఏమిటో టీడీపీ కూటమి ప్రభుత్వం గత ఎనిమిది నెలలోనే చూపించింది. లేకపోతే వైసీపీలో నంబర్ టూ అనతగిన విజయసాయిరెడ్డి నాకొద్దీ రాజకీయం అని పార్టీని వదిలేస్తారా అన్నది చర్చగా ఉంది. ఇదిలా ఉంటే దాదాపు పదిహేను రోజులకు పైగా లండన్‌లో ఉన్న జగన్ తాడేపల్లికి చేరుకున్నారు. ఆయన పార్టీ నేతలకు ఏ విధంగా దిశా నిర్దేశం చేస్తారు అన్నది అయితే పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. అయితే జగన్ పార్టీ నేతలకు ఒక్కటే గట్టిగా చెబుతారని అంటున్నారు. ధైర్యంగా ఉండమని ఆయన కోరుతారు అని అంటున్నారు. తన వెంట ఉంటూ పార్టీలో పనిచేయాలంటే ధైర్యం ఒక్కటే ఆయుధం అని జగన్ గట్టిగా నూరిపోస్తారని అంటున్నారు. కలలో సైతం ఊహించని విధంగా విజయసాయిరెడ్డి పార్టీని వీడారూ అంటే కూటమి నుంచి ఒత్తిళ్ళు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చునని అంటున్నారు. గతానికి భిన్నంగా ఈసారి వైసీపీని కొత్త కోణంలో

# వైసీపీకి సీనియర్ ఎమ్మెల్యే దూరం?

- కర్నూలు జిల్లాలో గెలిచిన ఇద్దరిలో ఒకరు పార్టీకి దూరం
- గెలిచిన 7 నెలలుగా కనిపించని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగరెడ్డి
- ఉన్న 10 మంది కూటమిని విమర్శిస్తున్నా..నోరుమెదపని బాల నాగరెడ్డి
- కూటమి వైపు దృష్టి సారించినందువల్లే వైసీపీకి బాలనాగిరెడ్డి దూరం



**కర్నూలు-నవభూమిబ్యూరో**

వైసీపీకి 2024 ఎన్నికల్లో గెలిచిందే అచ్చంగా 11 మంది ఎమ్మెల్యేలు. అందులో కూడా కొందరు అసంతృప్తిగా ఉన్నారు అని వార్తలు రావడం కలవరం కలిగించే విషయమే అని అంటున్నారు. రాయలసీమలో వైసీపీ గెలిచిందే తక్కువ సీట్లు అయితే వీరి నుంచి ఒకరిద్దరు ఇపుడు పక్క చూపులు చూస్తున్నారు అని వార్తలు ప్రచారం కావడం విశేషం. వైసీపీ అధినాయకత్వం పోకడలతో విభేదిస్తున్న వారే ఇలా దూరం జరుగుతున్నారని అంటున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో చూస్తే ఈసారి ఎన్నికల్లో ఇద్దరే ఎమ్మెల్యేలు గెలిచారు. వారిలో ఆలూరు నుంచి విరూపాక్షి మంత్రాలయం నుంచి బాల నాగిరెడ్డి గెలిచారు. ఇందులో విరూపాక్షి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. ఆయన పార్టీ ఇచ్చిన ఆదేశాలను పాటిస్తున్నారు. అలాగే ప్రభుత్వం మీద పదునైన విమర్శలు చేస్తున్నారు. ఆయన పార్టీ కార్యక్రమాలకు కూడా హాజరవుతున్నారు. అయితే మంత్రాలయం ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి మాత్రం గత ఏడు నెలలుగా పెద్దగా పార్టీ కార్యక్రమాలలో కనిపించడం లేదు అన్న విమర్శలు సొంత పార్టీ వారే చేస్తునారు. ఆయన

# సచివాలయాన్ని పేల్చేస్తాం..

- బెదిరింపు కాల్స్ చేసిన లంగర్‌హౌజ్ వాసి
- అర్జీలు, ఫిర్యాదుల విభాగానికి అలీ మొదట ఫోన్ చేసి బెదిరింపు
- వరుసగా మూడు రోజుల నుంచి కాల్స్‌తో అప్రమత్తం
- దర్గాకు సంబంధించిన సమస్యపై అధికారులు
- స్పందించకపోవడంతో బెదిరింపులకు దిగిన అలీ

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలుగు రాష్ట్రాల్లో బెదిరింపు కాల్స్ వ్యవహారం కలకలంగా మారుతోంది. ఏపీలోని పలు ప్రముఖ ప్రాంతాలతో పాటు తెలంగాణలో సైతం పలు చోట్లకు బెదిరింపు కాల్స్ రావడం భయాందోళనలకు గురి చేస్తోంది. ఈ క్రమంలోనే గత 3 రోజులుగా తెలంగాణ సచివాలయాన్ని పేల్చేస్తాం అంటూ కాల్స్ రావడం తీవ్ర దుమారంగా మారింది. అయితే బెదిరింపు కాల్స్ చేస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. సెక్రటేరియట్ సిబ్బంది ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు.. నిందితుడు చేసిన ఫోన్ నెంబర్ ఆధారంగా అతడి ఆచూకీని కనిపెట్టారు. నిందితుడిని హైదరాబాద్ లంగర్‌హౌజ్‌కు చెందిన సయ్యద్ మీర్ మహ్మద్ అలీగా గుర్తించారు. బెదిరింపు కాల్స్ ఎందుకు చేశావని విచారణ చేపడుతున్నారు. అర్జీలు, ఫిర్యాదుల విభాగానికి అలీ మొదట ఫోన్ చేసి బెదిరించాడు. సచివాలయాన్ని పేల్చేస్తానని అధికారులకు వార్నింగ్ ఇచ్చాడు. అయితే ఫేక్ కాల్ అని అధికారులు భావించినప్పటికీ.. వరుసగా 3 రోజులు ఫోన్ చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. దర్గాకు సంబంధించి ఓ సమస్యపై ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయగా.. అధికారులు స్పందించకపోవడంతో ఈ బెదిరింపులకు పాల్పడినట్లు మహ్మద్ అలీ చెప్పినట్లు సమా చారం. ఇక మరోవైపు ఇటీవలె ఖమ్మం జిల్లాకు చెందిన భాస్కర్ రావు.. నకిలీ ఐడీ కార్డుతో సచివాలయంలో హల్‌చల్ చేశాడు. రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ అని చెబుతూ దందాలు చేశాడు. ఈ క్రమంలోనే అతడి కదలికలు అనుమానాస్పదంగా ఉండడంతో అధికారులు విచారించగా బాగోతం బయటపడింది. భాస్కర్

# త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

- ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- భీమవరంలో కూటమి నేతలతో భేటీ అయిన గొట్టిపాటి
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ
- ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని పిలుపు



**భీమవరం-నవభూమిప్రతినిధి**

ఎన్నికల హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని కూడా త్వరలోనే అమల్లోకి తెస్తామని అన్నా రు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే మెగా డీఎస్సీని అమలు చేస్తామని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి పరీక్షలు నిర్వహించి జాయినింగ్ లెటర్స్ ఇస్తామని తెలిపారు. భీమవరంలో కూటమి నేతలతో గొట్టిపాటి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై వారితో చర్చించారు.

# ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధం

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

- ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు
- మొత్తం 70 స్థానాలకు ఒకే విడతలో పోలింగ్
- ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు బుధవారం నాడు జరగనున్నాయి. అందుకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. పోలింగ్ ముగిసే సమయానికి క్యూ లైన్లలో ఉన్నవారికి ఓటేసే అవకాశం కల్పిస్తారు. రేపు సాయంత్రం 6.30 గంటల తర్వాత ఎగ్జిట్ పోల్స్ సందడి చేయనున్నాయి. ఢిల్లీలో 1.56 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మొత్తం 699 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈసారి అధికార ఆప్, బీజేపీ, కాంగ్రెస్ మధ్య త్రిముఖ పోరు హోరాహోరీగా సాగనుంది. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# ఎత్తులు వేసి ప్రత్యర్థులను చిత్తు చేసిన బాలయ్య

- తొలిసారి ప్రత్యర్థులను దెబ్బకు దెబ్బ తీసిన బాలయ్య
- హిందూపురం మున్సిపాలిటీలో టీడీపీ జెండా ఎగురవేత
- హిందూపూర్ మున్సిపల్ ఛైర్మన్‌గా రమేశ్ కుమార్

2



# తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పదవి కూటమికే

**తిరుపతి-నవభూమిబ్యూరో**

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కుర్చీని తెలుగుదేశం-జనసేన- బీజేపీ కూటమి ఎగరేసుకెళ్లింది. ఏ మాత్రం బలం లేనప్పటికీ- గెలవడం అసాధ్యం అనుకున్న ప్రతిష్ఠాత్మకంగా భావించిన ఈ ఉప ఎన్నికను తనకు అనుకూలంగా మలచుకోగలిగింది. డిప్యూటీ మేయర్ ఎన్నికలో తెలుగుదేశం పార్టీకి చెందిన మునికృష్ణ విజయం సాధించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి లడ్డూ భాస్కర్ పరాజయం పాలయ్యారు. తిరుపతికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ శాసన సభ్యుడు భూమన కరుణాకర్ రెడ్డి తనయుడు అభినయ్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయడం వల్ల ఏర్పడిన ఎన్నిక ఇది.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులపై సీఎం రేవంత్ రియాక్షన్ ఇదే..

**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ అవడం హాట్ టాపిక్‌గా మారింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు అసెంబ్లీ కార్యదర్శి. ఫిరాయింపు మీద లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. తాజాగా ఈ వివాదంపై స్పందించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ప్రొసీజర్‌లో భాగంగానే ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ అయ్యాయని తెలిపారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..సమగ్ర కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా క్యాబినేట్ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. ఈ రోజు దేశ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ నిర్ణయంతో ప్రధాని మీద ఒత్తిడి పెరుగుతుందన్నారు. అన్ని రాష్ట్రాల్లో కులగణన చేయాలనే డిమాండ్ రానుందన్నారు రేవంత్. భవిష్యత్తులో ఈ రోజు తాము ప్రవేశపెట్టే డాక్యుమెంట్ రిఫరెన్స్ తీసుకోవాలన్నారు. 2011 జనాభా లెక్కల తర్వాత మళ్లీ తామే చేశామన్నారు. 2014 లెక్కలు ఎక్కడ ఉన్నాయో చేసిన వాళ్లే చెప్పాలన్నారు సీఎం. రాజకీయ ప్రయోజనాల కోసం కులగణన చేయడం లేదన్నారు రేవంత్. కులగణన వల్ల 76 శాతం బీసీ, ఎస్సీ, మైనార్టీలకు న్యాయం జరుగుతుందన్నారు. కులగణన చేసి చరిత్ర సృష్టించామన్నారు సీఎం రేవంత్. పకడ్బందీగా సర్వే చేసి సమాచారం సేకరించామని చెప్పారు. ప్రధాన ప్రతిపక్షానికి బాధ్యత లేదని సీరియస్ అయ్యారు ముఖ్యమంత్రి. బీఆర్ఎస్‌ను తాము పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. ప్రతిపక్ష నేత సభకు రావాలి కదా అని ప్రశ్నించారు రేవంత్. బీసీ రిజర్వేషన్ల మీదా ఆయన రియాక్ట్ అయ్యారు. కోర్టు ఆదేశాలతో బీసీ రిజర్వేషన్లపై కమిషన్ వేశామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు కమిషన్ డెసిషన్ తీసుకుంటుందని పేర్కొన్నారు సీఎం.



## మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రధాని మోదీ సంతాప లేఖ.. ఏం జరిగిందంటే..?


प्रधान मंत्री
Prime Minister
New Delhi
01 February, 202
Shri K. Chandrashekhar Rao Garu,
I received the news of the demise of Smt. Cheeti Sakalamma ... with a feeling of grief and sadness. Such a loss leaves a void ... that can never be filled.
Deeply caring and sensitive, the warmth and kindness with which she nurtured and nourished the family will always remain etched in everyone's heart.
A compassionate and empathetic person, Smt. Cheeti Sakalamma Garu will continue to live on in your memories and always hold a special place in everyone's heart. She will forever be remembered with affection and respect by all who knew her.
The values that she instilled will continue to inspire the family. Memories of the times spent with her will provide you solace and comfort in this difficult hour.
My heartfelt condolences and thoughts are with you and the family. May you gather the strength and fortitude to endure this grievous loss.
(Narendra Modi)
Shri K. Chandrashekhar Rao
No. 8-2-120/110/1/3, Road No.14
Nandi Nagar, Banjara Hills
Hyderabad

**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ప్రధాని నరేంద్ర మోదీ లేఖ రాశారు. ఇటీవల కేసీఆర్ సోదరి చీటి సకలమ్మ మృతి చెందగా.. మోదీ సంతాపాన్ని ప్రకటించారు. ఈ మేరకు లేఖ రాసిన ప్రధాని మోదీ.. కేసీఆర్ కుటుంబానికి సానుభూతిని ప్రకటించారు. సోదరి సకలమ్మ మరణానికి తాను చింతిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి, మీకు సానుభూతి తెలుపుతున్నానని మోదీ కేసీఆర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. సోదరి జ్ఞాపకాలు మీ నుంచి ఎన్నటికీ దూరం కావని అన్నారు. ఆ బాధ నుంచి త్వరగా కోలుకుని ప్రజాసేవలో నిమగ్నమవ్వాలని లేఖలో ఆకాంక్షించారు. ప్రధాని మోదీ లేఖ రాసిన విషయాన్ని బీఆర్ఎస్ పార్టీ ట్విట్టర్ ఎక్స్‌లో జత చేశారు.కాగా, కేసీఆర్ సోదరి చీటి సకలమ్మ (82) జనవరి 24న రాత్రి రాత్రి కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కన్నుమూశారు. కేసీఆర్‌కు సకలమ్మ 5వ సోదరి. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పెదిర ఆమె స్వగ్రామం. భర్త హన్మంతరావు కొన్నేళ్ల క్రితమే మృతిచెందారు. సకలమ్మకు ముగ్గురు కుమారులు. ప్రతి రాఖీపండగ నాడు ఆమె తన సోదరుడు కేసీఆర్‌కు రాఖీ కట్టేది. సకలమ్మ మృతి వార్త తెలుసుకున్న కేసీఆర్.. తన చేతికి రాఖీ కట్టే విషయాన్ని గుర్తు చేసుకొని భావోద్వేగానికి గురయ్యారు. ఆ తర్వాతి రోజు జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని అక్కకు నివాళి అర్పించారు.

శాసన సభ, మండలిలో పార్టీ విప్‌లను ప్రకటించిన బీఆర్ఎస్శాసన సభ, శాసన మండలిలలో బీఆర్ఎస్ పార్టీ విప్‌లను పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. శాసనసభలో బీఆర్ఎస్ పార్టీ విప్‌గా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్, మండలిలో బీఆర్ఎస్ పార్టీ విప్‌గా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌ను నియమిస్తూ తాజాగా ఆదేశాలిచ్చారు. కేసీఆర్ ప్రస్తుతం శాసన సభలో బీఆర్ఎస్ పక్ష నేతగా, ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తున్నారు. శాసన మండలి మాజీ స్పీకర్ మధుసూధన చారి పక్ష నేతగా కొనసాగుతున్నారు.

## ఖైరతాబాద్ ఎమ్మెల్యే మరోసారి సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్-నవభూమి:**ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. అధికార పార్టీ ఉండి ఆయన వ్యవహరిస్తున్న తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యేగా ప్రజల పక్షాన ఉంటూ ఆయన నియోజకవర్గంలో ప్రభుత్వ అధికారులు చేపట్టిన కూల్చివేతలను అడ్డుకుంటున్నారు. ఇటీవల కాలంలో ఖైరతాబాద్‌లో అక్రమనిర్మాణాలను జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేస్తుండగా దానం అడ్డుకుని హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. అధికారులకు మాస్ వార్నింగ్ ఇవ్వడం.. ఆ వీడియోలు కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా కూడా మారాయి. ఇప్పుడు మరోసారి పోలీసులు, హైడ్రాను ఉద్దేశించి దానం చేసిన కామెంట్స్ రచ్చకు దారి తీశాయి. అంతే కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోకు సంబంధించి ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు కూడా సంచలనంగా మారాయి."నేను పోలీసులతో, హైడ్రా విషయంలో కాంప్రమైజ్ అయ్యే ప్రసక్తే లేదు. మా ఏరియాకు వస్తే ఊరుకునేది లేదని రంగనాథ్‌కు చెప్పిన. పేదల ఇండ్లను కూలుస్తాం అంటే ఊరుకోను. అవసరమైతే జైలుకు పోతా కానీ కాంప్రమైజ్ కాను. నా ఇంట్లో వైఎస్, కేసీఆర్ ఫోటోలు ఉన్నాయి. రేవంత్ రెడ్డి ఫోటో ఇంకా రాలేదు" అంటూ దానం నాగేందర్ వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడీ వ్యాఖ్యలు సొంత పార్టీలో పెను సంచలనంగా మారాయి. అధికార పార్టీలో ఉండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా దానం వ్యవహరిస్తున్న తీరుపై పార్టీ నేతలు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే చింతల్ బస్తీ కూల్చివేతలకు సంబంధించి దానం వ్యవహారతీరును పరిశీలిస్తామని టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ తెలిపారు. తాజాగా మరోసారి అధికారులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలతో పాటు రేవంత్ రెడ్డి ఫోటో విషయంలో ఆయన తీరుపై కాంగ్రెస్ పెద్దల నుంచి రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి.కాగా.. ఆపరేషన్ రోప్‌లో భాగంగా ఇటీవలకాలంలో చింతల్‌బస్తీలో అక్రమ నిర్మాణాలను జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు గుర్తించి కూల్చివేతలు చేపట్టారు. స్థానికుల సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న ఎమ్మెల్యే.. అధికారులపై విరుచుకుపడ్డారు. నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడి నుంచి ఇక్కడికి బతకడానికి వచ్చి.. ఇక్కడే ఉన్న మమ్మల్ని బతకనివ్వరా అంటూ ప్రశ్నించారు. వెంటనే కూల్చివేతలను నిలిపివేయాలంటూ ఎమ్మెల్యే దానం నాగేందర్ హెచ్చరించడంతో అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. కానీ దానం చేసిన మాస్ వార్నింగ్ సంచలనం రేపింది.

## కీలక పత్రాలతో ఐటీ ఆఫీస్‌కు దిల్‌రాజు

**హైదరాబాద్-నవభూమి:**టాలీవుడ్ ప్రముఖ నిర్మాత, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు మంగళవారం ఉదయం ఐటీ కార్యాలయానికి వెళ్లారు. ఇటీవల దిల్ రాజు నివాసంలో ఐటీ తనిఖీలు జరిగిన విషయం తెలిసిందే. దాదాపు నాలుగు రోజుల పాటు ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. విచారణకు రావాలని ఐటీ అధికారులు నోటీసులు ఇవ్వడంతో వ్యక్తిగత విచారణకు హాజరయ్యారు దిల్ రాజు. డాక్యుమెంట్స్, బ్యాంకు వివరాలతో ఐటీ కార్యాలయానికి నిర్మాత విచారణకు వచ్చారు.వారం క్రితం దిల్ రాజు ఇంటితో పాటు అతని కార్యాలయం, వారి కుటుంబసభ్యుల నివాసాల్లో ఏకకాలంలో ఐటీ శాఖ సోదాలు చేశారు. పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు వివరాలు, ఐదు సంవత్సరాల పాటు చెల్లించిన ఆదాయపు పన్ను వివరాలతో విచారణకు హాజరుకావాలంటూ ఆదేశాలు ఇచ్చింది ఐటీ. ఈ నేపథ్యంలో కొన్ని పత్రాలతో పాటు ఆదాయపు చెల్లింపులపై పూర్తి స్థాయి పత్రాలతో దిల్‌రాజు విచారణకు హాజరయ్యారు. 2023 నుంచి 2025 వరకు సినీ నిర్మాణానికి సంబంధించిన పెట్టుబడులు, వచ్చిన ఆదాయాలకు సంబంధించి పూర్తి వివరాలు తీసుకురావాలంటూ ఐటీ ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఐటీకార్యాలయానికి వచ్చిన దిల్‌రాజు విచారణను ఎదుర్కొంటున్నారు. మరో రెండు గంటల్లో విచారణ ముగియనుంది. ఐటీ విచారణ ముగిసిన తర్వాత దిల్ రాజు మీడియాతో మాట్లాడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ఎమ్ఆర్ఐ స్కానింగ్ కోసం వెళ్తే.. ప్రాణమే పోయింది..



**ఏలూరు-నవభూమి:**ఏలూరు జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. డయాగ్నోస్టిక్ సిబ్బంది నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ఎమ్ఆర్ఐ స్కానింగ్ కోసం వచ్చిన ఓ మహిళ.. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోయింది. దీంతో బంధువులు డయాగ్నోస్టిక్ కేంద్రం వద్ద ఆందోళనకు దిగారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే... ఏలూరు నగరంలోని రామచంద్రరావుపేటలో సుస్మిత డయాగ్నోస్టిక్ సెంటర్ ఉంది. ఎమ్ఆర్ఐ స్కానింగ్ కోసం ఏలూరు రూరల్ మండలం ప్రతికోళ్లంకకు చెందిన రామతులసమ్మ అనే మహిళ వచ్చింది. రామతులసమ్మ గత కొన్నిరోజులుగా ఆయుష్ ఆస్పత్రిలో దయాలసిస్ చేయించుకుంటున్నారు.అయితే ఎమ్ఆర్ఐ స్కాన్ తీయించుకోవాలని అక్కడి డాక్టర్ సూచించడంతో.. రామతులసమ్మ ఎంఆర్ఐ స్కానింగ్ కోసం సుస్మిత డయాగ్నోస్టిక్ కేంద్రానికి వచ్చారు. కానీ.. డయాగ్నోస్టిక్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోయారు. రామతులసమ్మకు గతంలో పేస్ మేకర్ అమర్చారు. అయితే ఎమ్ఆర్ఐ స్కానింగ్ సమయంలో మెటల్ డిటెక్టర్ సాయంతో రామతులసమ్మను చెక్ చేయలేదు డయాగ్నోస్టిక్ సిబ్బంది. నేరుగా స్కానింగ్ మెషీన్ లోకి పంపించారు. అయితే మెషీన్‌లోని వెళ్లిన వెంటనే ఎమ్ఆర్ఐ స్కాన్ రేడియేషన్ ప్రభావంతో రామ తులసమ్మ విలవిల్లాడిపోయారు. మెషీన్‌లోనే కొట్టుమిట్టాడుతూ కన్నుమూశారు. ఎమ్ఆర్ఐ స్కానింగ్ రేడియేషన్ కారణంగా పేస్ మేకర్ ఊడిపోయి రామతులసమ్మ మరణించినట్లు తెలుస్తోంది. కానీ కార్డియాక్ అరెస్ట్ కారణంగా రామతులసమ్మ చనిపోయినట్లు స్కానింగ్ సెంటర్ సిబ్బంది చెప్తున్నారు. ఈ నేపథ్యంలో రామతులసమ్మ భర్త కోటేశ్వరరావు డయాగ్నోస్టిక్ కేంద్రం వద్ద ఆందోళనకు దిగారు. స్కానింగ్ మెషీన్‌లో తన భార్య ఉక్కిబిక్కిరి అవుతున్న విషయాన్ని గుర్తించి.. స్కానింగ్ ఆపాలని సిబ్బందిని కోరినట్లు ఆయన చెప్తున్నారు. కానీ డయాగ్నోస్టిక్ సిబ్బంది పట్టించుకోలేదని... చివరకు తన భార్య రేడియేషన్ తట్టుకోలేక చనిపోయిందంటూ ఆయన వాపోయారు. డయాగ్నోస్టిక్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తన భార్య చనిపోయిందంటూ ఆందోళనకు దిగారు.సాధారణంగా ఎమ్ఆర్ఐ స్కానింగ్ కోసం వచ్చిన వారి శరీరంపై ఎలాంటి మెటల్ వస్తువులు లేకుండా సిబ్బంది జాగ్రత్త పడతారు. అలాగే శరీరంలో ఏవైనా మెటల్ వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు అమర్చారా అనే విషయాల గురించి వారిని అడిగి వివరాలు తెలుసుకుంటారు. మెటల్ వస్తువులు ఉంటే ఎమ్ఆర్ఐ స్కానింగ్ రేడియేషన్ కారణంగా ఇబ్బంది పడే అవకాశం ఉందని ముందుగానే ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు. అయితే ఏలూరు ఘటనలో డయాగ్నోస్టిక్ సిబ్బంది మెటల్ డిటెక్టర్ సాయంతో తనిఖీ చేయకపోవటంతో ఈ దారుణం చోటుచేసుకుంది. అలాగే సదరు మహిళ తన ఒంట్లో పేస్ మేకర్ అమర్చిన విషయం డయాగ్నోస్టిక్ సిబ్బందికి తెలిపారా లేదా అనేది స్పష్టంగా తెలియాల్సి ఉంది.

# సిటీ బస్సు ప్రయాణికులకు తీపికబురు.. బస్సు కోసం ఎదురు చూడాల్సిన పనిలేదు..ఇంట్లో ఉండే..



**హైదరాబాద్-నవభూమి:**హైదరాబాద్‌లో బస్సు ప్రయాణాలు చేసేవారికి గుడ్‌న్యూస్. నిమిషాలకొద్దీ బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పనిలేదు. బస్సు మిస్ అవుతుందన్న టెన్షన్ కూడా లేదు. ఇంట్లో ఉండే ప్రశాతంగా మీరు ఎక్కాల్సిన బస్సు ఎక్కడుందో ఈజీగా తెలుసుకోవచ్చు. ఆ బస్సు బస్టాండ్‌కు ఎంతసేపట్లో వస్తుందో తెలుసుకొని తీరిగ్గా.. అక్కడకు చేరుకోవచ్చు. అందుకోసం జీహెచ్ఎంసీ బస్ ఇన్ఫర్మేషన్ సిస్టం పేరుతో సరికొత్త యాప్ రూపొందిస్తుంది. ఒకవేళ మీ చేతిలో స్మార్ట్‌ఫోన్ లేకపోయినా..ఫర్వాలేదు. బస్టాపుల్లో నిల్చుని పైకి చూస్తే చాలు ఏ బస్సు ఎప్పుడు వస్తుందో నిమిషాలతోసహా.. క్లియర్గా అక్కడ డిస్ప్లేలో కనిపిస్తుంది. హైదరాబాద్ సిటీని స్మార్టా మార్చే కీలక చర్యల్లో భాగంగా ఈ సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నారు.

బస్సులను ట్రాక్ చేసేందుకు గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా 2,800 బస్సుల్లో జీపీఎస్ సిస్టం అమర్చనున్నారు. తర్వాత బస్టాప్‌లలో ఉండే స్క్రీన్లు, ప్రత్యేక యాప్‌కు కనెక్ట్ చేస్తారు. స్మార్ట్‌ఫోన్ ఆపరేటింగ్ తెలియని వారి కోసం నగరవ్యాప్తంగా 1,250 బస్టాపుల్లో ప్రత్యేకంగా డిస్‌ప్లే స్క్రీన్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఈ స్క్రీన్లపై ఆయా రూట్లలోని బస్సు నంబర్లతో పాటు ఏ ప్రాంతం నుంచి వస్తోంది.. అది ఏ ఏరియాకు వెళ్తుందనే సమాచారం కనిపిస్తుంది. ప్రస్తుతం బస్సు ఏ ఏరియాలో ఉంది? ఎంతసేపట్లో బస్టాప్‌కు వస్తుందో కూడా డిస్‌ప్లే అవుతుంది. దీంతో పాటుగా యాప్‌లో బస్సుల లైవ్ లోకేషన్‌ను ఈజీగా తెలుసుకోవచ్చు. అందుకోసం జీహెచ్ఎంసీ ఆర్టీసీతో కలిసి పని చేస్తోంది. నెలరోజుల్లో ఈ డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటుకు టెండర్లు పూర్తి చేసి, తర్వాత మరో నెలలో సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ కొత్త పద్ధతి ద్వారా భారం పడకుండా మోడ్‌లో ఆపరేట్ చేసేందుకు జీహెచ్ఎంసీ అడ్వర్టైజ్‌మెంట్ విభాగం అధికారులు కసరత్తు చేస్తోంది. డిస్ప్లేల బాధ్యతలను టెండర్ల ద్వారా ఏజెన్సీలకు అప్పగించనున్నట్లు తెలిపారు. బస్టాప్లల్లో ఏర్పాటు చేసే స్క్రీన్ కింద, పై భాగంలో అడ్వర్టైజ్మెంట్లకు ఖాళీ స్థలం వదలనుండగా.. వాటి ద్వారా ఆదాయం పొందాలని జీహెచ్ఎంసీ అధికారులు భావిస్తున్నారు. దీని ద్వారా వచ్చే ఆదాయం ద్వారానే స్క్రీన్లు, యాప్ మెయింటెనెన్స్ చేయనున్నట్లు సమాచారం. కాగా, బస్సుల్లో సమయానికి స్కూల్స్, కాలేజీలు, ఆఫీసులకు వెళ్లేవారికి ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని జీహెచ్ఎంసీ అధికారులు చెబుతున్నారు.

# వైసీపీకి సీనియర్ ఎమ్మెల్యే దూరం?

(1వపేజీ తరువాయి)కూటమి ప్రభుత్వాన్ని విమర్శించినదీ పెద్దగా లేదు అని గుర్తు చేస్తున్నారు. ఆయన అధికార పార్టీ పట్ల సానుకూలంగా ఉండడం వల్లనే ఈ విధంగా చేస్తున్నారా అన్నది కూడా చర్చకు వస్తున్న విషయం. ఆయన రాజకీయ ప్రస్తానం చూస్తే ఏకంగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సీనియర్ గా ఉన్నారు. 2009లో టీడీపీ నుంచే రాజకీయ అరంగేట్రం చేసిన బాల నాగిరెడ్డి ఆ తరువాత వైఎస్సార్ మీద అభిమానంతో కాంగ్రెస్‌లో చేరిపోయారు. అక్కడ నుంచి ఆయన వైసీపీలోకి వచ్చారు. 2014, 2019, 2024 లలో ఆయన వరసగా వైసీపీ నుంచి గెలిచారు. అయితే పార్టీ 2019లో అధికారంలోకి వచ్చినపుడు ఆయన మంత్రి పదవిని ఆశించారు. అప్పటికి మూడు సార్లు గెలిచి సీనియర్‌గా ఉన్నందువల్ల ఆయన మినిస్టర్ కావాలని కోరుకున్నారు. అయితే వైసీపీ అధినాయకత్వం బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డినే అయిదేళ్ళూ కొనసాగించింది. దాంతో సామాజిక సమీకరణలు సరితూగక ఆయనకు మంత్రి పదవి ఇవ్వలేకపోయింది. అయితే జిల్లా అధ్యక్ష పదవిని కట్టబెట్టింది. కానీ కొన్నాళ్ళు మాత్రమే చేసి ఆయన దానిని వదిలేశారు. అలా తన అసంతృప్తిని ఆయన అపుడే వ్యక్తం చేశారు. ఇపుడు చూస్తే పార్టీ ఎటూ అధికారం లో లేదు. దాంతో ఆయన విపక్ష ఎమ్మెల్యేగా చేయాల్సింది ఏమీ లేదని భావిస్తున్నారు అని అంటున్నారు. ఇక అసెంబ్లీకి కూడా వెళ్ళకుండా వైసీపీ తీసుకున్న నిర్ణయంతో కూడా ఆయన కొంత అసంతృప్తితో ఉన్నారని అంటున్నారు. ఈ క్రమంలోనే ఆయన పార్టీ ఆదేశాలను పెద్దగా పాటించడం లేదని అంటున్నారు. ఇదిలా ఉంటే తాజాగా కర్నూల్ లో వైసీపీ రాయలసీమ రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా పార్టీ సమావేశానికి కూడా బాల నాగిరెడ్డి గైర్ హాజరు కావడంతో ఆయన వేరే ఆలోచనలు చేస్తున్నారా అన్న చర్చ అయితే పార్టీ వర్గాలలో ఉంది అంటున్నారు. ఇక బాల నాగిరెడ్డి రాజకీయ అరంగేట్రమే టీడీపీ నుంచి కాబట్టి ఆయన మళ్ళీ సైకిలెక్కుతారా అన్నది పుకార్లుగా షికారు చేస్తోంది. దీనికి ఆయన నుంచే స్పష్టత రావాల్సి ఉందని అంటున్నారు. ఆయనతో పాటు రాయలసీమకు చెందిన మరో ఎమ్మెల్యే కూడా వేరే ఆలోచనలు చేస్తున్నారు అని అంటున్నారు. మరె ఈ పుకార్లు నిజమే అయితే వైసీపీకి దెబ్బ పడినట్లే అని అంటున్నారు.

# ఎత్తులు వేసి ప్రత్యర్థులను చిత్తు చేసిన బాలయ్య

**హిందూపురం-నవభూమిప్రతినిధి**

హిందూపురంలో బాలయ్య రాజకీయ చాణక్యం.. నాలుగేళ్ల క్రితం పరాభవానికి ప్రతీకారం! సినిమాల్లో ఎన్నో ఫైటింగ్ సీన్లలో ప్రత్యర్థులను దెబ్బతీయడం హీరో బాలయ్యకు కొత్తకాదు. కానీ, ఎమ్మెల్యేగా తొలిసారి ప్రత్యర్థులను దెబ్బకు దెబ్బ తీశారు. సినిమాల్లో ఎన్నో ఫైటింగ్ సీన్లలో ప్రత్యర్థులను దెబ్బతీయడం హీరో బాలయ్యకు కొత్తకాదు. కానీ, ఎమ్మెల్యేగా తొలిసారి ప్రత్యర్థులను దెబ్బకు దెబ్బ తీశారు. నాలుగేళ్ల క్రితం తనకు ఎదురైన పరాభవానికి ప్రతీకారం తీర్చుకున్నారు. హిందూపురం మున్సిపాలిటీలో పసుపు జెండా ఎగరేసి తనలో పరిణితి చెందిన రాజకీయ చాణక్యుడు కూడా ఉన్నారని నిరూపించారు. హిందూపురం టీడీపీకి ఎంతో ప్రత్యేకం.. 1983లో టీడీపీ ఆవిర్భవించిన నుంచి ఇప్పటివరకు ఆ పార్టీకి ఎదురులేదు. ముఖ్యంగా నందమూరి కుటుంబానికి హిందూపురంతో విడదీయరాని అనుబంధం ఉంది. గతంలో టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ప్రాతినిధ్యం వహించిన ఈ నియోజకవర్గం నుంచి ప్రస్తుతం ఆయన కుమారుడు, సినీ కథానాయకుడు బాలక్రిష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. 2014లో తొలిసారి రాజకీయ ఆరంగేట్రం చేసిన బాలయ్య ఆ తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లోనూ గెలిచారు. పార్టీకి పట్టు ఉండటం వల్ల ఆయన గెలుపును పెద్దగా చెప్పుకోవాల్సిన పనిలేదని ఆయన వ్యతిరేకులు విమర్శిస్తుంటారు. అయితే నిన్న జరిగిన మున్సిపల్ చైర్మన్ ఉప ఎన్నికల్లో బాలయ్య చాణక్యం తొలిసారి బయటపడింది. శాసనసభ్యుడిగా ఆయన సాధించిన విజయం కన్నా, ఇది గొప్పదనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. హిందూపురం మున్సిపాలిటీలో మొత్తం 38 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో వైసీపీ నుంచి గెలిచిన వారు 30 మంది. టీడీపీకి ఆరుగురు ఉండగా, ఎంఐఎం, స్వతంత్ర అభ్యర్థులు ఇద్దరు గెలిచారు. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో హిందుపురంలో వైసీపీ గెలవడం రాష్ట్రంలో పెను సంచలనంగా మారింది. టీడీపీ కంచుకోటలో ఇంకోపార్టీ జెండా ఎగరడం అదే తొలిసారి. అప్పట్లో వైసీపీ విజయం టీడీపీకి, వ్యక్తిగతంగా బాలయ్యకు తీరని అవమానంగా భావించారు. అయితే ఆ ఎన్నికల్లో గెలుపు కోసం బాలయ్య ఎంతో కష్టపడ్డారు. కానీ, అప్పటి ప్రభుత్వ పెద్దలు హిందుపురంపై స్పెషల్ ఫోకస్ చేసి అన్నివిధాల బాలయ్యను నిలువరించి, నిస్సహాయుడిని చేసి హిందుపురంలో 30 మంది కౌన్సిలర్లను గెలిపించుకున్నారు. దీనిని తనకు జరిగిన అవమానంగా భావించిన బాలయ్య ఇప్పుడు ప్రతీకారం తీర్చుకున్నారు. జగన్ 2021 ఎన్నికల్లో వైసీపీ ఏ విధంగా గెలిచిందో అదే పంథాను అనుసరించి.. హిందుపురంలో టీడీపీ జెండా ఎగిరేలా చేశారని ఎమ్మెల్యే బాలక్రిష్ణపై టీడీపీ క్యాడర్ ప్రశంసల జల్లు కురిపిస్తోంది. హిందుపురం మున్సిపాలిటీ టీడీపీ కైవసం చేసుకోవడం వల్ల అసెంబ్లీ ఎన్నికల్లో మొదలైన జైత్రయాత్ర ఇప్పుడు పరిపూర్ణమైనట్లు భావిస్తోంది. మున్సిపల్ చైర్మనుగా తన అనుచరుడని గెలిపించుకోడానికి ఎమ్మెల్యే బాలయ్య తన అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. పార్టీకి కార్యకర్తలకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. బాలయ్య ముందుండి నడవడంతో హిందుపురంలో వైసీపీకి మెజార్టీ ఉన్నా, చైర్మన్ అభ్యర్థిని గెలిపించుకోలేకపోయింది. ఏదిఏమైనా ఈ ఎన్నికతో సినిమాల్లో కథానాయకుడిగా వెలుగొందుతున్న బాలయ్య పాలిటిక్స్ లో సరైన నాయకుడిగా నిరూపించుకున్నారని అభినందనలు పొందుతున్నారు.

## జంపింగులకు నోటీసులు!

(1వపేజీ తరువాయి)ఉన్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ ఎస్ వారిపై పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ ప్రసాదరావుకు ఆరు మాసాల కిందటే బీఆర్ ఎస్ ఫిర్యాదు చేసింది. అయినా.. ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం తొలుత హైకోర్టు.. తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నాలుగు నెలల్లో చర్యలు తీసుకోవాలని గతంలోనే తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. అయినప్పటికీ ఎలాంటి పురోగతి లేకపోవడంతో బీఆర్ఎస్ సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. స్పీకర్‌ను తప్పుపడుతూ.. కోర్టు వ్యాఖ్యలు చేసింది.

## బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తాం

(1వపేజీ తరువాయి)సర్వేలో ఎందుకు పాల్గొనలేదని నిలదీశారు. కులగణన సర్వే 50 రోజులు జరిగితే.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు పాల్గొనలేదని..సర్వేలు భూమి వివరాలు చెప్పాలని ఫామ్ లో ఒక కాలమ్ ఉంటే కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు ఎవరూ సమాచారం ఇవ్వలేదని సీఎం రేవంత్ విమర్శించారు. 3.54 కోట్ల మంది సర్వేలో పాల్గొంటే అందరూ భూముల వివరాలు ఇచ్చారని.. కానీ కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు భయపడి వివరాలు ఇవ్వలేదని సీఎం రేవంత్ అన్నారు.

## ఏపీ బడ్జెట్‌పై కసరత్తు

(1వపేజీ తరువాయి)ప్రజల ఆశలు కూడా అంతే స్థాయిలో ఉన్నందున బడ్జెట్ లో పథకాలకు నిధులు ఇవ్వడం అన్నది తప్పనిసరి అవుతోంది. వచ్చే ఏడాది నుంచి తల్లికి వందనం పథకం అలాగే మరికొన్ని పథకాలను ప్రారంభించాలని కూటమి ప్రభుత్వం పెద్దలు భావిస్తున్నారు. గత ఏడాదిన ప్రారంభించిన ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్ల పథకం కింద ఈసారి మూడూ ఇవ్వాల్సి ఉంటుంది. దాని కోసం మూడు వేల రూపాయల దాకా ఖర్చు అవుతుందని లెక్క వేస్తున్నారు. అలాగే అన్నదాతా సుఖీభవ పథకం కూడా అమలులోకి తేవాల్సిన అనివార్యత ఏర్పడింది. ఏపెలెఓ మొత్తం 57 లక్షల మంది రైతులు ఉన్నారు. వారందరికీ ఏడాదికి ఇరవై వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అందులోనే కేంద్రం అందించే కిసాన్ యోజన పథకం నిధులను కూడా రైతులకు ఈ పథకం ద్వారా న్యాయం చేయాలనుకుంటోంది. దీనికి కూడా బడ్జెట్ లో అధిక నిధులు అవసరం అవుతాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో భారీగా నిధులను కేటాయించేందుకు చూస్తున్నారు. సంక్షేమం విషయంలో తమ ప్రభుత్వం తగ్గేది లేదని చాటి చెప్పడం జరుగుతుందని అంటున్నారు. అభివృద్ధికి కూడా పెద్ద పీట వేయాల్సిన అవసరం ఉంది. దాంతో కూటమి ప్రభుత్వం ఏపీలో మౌలిక సదుపాయాల కల్పనకు వివిధ జిల్లాలలో అభివృద్ధి పనులకు కేంద్రం అందించే పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్స్ ని ఇచ్చే విషయంలోనూ నిధులను బడ్జెట్ లో చూపించాల్సి ఉంది. మొత్తానికి చూస్తే ఏపీ బడ్జెట్ ఎంత అన్నది ఆసక్తిని పెంచుతోంది. మూడు లక్షల కోట్ల పై మాటగా ఏపీ బడ్జెట్ ఉండవచ్చు అని అంటున్నారు. ఇప్పటికే వివిధ శాఖల నుంచి ప్రతిపాదనలను కోరిన ఆర్థిక శాఖ బడ్జెట్ ని రూపొందించే పనిలో బిజీగా ఉంది. పయ్యావులకు మాత్రం ఈసారి బడ్జెట్ కత్తి మీద సాముగానే ఉండొచ్చు అని అంటున్నారు. ఇదిలా ఉంటే ఈ నెల 6న రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఈ సందర్భంగా బడ్జెట్ సమావేశాల తేదీని ఖరారు చేస్తారు అని అంటున్నారు. ఈ నెల 24 నుంచి ఏపీ బడ్జెట్ సమావేశాలు జరుగుతాయని ప్రచారంలో ఉంది.

## సచివాలయాన్ని పేల్చేస్తాం..

(1వపేజీ తరువాయి)రావుని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. అతనికి నకిలీ ఐడీ కార్డు తయారు చేసి ఇచ్చిన.. మైనార్టీ డిపార్ట్‌మెంట్ సెక్షన్ ఆఫీసర్ డ్రైవర్ ని సైతం అరెస్ట్ చేశారు. వరుసగా తెలంగాణ సచివాలయంలో ఈ తరహా ఘటనలు చోటు చేసుకోవడం పట్ల సర్వత్రా ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. సచివాలయ భద్రతపై నేతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ తరహా ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## జారుతున్న వైసీపీ నేతలు

(1వపేజీ తరువాయి)టార్గెట్ చేస్తున్నారు. ఏపీలో ఉన్న పార్టీలకు మట్టి అంటకుండాపై స్థాయిలోనే అంతా జరిగిపోతోంది అని అంటున్నారు. వారంతట వారే పార్టీకి దూరంగా ఉండడం, రాజీనామాలు చేసి వెళ్ళిపోవడం, సైలెంట్‌గా ఉండడం వంటివి కొత్త రాజకీయ వ్యూహాలే అని అంటున్నారు. దీని వల్ల కూటమి పార్టీల పాత్ర బయటకు అయితే ఏమిటి అన్నది తెలియదు. విజయసాయిరెడ్డి ఇష్యూలో అదే జరిగిందని అంటున్నారు. ఇక మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విషయంలో ఇపుడు టార్గెట్ చేస్తున్నారు అని అంటున్నారు అలాగే ఇంకా చాలా మంది నేతలను జగన్ చుట్టూ ఉన్న వారిని కూడా లక్ష్యంగా చేసుకుంటారు అని ప్రచారం జరుగుతున్న వేళ మరో నాలుగేళ్ళకు పైగా అన్నీ తట్టుకుని నిలబడాల్సివస్తుందని జగన్ నేతలకు చెప్పనున్నారు అంటున్నారు. పార్టీ కోసం పనిచేయాలంటే కష్టాలను నష్టాలను ఓర్వడమే కాదు కూటమి వైపు నుంచి వచ్చే వాటిని అన్నీ తట్టుకుని నిలబడాల్సి ఉంటుందని జగన్ పార్టీ క్యాడర్ కి సందేశం ఇస్తున్నారు అని అంటున్నారు. తనతో ఉండి పోరాడాలసిన వారే కొనసాగుతారు అన్నది జగన్ ఆలోచనగా చెబుతున్నారు. ఇది చాలా క్లిష్టమైన సమయంగా వైసీపీకి ఉంది అని అంటున్నారు. ఈ సమయంలో పార్టెలెఓ నేతలు అంతా ఒక్కటిగా నిలిచి పోరాడితే మేలు జరుగుతుందని జగన్ భావిస్తున్నారు. ఇక దూకుడు నిర్ణయాలను కూడా ఆయన పార్టీ పరంగా తీసుకోబోతున్నారు అని అంటున్నారు. జిల్లాల వారీగా నాయకుల పనితీరుని బేరీజు వేసుకుని మరీ పనిచేసే వారికే బాధ్యతలు అప్పగిస్తారు అని అంటున్నారు. కూటంతిఓ రాజకీయ యుద్ధానికి సిద్ధంగా ఉన్న వారే వైసీపీని ముందుకు తీసుకెళ్తారని జగన్ ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. ఎన్ని రకాలైన కేసులు పెట్టాలో అన్నీ పెడతారని వాటికి సిద్ధం అయిన వారే పార్టీకి కావాలన్నది జగన్ ఉద్దేశ్యంగా చెబుతున్నారు. అంతే తప్ప ఒత్తిళ్ళు ఉంటాయని జడిస్తే మాత్రం ఇబ్బందులు తప్పవని అంటున్నారు. ఇక పార్టీ కోసం ఎందాకైనా అన్న వారే తనతో ఉండాలని లేని వారు తమ ఇష్టం వచ్చిన నిర్ణయం తీసుకోవచ్చు అన్నదే జగన్ ఇవ్వబోయే డైరెక్షన్‌గా ఉంది అని అంటున్నారు. మొత్తానికి చూస్తే జగన్ తాను రెడీ మీరు రెడీనా అన్నదే నేతలను ప్రశ్నిస్తూ సూచిస్తున్నట్లుగానే అర్థం చేసుకోవాలని అంటున్నారు. మరి ఎంతమంది ఈ నాలుగేళ్ళకు పైగా పార్టీ కోసం నిలబడి కేసులు అరెస్టులను ఎదుర్కొంటారు అన్నదే చర్చగా ఉంది.

## త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

(1వపేజీ తరువాయి)ఎన్నికలను ప్రతి ఒక్కరు సీరియస్ గా తీసుకోవాలని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. కూటమి ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని అన్నారు. ఎన్నికల ప్రచారానికి సోషల్ మీడియాను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు.





## హస్తినలో 'జైలు' రాజకీయం!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ఈ దఫా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జైలు చుట్టూ తిరుగుతున్నాయి. జైలుకు వెళ్లివచ్చిన నేతలు సానుభూతి కోసం పదే పదే తమను అన్యాయంగా కారాగారంలో పడేశారని ప్రచారం చేసుకుంటున్నారు. కరుడుగట్టిన నిజాయితీపరుడినని చెప్పుకొనే ఆప్ అధినేత కేజ్రీవాల్ మద్యం పాలసీ స్కాం కేసులో జైలుకెళ్లిన సంగతి తెలిసిందే. ఆయన సన్నిహితుడు సిసోదియా కూడా ఇదే కేసులో అరెస్టయి 17 నెలలు జైల్లో ఉన్నారు. వీరిద్దరి కంటే ముందు నాటి ఆరోగ్యమంత్రి సత్యేంద్ర జైన్ మనీలాండరింగ్ చట్టం కేసులో అరెస్టయి ఏడాదిన్నర జైల్లో గడిపారు. ఈ ముగ్గురూ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్నారు. ఇక వాయవ్య ఢిల్లీ అల్లర్ల కేసు (2020) నిందితులైన తాహిర్ హుస్సేన్, షిఫా-ఉర్-రహమాన్ కూడా జైల్లో ఉండి నామినేషన్లు వేశారు. నిరుడు లోక్‌సభ ఎన్నికలకు ముందు మద్యం పాలసీ స్కాం కేసులో కేజ్రీవాల్ అరెస్టయ్యారు. కానీ సీఎం పదవికి అప్పుడు రాజీనామా చేయలేదు. ప్రచారం నిమిత్తం ఆయనకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరుచేసింది. ఆయన విస్తృతంగా ప్రచారం చేసినప్పటికీ ఢిల్లీలో ఒక్కచోట కూడా ఆప్ అభ్యర్థిని గెలిపించుకోలేకపోయారు. పంజాబ్‌లో ఆప్ మూడు స్థానాలకే పరిమితమైంది. హరియాణాలో కనీసం పోటీ ఇవ్వలేకపోయింది. కేజ్రీవాల్‌పై ఓటర్లు సానుభూతి చూపలేదని, ఆప్‌పై వారు పెట్టుకున్న భ్రమలు తొలగిపోయాయని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. అయితే, సీఎం కార్యాలయానికి వెళ్లరాదని.. ఫైళ్లపై సంతకాలు చేయరాదన్న షరతులతో మద్యం కేసులో సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.

## మహాకుంభ్‌లో భూటాన్ రాజు



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక మేళాగా ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ్ )లో భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యేల్ వాంగ్‌చుక్ మంగళవారంనాడు పాల్గొన్నారు. త్రివేణి సంగమంలో పవిత్రస్నానం చేసి, గంగాహారతిలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆయన వెంట హాజరయ్యారు. ఇండియా-భూటాన్ మధ్య ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ భూటాన్ రాజు మహాకుంభ్‌కు హాజరుకావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇరుదేశాలకు చెందిన పలువురు ప్రముఖులు, భక్తులు గంగాహారతి, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీనికి ముందు సోమవారంనాడు మహాకుంభ్‌లో పాల్గొనేందుకు భూటాన్ రాజు ప్రయాగ్‌రాజ్ చేరుకోవడంతో ఆయనను చౌదరి చరణ్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సాదర స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి ఆయన క్షేమసమాచారాలు అడిగి తెలుసుకున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలతో కళాకారులు వాంగ్‌చుక్‌కు స్వాగతం పలికారు.

## ఎన్నికలకు సిద్ధం.. 35,000 మంది పోలీసులు, సీసీ టీవీ నిఘా..



**న్యూఢిల్లీ-నవభూమి:**(ఫిబ్రవరి 5న) జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం రాష్ట్రం గట్టి భద్రతా ఏర్పాట్లను చేపట్టింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి జోక్యం జరగకుండా, దేశ రాజధానిలో ఎన్నికల భద్రతను ఢిల్లీ పోలీసులు పటిష్టంగా ఏర్పాటు చేశారు. దీంతో ఓటింగ్ రోజు ముందు ప్రజలకు శాంతి సందేశం ఇవ్వడానికి అధికారులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో మేము రూట్ మార్చ్, ఫ్లాగ్ మార్చ్‌లను పెంచామని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సౌత్ ఈస్ట్, రవి కుమార్ సింగ్ అన్నారు. ప్రజల ప్రవర్తనకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ పరిణామాలు ఏర్పడకుండా ఉండేందుకు మేము నిఘా పెంచినట్లు తెలిపారు. ప్రజలు శాంతిగా ఉండాలని, ఎన్నికల్లో పాల్గొని, ఓటు హక్కు ఉపయోగించుకోవాలని సందేశం ఇస్తున్నట్లు చెప్పారు పోలీసులు.

వివిధ భద్రతా చర్యలు

ఈ క్రమంలో పారామిలిటరీ దళాలు, పోలీసు సిబ్బంది, సీసీ టీవీ క్యామరాలు, %ూ×% ఆధారిత కెమెరాలు, డ్రోన్లతో సహా వివిధ భద్రతా చర్యలను పోలీసులు అమలు చేస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు చోటుచేసుకోకుండా ఉండేందుకు, ఢిల్లీ పోలీసులే కాకుండా ప్రత్యేకమైన ఇంటెలిజెన్స్ వ్యవస్థలను కూడా వినియోగిస్తున్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల రోజు ఫిబ్రవరి 5న అల్లర్లను అడ్డుకోవడానికి ముఖ్యమైన ప్రాంతాల్లో భద్రతా చర్యలు మరింత పెంచుతున్నారు.

**ధన రవాణా, మద్యం స్వాధీనం**

దీంతోపాటు ఎన్నికల రోజు సురక్షిత వాతావరణం ఉండేందుకు నగరంలోని కీలక ప్రాంతాల్లో ముఖ గుర్తింపు సాంకేతికత ను ఉపయోగిస్తున్నారు. అదనంగా %ూ×%-ఆధారిత కెమెరాలు, డ్రోన్లు, 30,000 మంది పోలీసు సిబ్బంది, 6,525 మంది శిక్షణ లేని సిబ్బందిని కూడా నియమించారు. నవంబర్ 7 నుంచి ఫిబ్రవరి 2 వరకు అధికారులు ఇప్పటివరకు రూ.11,23,97,697 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇదే సమయంలో 1,08,258 లీటర్ల మద్యాన్ని రూ.3,59,65,843 విలువతో స్వాధీనం చేసుకున్నారు. వీటి విషయంలో 1315 నమోదు చేయబడ్డాయి. 1353 మందిని అరెస్టు చేశారు.

## ఎన్నికల రోజు భద్రతా ఏర్పాట్లు



**చెన్నై-నవభూమి:** అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసాలో పనిచేస్తున్న తమిళ యువకుడు.. అమెరికా యువతి ఒక్కటయ్యారు. వీరిద్దరి వివాహం తిరువణ్ణామలై జిల్లా సెంజిలోని ఒక ప్రసిద్ధ ఆలయంలో హిందూ సంప్రదాయం ప్రకారం జరిగింది. జిల్లాలోని చెయ్యారు తాలూకా అనకావూరు గ్రామానికి చెందిన భాస్కరన్ పెద్ద కుమారుడు అవినాష్ నాసాలో పని చేస్తున్నారు.

అతడు అమెరికాకు చెందిన కేథరీన్ ఓసేవి అనే యువతిని ప్రేమించగా, రెండు కుటుంబ పెద్దల అనుమతితో వివాహం చేసుకునేందుకు నిర్ణయించుకున్నారు. దీంతో తమ కులదైవమైన సెంజిలోని ఏకాంబరేశ్వరాలయం(%జున్ఝుఎమ్ఝుతీవంష్ట్రఝుతీఝు ూవఎజూశ్రీవ%)లో వీరి వివాహం ఆదివారం ఘనంగా జరిగింది. హిందూ సంప్రదాయం ప్రకారం జరిగిన ఈ వివాహంలో ఇరు కుటుంబ సభ్యులు, సన్నిహితులు, బంధుమిత్రులు పాల్గొని, వధూవరులను ఆశీర్వదించారు.

## హడలెత్తించిన ఒంటరి ఏనుగు..



**బెంగళూరు-నవభూమి:** ఒంటరి ఏనుగును చూసిన స్థానికులు హడలెత్తిపోయారు. హొసూరు సమీపంలోని రాయకోట వైపు నుంచి తిమ్మేపల్లి పంచాయతీ ప్రాంతం కొండపైకి ఆదివారం ఒంటరి ఏనుగు రావడంతో అటుగా వెళ్తున్న ప్రజలు ఒక్కసారిగా బెంబేలెత్తిపోయారు. ప్రజల సందడితో ఎవ్వరికీ ఇబ్బంది కలగకుండా అదే చోట నిలబడి పోయింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకుని ఏనుగు పిల్లను అటవీ ప్రాంతానికి మళ్ళించేందుకు మళ్లించారు. రాయకోట అటవీ పరిధిలో ఊడేదుర్గం రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఏనుగులు అధికంగా ఉన్నాయి. ఏనుగులు తరచూ పట్టణంలోకి ప్రవేశించి పంటలను ధ్వంసం చేస్తుంటాయి.

# 63 మందిని నిర్బంధించిన అస్సాంపై సుప్రీం ఆగ్రహం



**అస్సాం-నవభూమి** అస్సాం రాష్ట్ర ప్రభుత్వంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ముఖ్యంగా రాష్ట్రంలోకి అక్రమంగా చొరబడ్డ వారిని వారి స్వస్థలాలకు పంపించి వేయకుండా చాలా కాలంగా నిర్బంధించడం పట్ల ఫైర్ అయింది. వారందరినీ తిరిగి పంపించేందు కోసం శుభ ముహూర్తం కోసం వేచి చూస్తున్నారా అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరింది. వెంటనే వారందరినీ వారి స్వస్థలాలకు పంపించి వేయమంటూ ఆదేశాలు జారీ చేసింది. అందుకోసం రెండు వారాల సమయం కూడా కేటాయించింది. ఆ పూర్తి వివరాలు మీకోసం. అస్సాం సహా మరికొన్ని రాష్ట్రాల్లోకి విదేశాల నుంచి అనేక మంది వలసగా వస్తున్నారు. ఇటీవల కాలంలో అక్రమ చొరబాట్లు ఎక్కువ కాగా.. అస్సాం సర్కారు చర్యలు చేపట్టింది. ఈక్రమంలోనే మొత్తం 270 మంది అక్రమ వలసదారులను అరెస్ట్ చేసింది. ఆపై వారిని నిర్బంధ కేంద్రాల్లో బంధించింది. అయితే గతేడాది డిసెంబర్ 9వ తేదీన ఇందులో అనేక మందిని వారి స్వస్థలాలకు పంపించి వేసింది. కానీ 63 మందిని మాత్రం అలాగే ఉంచింది. ఇప్పటికీ వీరంతా నిర్బంధ కేంద్రాల్లోనే ఉంటున్నారు. దీనిపై ఇప్పటికే సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు అయింది. అక్రమంగా అస్సాం రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్న వారిని దేశాలకు పంపాలంటూ వచ్చిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం నేడు విచారణ చేపట్టింది. ఈక్రమంలోనే సుప్రీం కోర్టు అస్సాం రాష్ట్ర సర్కారుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎవరైనా దేశంలోకి అక్రమంగా ప్రవేశించారని తెలిసిన వెంటనే వారిని తిరిగి వారి స్వస్థలాలకు పంపించి వేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. అలాగే నిర్బంధంలో ఉన్న విదేశీయులను వారి దేశాలకు పంపమని చెబితే.. వారు చిరునామా తెలియదని చెప్పి.. తరలింపు ప్రక్రియ ప్రారంభించడానికి నిరాకరిస్తున్నారంటూ మండి పడింది. చిరునామాలు తెలియవనే కారణంతో వారిని జీవితాంతం నిర్బంధ కేంద్రాల్లోనే ఉంచలేము కదా అంటూ అస్సాం సర్కారుకు తెలిపింది. వారికి వారి చిరునామాలు తెలిసిన తెలియకపోయినా.. అవి మనం పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని న్యాయస్థానం తేల్చి చెప్పింది. చొరబాటు దార్లను పంపడం కోసం మీరేమీ ముహూర్తం చూడడం లేదు కదా అంటూ ప్రశ్నించింది. అలాగే నిర్బంధ కేంద్రాల్లో ఉంచిన 63 మంది విదేశీయులను రెండు వారాల్లోగా పంపించి వేయాలంటూ జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. అస్సాంలో ఉన్న అన్ని నిర్బంధ కేంద్రాల నుంచి ఇప్పటి వరకు మొత్తం ఎంత మందిని వారి స్వస్థలాలకు పంపించారనే నివేదికలను సమర్పించాలని కూడా అస్సాం ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అలాగే నిర్బంధ కేంద్రాల్లో ఉన్నవారికి సరైన వసతి సౌకర్యాలు కల్పించాలని కూడా చెప్పింది. అంతేకాకుండా ప్రతి 15 రోజులకు ఒకసారి రాష్ట్రంలో ఉన్న నిర్బంధ కేంద్రాలను సందర్శించడానికి కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అధికారుల కమిటీని విడిగా ఏర్పాటు చేయాలని వివరించింది. ఈక్రమంలోనే విచారణనను ఫిబ్రవరి 25వ తేదీకి వాయిదా వేసింది.

### పోలీస్ నియామకాల్లో అవినీతి బయటపెట్టిన

# మహిళా ఐపీఎస్‌పై హత్యాయత్నం..!



**చెన్నై-నవభూమి:** ఎస్‌ఐ, కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల్లో జరిగిన అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చిన సీనియర్ మహిళా ఐపీఎస్ అధికారిణిపై హత్యాయత్నం సంచలనంగా మారింది. తనను హతమార్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ ఆమె డీజీపీకి రాసిన లేఖ వెలుగులోకి రావడంతో తీవ్ర కలకలం సృష్టిస్తోంది. తమిళనాడు జరిగిన ఈ ఘటనపై రాజకీయ దుమారం రేగుతోంది. డీజీపీ శంకర్ జివాల్‌కు అడిషినల్ డీజీపీ కల్పనా నాయక్ రాసిన లేఖ ప్రస్తుతం వైరల్ అవుతోంది. గతేడాది జులై 29న చెన్నై నగరంలోని తన కార్యాలయం మంటల్లో కాలిబూడిదయ్యిందని, ఇది ప్రమాదవశాత్తూ జరిగింది కాదని ఆ లేఖలో ఏడీజీపీ పేర్కొన్నారు. తనను లక్ష్యంగా చేసుకుని జరిగిన హత్యాయత్నంగా అనుమానిస్తున్నట్లు ఆమె ఆరోపించారు. పోలీసు శాఖలో ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు, జైలువార్డెన్లు, ఫైర్ సిబ్బంది ఉద్యోగాల భర్తీలో జరిగిన అవకతవకలను బయటపెట్టిన కొద్ది రోజులకే ఈ ఘటన జరిగిందని సీనియర్ ఐపీఎస్ అధికారిణి లేఖలో తెలిపారు. కోర్టు ఉత్తర్వులను అధిగమించి ఎంపిక ప్రక్రియను అడ్డుకుని.. దానివల్ల జరగబోయే అప్రతిష్ట నుంచి రాష్ట్ర ప్రభుత్వాన్ని కాపాడానని చెప్పారు. అదే తన ప్రాణాలకు ముప్పు తెచ్చిపెట్టిందని కల్పనా నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. ఘటన జరిగిన రోజున కొద్ది నిమిషాలకు ముందు కార్యాలయానికి తాను వెళ్లుంటే ప్రాణాలు పోగొట్టుకునే దాన్ని అని చెప్పారు. ఉద్యోగాల ఎంపిక తన ఆమోదం లేకుండానే జరిగినట్లు ఆమె ఆరోపించారు. ఓ సీనియర్ పోలీసు అధికారి ప్రాణాలకే భద్రత లేనప్పుడు, సాధారణ పోలీసుల పరిస్థితి ఏంటి? అని నాయక్ ప్రశ్నించారు. ప్రమాదం జరిగిన 15 రోజుల తర్వాత ఆగస్టు 15న తాను డీజీపీకి లేఖ రాశానని, దాని ప్రతులను హోంశాఖ కార్యదర్శి, చెన్నై పోలీస్ కమిషనర్‌కు కూడా పంపినట్లు చెప్పారు. తనను లక్ష్యంగా చేసుకుని జరిగిన హత్యాయత్నంపై విచారణ జరపాలంటూ ఆరునెలల కిందటే ఆదేశించినప్పటికీ నివేదిక ఇంకా బయటపెట్టలేదన్నారు. అటు, ఏడీజీపీ కల్పనా నాయక్ ఆరోపణలపై డీజీపీ వివరణ ఇచ్చారు. ఆమె ఆఫీసులో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదం వెనుక ఎలాంటి కుట్రలు లేవన్నారు. ఆ సంఘటన ప్రమాదం గానే భావిస్తున్నామని డీజీపీ శంకర్ జివాల్ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే డీజీపీ ఆఫీసులో ఆమె ఫిర్యాదు చేశారని, దీనిపై ఎగ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని వివరించారు. ఫోరెన్సిక్, అగ్నిమాపకశాఖ నిపుణులు, విద్యుత్ శాఖ అధికారుల ఘటనా స్థలిలో ఆధారాలు సేకరించినట్లు పేర్కొన్నారు. అటు, ఏడీజీపీ లేఖపై మాజీ సీఎం, ప్రతిపక్షనేత ఎడిప్పాడి పళనిసామి స్పందిస్తూ.. ఉద్యోగ నియామకాల్లో అవినీతిని బట్టబయలు చేసిన ఓ సీనియర్ ఐపీఎస్ అధికారిణిపై హత్యాయత్నం జరగడం దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. దీనిపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఏం చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. దీనిపై మద్రాసు హైకోర్టు న్యాయమూర్తితో జ్యుడీషియల్ విచారణ జరిపించాలని పీఎంకే అధినేత ఎస్ రాందాస్ డిమాండ్ చేశారు.


# ఎన్నికల వేళ ఢిల్లీ సీఎంకు పోలీసుల షాక్..



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీలో గురువారం రోజు ఎన్నికలు జరగబోతుండగా.. ప్రస్తుత ముఖ్యమంత్రి అతిశీకి పోలీసులు గట్టి షాక్ ఇచ్చారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారంటూ ఆమెపై కేసు నమోదు చేశారు. అలాగే ఆమె మద్దతు దారులైన మరో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారు ఓ హెడ్ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడగా.. వారిపై కూడా కేసులు నమోదు చేశారు. దీంతో ఆప్ నేతలంతా.. పోలీసులు కావాలనే తమపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపిస్తున్నారు. బీజేపీ నేతలు ఎన్నికల్ కోడ్‌ను ఉల్లంఘించినా వారిపై చర్యలు తీసుకోకుండా.. తమపై కేసులు పెడుతున్నారంటూ కామెంట్లు చేస్తున్నారు. ఆ పూర్తి వివరాలు మీకోసం. గురువారం రోజే ఢిల్లీలో ఎన్నికలు జరగబోతుండగా.. మంగళవారం రోజు పోలీసులు ఆమ్ ఆద్మీ పార్టీ నేతలపై రెండు కేసులు నమోదు చేశారు. అందులో ఒకటి ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీపై కాగా.. మరో కేసు ఆప్ మద్దతుదారులపై. సోమవారం రోజు రాత్రి.. ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీ పది వాహనాల్లో 60 మంది మద్దతుదారులతో కలిసి ఫతేసింగ్ మార్గ్‌కు చేరుకున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన పోలీసులు ఆమెను తిరిగి వెళ్లిపోవాలని సూచించారు. అయితే అతిశీ తిరిగి వెళ్లేందుకు నిరాకరించారు. ఈక్రమంలోనే గోవింద్‌పురి పోలీస్ హెడ్ కానిస్టేబుల్.. ఆప్ నేతలు ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తుండగా వీడియో తీశారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన సీఎం అతిశీ మద్దతుదారులు అష్మిత్, సాగర్ మెహతాలు హెడ్ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడ్డారు. ఇద్దరూ కలిసి అతడిని కొట్టగా.. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈక్రమంలోనే అష్మిత్, సాగర్ మెహతాలపై కేసులు నమోదు చేశారు. మరోవైపు ఎన్నికల కోడ్ నియమావళిని ఉల్లంఘించిన సీఎం అతిశీపై కేసు పెట్టారు.

దీనిపై ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కావాలనే పోలీసులు తమపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి రమేష్ బిధూరి బహిరంగంగా ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని.. వారిని అరెస్ట్ చేయకుండా పోలీసులు తమపై కేసు పెట్టడం చాలా ఆశ్చర్యంగా ఉందని చెప్పుకొచ్చారు. ఇప్పటికైనా ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఢిల్లీ పోలీసులు న్యాయబద్ధంగా పని చేస్తూ.. దేశ ప్రజాస్వామ్యాన్ని కోరాలంటూ కామెంట్లు చేస్తున్నారు. మరోవైపు రమేష్ బిధూరి సహా ఆయన కుటుంబ సభ్యులు అంతా బహిరంగంగానే ఎన్నికల కోడ్ నిమయావళిని ఉల్లంఘిస్తున్నారని.. తాను ఎన్నిసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా వారిపై చర్యలు తీసుకోవడం లేదంటూ సీఎం అతిశీ ఎక్స్ వేదికగా వెల్లడించారు.

# మహారాష్ట్రలో 'జీబీఎస్' డేంజర్ బెల్స్:ఐదుగురు మృతి




**న్యూఢిల్లీ-నవభూమి:** కరోనా వైరస్ మహమ్మారి నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతోన్న వేళ.. దేశంలో గులియన్ బారే సిండ్రోమ్ కలవరపెడుతోంది. తొలుత మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లో వెలుగులోకి వచ్చిన జీబీఎస్.. క్రమంగా మిగతా రాష్ట్రాలకు విస్తరిస్తుంది. ఊహించిన దానికంటే వేగంగానే ఇతర రాష్ట్రాలకు ఈ వ్యాధి వ్యాప్తిచెందుతోంది. క్రమంగా మహారాష్ట్రలో జీబీఎస్ కేసులు, మరణాలు పెరుగుతున్నాయి. అక్కడ ప్రస్తుతం 163 మందికి ఈ వైరస్ నిర్ధారణ కాగా.. ఒక్క పుణే జిల్లాలోనే 149 కేసులు ఉన్నాయి. తాజాగా, నాందేడ్‌లో జీబీఎస్ బారినపడి చికిత్స పొందూ 60ఏళ్ల వృద్ధుడు మృతిచెందాడు. దీంతో మొత్తం జీబీఎస్ మరణాలు సంఖ్య 5కు చేరింది. మహారాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు మాట్లాడుతూ.. 'సోమవారం కొత్తగా ఐదుగురికి జీబీఎస్ నిర్ధారణ అయ్యింది.. ఎటువంటి మరణం లేదు.. ఇప్పటి వరకూ 127 కేసులు నిర్ధారణ అయ్యారు.. అనుమానిత 163 కేసుల్లో పుణే నగరంలో 32, ఇటీవల పుణే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొత్తగా చేరిన గ్రామాల్లో 86, పింప్రి చించివాడలో 18, పుణే గ్రామీణ జిల్లాలో 19, ఇతర జిల్లాల్లో 8 మంది ఉన్నారు' అని తెలిపారు. జీబీఎస్ బారినపడ్డవారిలో ఇప్పటి వరకూ 47 మంది కోలుకున్నారని చెప్పారు. మరో 47 మంది ఐసీయూలోనూ.. 21 మంది వెంటిలేటర్‌పైన చికిత్స పొందుతున్నట్టు వివరించారు. అలాగే, పుణే నగరంలోని వివిధ ప్రాంతాల్లో 168 నమూనాలను సేకరించి.. పరీక్షల కోసం పుణే నేషనల్ ల్యాబ్‌కు పంపినట్టు తెలిపారు. ఎనిమిది నీటి వనరులు కలుషితమైనట్టు గుర్తించామని అన్నారు. అసోంలో తొలి జీబీఎస్ మరణం నమోదుకాగా.. గతవారం తెలంగాణాలోనూ ఈ వైరస్ మొదటి కేసు నిర్ధారణ అయ్యింది. సిద్దిపేటకు చెందిన మహిళకు పాజిటివ్‌గా వచ్చినట్టు డాక్టర్లు నిర్ధారించారు. ప్రస్తుతం ఆమెకు హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు.

జీబీఎస్ లక్షణాలు ఇలా ఉంటాయి, ఈ జాగ్రత్తలు తీసుకోండి: డాక్టర్ మమత

కలుషిత ఆహారం.. బ్యాక్టీరియా లేదా ఇన్ఫెక్షన్ల ద్వారా ఈ సిండ్రోమ్ వ్యాప్తిచెందుతుందని వైద్య నిపుణులు అంటున్నారు. జ్వరం, వాంతులు, ఒళ్లంతా తిమ్మిర్లు, విరేచనాలు, పొత్తి కడుపులో నొప్పి, నీరసం, కండరాల బలహీనత లాంటి లక్షణాలు జీబీఎస్ బాధితుల్లో కనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు. అయితే, ఇది కరోనా మాదిరిగా అంటువ్యాధి కాదని, ఒకరి నుంచి ఒకరికి సోకదని, అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకుంటే చాలని అంటున్నారు. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను కలిసి.. పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకోవాలని సూచనలు చేస్తున్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో భిక్షాటన నిషేధం.. కీలక నిర్ణయం..



**భోపాల్-నవభూమి:** మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో బహిరంగ ప్రదేశాలలో భిక్షాటన నిషేధానికి సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ సోమవారం, భోపాల్ పరిధిలోని అన్ని బహిరంగ ప్రదేశాల్లో భిక్షాటనను పూర్తిగా నిషేధించే ఉత్తర్వులను జారీ చేశారు. కలెక్టర్ కౌశలేంద్ర విక్రమ్ సింగ్, భారతీయ నాగరిక సురక్ష సాహిత 2023లోని సెక్షన్ 163 కింద ఈ నిషేధ ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ సెక్షన్‌లో "చికాకు కలిగించే లేదా ప్రమాదం సంభవించే అత్యవసర సందర్భాల్లో ఆర్డర్ జారీ చేసే అధికారం" ఉపయోగించారు. ఈ ప్రకారం, భిక్షాటన చేసిన వారికి చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. జారీ చేసిన ఉత్తర్వుల్లో భిక్షాటన నిషేధం ఉల్లంఘించిన వ్యక్తిపై %దీచీూ%, 2023లోని సెక్షన్ 223 కింద కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. భిక్షాటనపై పెరుగుతున్న భయంకరమైన పరిస్థితుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉత్తర్వుల ప్రకారం ట్రాఫిక్ సిగ్నల్స్, క్రాసింగ్‌లు, మతపరమైన ప్రదేశాలు, పర్యాటక ప్రదేశాలు, ఇతర బహిరంగ ప్రదేశాలలో భిక్షాటన చేస్తున్న వ్యక్తులు, ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను ధిక్కరిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో ఆయా వ్యక్తులు భిక్షాటనను ఆయా ప్రాంతాల్లో ఆపాలని కోరారు. ఈ ఉత్తర్వు ప్రకారం ట్రాఫిక్ నిర్వహణలో కూడా అవాంతరాలు ఏర్పడుతున్నాయని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తులు కూడా భోపాల్ నగరంలో భిక్షాటనలో పాల్గొంటున్నారని చెప్పారు. కొన్ని సందర్భాల్లో ఆ వ్యక్తులపై నేర చరిత్ర కూడా ఉంటుందని తెలిపారు. దీంతో భిక్షాటనతో సంబంధం ఉన్న అనేక నేరాలను గుర్తించిన అధికారులు, భిక్షాటనను నివారించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఉత్తర్వులో పేర్కొనబడినట్లుగా భిక్షాటనలో పాల్గొన్న వారిలో ఎక్కువ మంది మాదకద్రవ్యాలు లేదా ఇతర నేర కార్యకలాపాలలో కూడా పాల్గొంటున్నట్లు గుర్తించారు. భిక్షాటన ముసుగులో అనేక నేరాల నిర్వహణ జరుగుతుండటంతో భిక్షాటన నియంత్రణకు ప్రభుత్వ చర్యలు మరింత వేగంగా తీసుకోవాలని నిర్ణయించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద భిక్షాటన చేస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని, ఈ కారణంగా భిక్షాటనకు పూర్తి నిషేధం విధించడమే సమర్థమైన చర్యగా భావించారు. ప్రస్తుత సమాజంలో భిక్షాటన ఒక దురాచారం అయిందని, ఈ చర్య ద్వారా ప్రజల ఆరోగ్యం, భద్రత విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

చట్టపరమైన చర్యలు..భోపాల్ జిల్లా మొత్తం రెవెన్యూ సరిహద్దు పరిధిలో భిక్షాటన పూర్తిగా నిషేధించబడినట్లు ఉత్తర్వులు వెల్లడించాయి. భిక్షాటన చేయడం లేదా భిక్షగాళ్ల నుంచి ఏదైనా వస్తువును కొనుగోలు చేయడం ఇకపై నిషేధం. ఈ ఆదేశాన్ని ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కూడా స్పష్టంగా తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం భిక్షగాళ్ల నుంచి ఏదైనా సహాయం ఇచ్చే వ్యక్తులు లేదా వారి నుంచి వస్తువులు కొనుగోలు చేసే వ్యక్తులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. ఈ ఉత్తర్వుల అమలు ద్వారా భిక్షగాళ్లను పరిష్కరించడానికి ఒక కొత్త దశ ప్రారంభమైంది. జిల్లా పరిపాలన, కోలార్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో భిక్షగాళ్లకు పునరావాసం కోసం ఒక ఆశ్రయ గృహాన్ని ఏర్పాటు చేసింది. భిక్షగాళ్లను రక్షించి, వారికి అవసరమైన సౌకర్యాలు అందించేందుకు ఈ ఆశ్రయం రూపొందించారు. ఈ క్రమంలో భిక్షాటన నివారణపై ప్రభుత్వానికి సంబంధించి భవిష్యత్తులో మరిన్ని చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

## భారతీయ వలసదారుల తరలింపు.. అమెరికా నుంచి బయలుదేరిన విమానం

**వాషింగ్టన్-నవభూమి:** అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా అక్రమ వలసదారుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నారు. దీంతో అమెరికా చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టారు. అక్రమంగా దేశంలోకి ప్రవేశించివారిని ఫెడరల్ అధికారులు గుర్తించి ఆయా దేశాలకు ప్రత్యేక విమానాల్లో తరలిస్తున్నారు. తాజాగా, భారతీయ అక్రమ వలసదారులతో కూడిన విమానం భారత్‌కు బయలుదేరింది. ఈ విషయాన్ని అమెరికా అధికారులు చెప్పినట్టు ప్రముఖ వార్త ఏజెన్సీ రాయిటర్స్ నివేదించింది.. అమెరికా వాయుసేనకు చెందిన సీ-17 విమానంలో వీరిని తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ విమానం భారత్‌కు చేరుకోవడానికి 24 గంటలు పడుతుందని అంచనా. కానీ, అందులో ఎంత మందిని వెనక్కి పంపుతున్నారనే విషయంపై సమాచారం లేదు. అధ్యక్ష ఎన్నికల సమయంలోనే అక్రమ వలసదారుల అంశాన్ని ప్రధానంగా ఎత్తుకున్న ట్రంప్.. తాను అధికారంలోకి వస్తే వారందరినీ దేశ సరిహద్దులను దాటిస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమవలసదారులపై ఉక్కుపాదం మోపుతున్నారు. వారి గుర్తింపు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేశారు. జనవరి 20న బాధ్యతల చేపట్టిన వెంటనే తొలుత 538 మందిని అరెస్టు చేసి ఆయా దేశాలకు పంపారు. అలాగే, ఎల్‌పాసో, టెక్సాక్, శాన్ డియాగో, కాలిఫోర్నియాలో ఉన్న 5,000 మందిని వారివారి దేశాలకు పంపేందుకు పెంటగాన్ సిద్ధమైంది. ఇప్పటికే గటేమాలా, పెరు, హొండూరస్‌లకు యూఎస్ విమానాల్లో పలువురిని తరలించింది. అయితే, ఒక్కొక్క వలసదారుడ్ని తరలించేందుకు అమెరికాకు చేతిచమురు భారీగా వదులుతోంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in





## ఐటీలో నియామకాలు పెరుగుతున్నాయ్

**హైదరాబాద్-నవభూమి:** ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో మళ్లీ నియామకాలు ఊపందుకున్నాయని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) డైరెక్టర్ కవిత తెలిపారు. సోమవారం నాడిక్కడ హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐటీ సర్వీసులు సహా అన్ని విభాగాల్లో రిక్రూట్‌మెంట్స్ తిరిగి సాధారణ స్థాయికి చేరుకుంటున్నాయన్నారు. గతంలో కొంత స్తబ్దత నెలకొన్నప్పటికీ ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదన్నారు. ప్రధానంగా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ (జీసీసీ)లో పెద్దఎత్తున ఏర్పాటు అవుతుండటంతో పాటు ఉద్యోగాల కల్పన కూడా అదే స్థాయిలో ఉంటోందని తెలిపారు. హైదరాబాద్‌లో దాదాపు 110 జీసీసీలు ఉండగా నియామకాల్లో వాటి వాటా 25 శాతం వరకు ఉందన్నారు. కాగా గడచిన ఆర్థిక సంవత్సరంలో మొత్తం దేశ ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ వాటా 16.8 శాతంగా ఉందని కవిత తెలిపారు. ఇందులో జీసీసీల వాటానే 38 శాతం వరకు ఉందని ఆమె పేర్కొన్నారు. కొత్త జీసీసీలు పెద్దఎత్తున ఏర్పాటు కానుండటంతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఈ వాటా మరింత పెరగవచ్చని అంచనా వేస్తున్నట్లు ఆమె చెప్పారు. 11న హైసియా జాతీయ సమ్మిట్: ఈ నెల 11న హైదరాబాద్‌లో 32వ హైసియా జాతీయ సదస్సు, అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హైసియా ప్రెసిడెంట్ ప్రశాంత్ నందెళ్ల తెలిపారు. ఏఐ అండ్ బియాండ్: రీడిఫైనింగ్ ది ఫ్యూచర్ పేరుతో ఈ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. సదస్సులో భాగంగా లైఫ్ సైన్సెస్, సస్టేనబల్ సిస్టమ్స్, గ్రీన్ సాఫ్ట్‌వేర్, సిటీ సర్వీసులు, ఈ-గవర్నెన్స్ విభాగాల్లో ఏఐ ద్వారా వస్తున్న మార్పులపై విస్తృత స్థాయిలో చర్చాగోష్ఠిని నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.



## సంస్కరణా? సంఘర్షణా?

భావజాల ప్రేరణతో వ్యవహరించే బీజేపీ మన సంవిధానం నిర్దేశించిన పై మాటల (అధికరణ 44) పట్ల చిత్తశుద్ధి చూపుతుందా? ఉమ్మడి పౌరస్మృతి అనే మాటలకు మాత్రం బాగా ప్రాధాన్యమిస్తుంది. ఇది అర్థం చేసుకోదగిన విషయమే. అయితే ఆ అధికరణలోని 'పౌరులు', 'దేశ వ్యాప్తంగా' అనే మాటలను మనం ఉపేక్షించకూడదు. మన సువిశాల భారతదేశంలో ఏ ప్రాంతంలోనైనా సరే నివసించే లేదా స్థిరపడే హక్కు ప్రతి పౌరునికీ ఉన్నదని, సకల ప్రదేశాలలోను సమస్త పౌరులకూ ఉమ్మడి పౌరస్మృతినే వర్తింపచేయాలన్నది మన రాజ్యాంగ సంకల్పం. అధికరణ 44 ఉద్దేశం అదే. ఎక్కడైనా సరే నివసించి లేదా స్థిరపడి ఒక పౌరస్మృతి లబ్ధిని పొందే హక్కు సమస్త పౌరులకు లభించేందుకు భారత రాజ్య వ్యవస్థ బాధ్యత. పార్లమెంటు చాల వరకు ఈ బాధ్యతను నిర్వహించింది. భారత పౌరులు అందరూ ఒకే కాంట్రాక్టుల చట్టం (లా ఆఫ్ కాంట్రాక్ట్స్ %-% చట్ట ప్రకారం ఒక ఒప్పందం ఆమోదయోగ్యం కావాలంటే ఆ ఒప్పందం పాటించవలసిన నియమ నిబంధనలను కాంట్రాక్టుల చట్టం నిర్దేశించింది. ఈ నియమ నిబంధనలను పాటించని ఒప్పందాలు చెల్లుబాటు కావు), ఒకే కాల దోష పరిమితి శాసనం (లా ఆఫ్ లిమిటేషన్), ఏ సివిల్ న్యాయస్థానంలోనైనా ఒకే విధమైన విచారణ ప్రక్రియ, పౌరుని సాంఘిక (నేర వ్యవహారాలతో సంబంధం లేని) విషయాలన్నిటికీ ఒకే విధమైన పౌర స్మృతిని అమలుపరచడం ప్రభుత్వ కర్తవ్యం.

వివాహం, విడాకులు, వారసత్వం మొదలైన సాంఘిక వ్యవహారాలకు సంబంధించి చట్టాలు తీసుకొచ్చే బాధ్యత, అధికారాలు పార్లమెంటుకు ఉన్నాయి. అయితే ఉత్తరాఖండ్ రాష్ట్రం వివాహం, విడాకులు, వారసత్వం, వారసత్వ సంక్రమణ వ్యవహారాలపై చట్టాన్ని తీసుకువచ్చే ఈ బృహత్తర బాధ్యతను స్వయంగా నిర్వహించడం ఒక దుస్సాహసమే. ఉత్తరాఖండ్ ఈ చట్టాన్ని భారతదేశ పౌరులు అందరికీ వర్తింపచేయగలుగుతుందా? ఇందుకు ఆ రాష్ట్రానికి అధికారాలు ఉన్నాయా? ఉత్తరాఖండ్ రాష్ట్రంలో పుట్టిన పౌరుల విషయాన్ని తీసుకున్నా వారు ఉత్తరాఖండ్‌లో నివసించుతున్నంతవరకు మాత్రమే ఆ చట్టాన్ని వర్తింపచేయడం సాధ్యమవుతుంది. ఆ చట్టాన్ని ఇష్టపడని ఏ వ్యక్తి అయినా సరే ఉత్తరాఖండ్ నుంచి వెళ్లిపోయి వేరే ప్రాంతంలో స్థిరపపడం ద్వారా ఆ చట్టం నుంచి స్వేచ్ఛ పొందుతాడు. ఉత్తరాఖండ్‌లో నివసించేఒక పురుషుడు, ఒక మహిళ ఆ రాష్ట్రం వెలుపల సంప్రదాయ బద్ధంగా వివాహం చేసుకోగలుగుతారు. వారు ఉత్తరాఖండ్ నుంచి వెళ్లిపోకుండా, వివాహం చేసుకోకుండా ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆపలేదు. మరో విషయాన్ని కూడా మనం గమనంలోకి తీసుకోవాలి. ఉత్తరాఖండ్‌లో జన్మించిన వ్యక్తికి దేశవ్యాప్తంగా తన చట్టం అందుబాటులో ఉంచడం గానీ, వర్తింపచేయడం గానీ చేయలేదు. ఉత్తరాఖండ్లో పుట్టి, వేరే రాష్ట్రంలో నివసిస్తున్న వ్యక్తి అక్కడ వారిని వివాహం చేసుకుని, వేరే వారి పిల్లలను దత్తత తీసుకున్నా, తన వీలునామాను అక్కడ రిజిస్టర్ చేయించినా వాటికి వర్తింపచేయదగిన శాసనం (అప్లికబుల్ లా) ఏది అనే ప్రశ్న తలెత్తుతుంది. ఉత్తరాఖండ్ చట్టం అమల్లో ఉన్న పార్లమెంటరీ చట్టంతో సంఘర్షిస్తే పార్లమెంటరీ చట్టమే చెల్లుబాటు అవుతుంది. ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వం ఒక ఉమ్మడి పౌరస్మృతిని తీసుకువచ్చినా దాని వెనుక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉన్నదనేది స్పష్టం. ఎవరూ కొట్టివేయలేని వాస్తవమిది. ఉమ్మడి పౌరస్మృతిపై ప్రజల ప్రతిస్పందనలను తెలుసుకునేందుకే ఆ చట్టాన్ని తీసుకువచ్చేలా ఉత్తరాఖండ్ ప్రభుత్వాన్ని మోదీ సర్కార్ ప్రోత్సహించిందన్నది స్పష్టాతి స్పష్టం. ఊహించిన విధంగానే ఉత్తరాఖండ్ చట్టం ఒక తీవ్ర చర్చను పురిగొల్పింది. ఉమ్మడి పౌరస్మృతి (యూనిఫామ్ సివిల్ కోడ్ %-%యూసీసీ) పై భావనను పరీక్షించేందుకు సమర్థమైన అధికారాలు ఉన్న రాజ్యాంగ సంస్థ లా కమిషన్. 19వ లా కమిషన్ ఆగస్టు 31, 2018న తన నివేదికలో ఇలా అభిప్రాయపడింది : 'యూసీసీని సమకూర్చే చట్టాలను కాక వివక్షను పాటించే, ప్రోత్సహించే చట్టాలను ప్రధానంగా పరిశీలిస్తుంది. ఉమ్మడి పౌరస్మృతి అనేది ప్రస్తుత దశలో తప్పనిసరీ కాదు, వాంఛనీయమూ కాదు'. మొత్తం మీద ఉత్తరాఖండ్ ప్రభుత్వ లక్ష్యం సమాజ జీవితంలో మారుతున్న విలువలు ఆచారాలు, కట్టుబాట్లకు అనుగుణంగా ప్రగతిశీల, ఉదారవాద చట్టాన్ని తీసుకురావడం కాదని విశదమవుతుంది. కేంద్ర హెూం మంత్రి మాటల్లో చెప్పాలంటే 'తిరోగామి మతచట్టాల (పర్సనల్ లాస్)ను తొలగించడమే'నని చెప్పి తీరాలి. మరింత స్పష్టంగా చెప్పాలంటే అధిక సంఖ్యాక వాదాన్ని (మెజారిటేరియనిజం) దృఢంగా ప్రకటించడమే. ఉత్తరాఖండ్ చట్టంలో మూడు భాగాలు ఉన్నాయి. మొదటి భాగం (సెక్షన్లు 4 నుంచి 48 దాకా) 'వివాహం', 'విడాకులు'కు సంబంధించినదిబీ రెండో భాగం (సెక్షన్లు 49 నుంచి 377 దాకా) 'వారసత్వం'కు సంబంధించినదిబీ మూడో భాగం (సెక్షన్లు 378 నుంచి 389 దాకా) 'సహజీవన సంబంధాలు'కు సంబంధించినదిబీ నాల్గవ భాగం ఇతర అంశాలకు సంబంధించిన వివిధ నిబంధనలు. మొదటి భాగంలోని కొన్ని నిబంధనలు స్వాగతింపదగినవి. మారు మనువు, బహు భార్యాత్వాన్ని నిషేధించారు. వివాహ అర్హత వయసు యువతులకు 18, యువకులకు 21 సంవత్సరాలుగా నిర్ణయించారు. వివాహాన్ని తప్పనిసరిగా రిజిస్టర్ చేయించాలి. కొన్ని నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమైనవి. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో నివసిస్తున్న లేదా వేరే రాష్ట్రంలో జీవిస్తున్న 'రెసిడెంట్ ' (వాస్తవ్యుడు)కు ఈ చట్టం వర్తిస్తుంది. 'వాస్తవ్యుడు'కు చాలా విస్తృత నిర్వచనమిచ్చారు : (1) ఉత్తరాఖండ్‌లో పని చేస్తున్న కేంద్ర ప్రభుత్వ శాశ్వత ఉద్యోగిబీ (2) 'కేంద్ర ప్రభుత్వం' అమలుపరుస్తున్న ఏదైనా పథకం లబ్ధిదారు'. ఈ చట్టం ఉత్తరాఖండ్ 'ప్రాదేశిక అధికార పరిధి' (టెర్రిటోరియల్ జ్యూరిస్‌డిక్షన్) ఉల్లంఘించింది. ఈ చట్టంలోని కొన్ని నిబంధనలు చర్చనీయాంశాలు. ఉదాహరణకు విడాకులకు సంబంధించిన నిబంధనలు. కొన్ని నిబంధనలు యథా పూర్వస్థితిని సమర్థించేవి. ఒక వ్యక్తి పురుషుడు లేదా మహిళ కావచ్చు. 'వివాహం' అనేది పురుషుడు, మహిళ మధ్య జరగాలి. ఇటువంటి వివాహమే ధర్మ విహితమైనది. కొన్ని నిబంధనలు తిరోగమనపూర్వకమైనవి. కాలానికి అనుగుణంగా లేనివి. కాల దోషం పట్టిన 'దాంపత్య హక్కుల పునఃస్థాపన' (రెస్టిట్యూషన్ ఆఫ్ కాంజుగల్ రైట్స్) యథాతథంగా ఉంచారు. మూడవ భాగం 'సహజీవన సంబంధాలు' గురించి విపులంగా ప్రస్తావించింది. ఇది తిరోగామి పూర్వకమైనదే కాక, రాజ్యాంగ విరుద్ధమైనది కూడా ఇది ఉత్తరాఖండ్ 'వెలుపల' నివసిస్తున్న ఉత్తరాఖండ్ 'వాస్తవ్యులు'కు కూడా వర్తిస్తుందని ఆ చట్టం పేర్కొంది. విరోధాభాసకు ఇదొక స్పష్టమైన ఉదాహరణ. మూడో భాగం అంతా వ్యక్తిగత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, గోప్యత, ఏకాంత హక్కుపై ఎటువంటి మినహాయింపులు లేని దాడి అని చెప్పి తీరాలి. పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం కనుక ఈ భాగాన్ని పూర్తిగా కొట్టివేయాలి. మూడో భాగంలోని నిబంధనలు (15 నుంచి 19 దాకా) మరింత ఘోరమైనవి. నమ్మండి,

# ట్రంప్, మోదీ 'మంచి' స్నేహితులు కాగలరా?



'అబ్‌కీ బార్ ట్రంప్ సర్కార్' అని సెప్టెంబర్ 2019లో టెక్సాస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘోషించారు. నాటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2020లో జరగనున్న అధ్యక్ష పదవీ ఎన్నికలలో కచ్చితంగా విజయం సాధిస్తారనే తన విశ్వాసాన్ని మోదీ అలా సుదృఢంగా వ్యక్తం చేశారు. కొద్ది నెలల అనంతరం ఫిబ్రవరి 2020లో అహ్మదాబాద్‌లో 'నమస్తే ట్రంప్' అనే ఒక బృహత్తర బహిరంగ కార్యక్రమంలో కూడా మోదీ అదే విశ్వాసాన్ని మళ్లీ వ్యక్తం చేశారు. 'అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్' అనేది ఒక తప్పుడు అభిప్రాయం. ఔచిత్య రహితంగా అత్యుత్సాహంతో బహిరంగపరిచిన ఒక పొరపాటు నిర్ణయం. కనుకనే 2020 నవంబర్‌లో అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితం మోదీని దిగ్భ్రాంతి పరిచింది. డొనాల్డ్ ట్రంప్ ఆ ఎన్నికలలో అనూహ్యంగా ఓడిపోయారు. గత నాలుగేళ్లుగా వాషింగ్టన్‌లో 'అబ్ కీ బార్ బైడెన్ సర్కార్' అనే భావన బలంగా ఉన్నది. నవంబర్ 2024 అధ్యక్ష ఎన్నికలలో ట్రంప్ అనూహ్యంగా భారీ మెజారిటీతో గెలిచారు. మరి 2019%-%20లో ట్రంప్, మోదీ మధ్య వర్ధిల్లిన స్నేహ సంబంధాలు పునరుజ్జీవమవుతాయా అన్నది ఇప్పుడు మన ముందున్న ప్రశ్న.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఇటీవల టెలిఫోన్‌లో జరిపిన ఉభయ కుశలోపరిలో ట్రంప్‌ను తన 'ప్రియమైన స్నేహితుడు'గా మోదీ అభివర్ణించారు. శక్తిమంతులైన ఈ నాయకులు ఇరువురూ జనాలను ఆకట్టుకోవడంలో సాటిలేని ఘనాపాటీలు అనడంలో సందేహం లేదు. వారి వ్యవహారశైలులు అప్పుడప్పుడు ఆశ్చర్యకరంగా ఒకే తీరులో ఉండడం పరిపాటి. జనాకర్షక నినాదాల ప్రాధాన్యం, ఉపయుక్తతను ఇరువురూ బాగా అర్థం చేసుకున్నవారే. అటువంటి నినాదాలతో బాగా లబ్ధి పొందినవారు కూడా. 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అనేది ట్రంప్ నినాదం కాగా 2047 నాటికి వికసిత్ భారత్‌కు దారితీసే 'అమృత్ కాల్'ను సృష్టిస్తానని నరేంద్ర మోదీ వాగ్దానం చేశారు. కాలం చెల్లిన ఉదారవాద రాజకీయాలపై మితవాద జాతీయవాదం విజయానికి ప్రతినిధులుగా మోదీ, ట్రంప్‌లను వారి అభిమాన గణాలు భావిస్తున్నాయి. గత కాలం ల్యూటెన్స్ కులీన వర్గాల ప్రాబల్యాన్ని మోదీ దెబ్బతీయగా వాషింగ్టన్ సంప్రదాయ పాలక వర్గాల ప్రాబల్యానికి ట్రంప్ విఘాతం కలిగించారు. వలసకారులకు వ్యతిరేకంగా ట్రంప్ గర్జనలు, భారతీయ ముస్లింలను 'అంతర్గత శత్రువులు'గా పరిగణించే మోదీ మద్దతుదారులలో పూర్తిగా ప్రతిధ్వనించాయి. వలసకారులను నిరోధించేందుకు సరిహద్దుల్లో గోడలు నిర్మించాలని ట్రంప్ మద్దతుదారులు కోరుతుండగా మసీదుల స్థానంలో ఆలయాలను నిర్మించేందుకు మోదీ అనుయాయులు ప్రయత్నిస్తున్నారు. ఒక 'శాశ్వత' శత్రువు కోసం అన్వేషణ అటు ట్రంప్, ఇటు మోదీ మద్దతుదారులను సమ్మోద్ధం చేస్తోంది, కార్యనిమగ్నులనూ చేస్తోంది.

ట్రంప్%-%మోదీల మధ్య సమాంతరాలను అత్యుక్తులుగా చెప్పుకోనవసరం లేదు. నిజం చెప్పాలంటే వారి మధ్య సదృశాల కంటే వ్యత్యాసాలే ఎక్కువ. ఇరువురి రాజకీయ ప్రస్థానాలు చాలా భిన్నమైనవి. మోదీ ఒక అర్ధ శతాబ్ది కాలంగా రాజకీయాలలో ఉన్నారు. ఆరెస్సెస్ ప్రచారక్‌గా ప్రారంభమై క్రమంగా రాజకీయ సోపానాలను అధిరోహించి ప్రధానమంత్రి పదవికి చేరుకున్నారు. మోదీకి భిన్నంగా ట్రంప్ ఒక విజయవంతమైన వ్యాపారి. బీజేపీ శ్రేణుల నుంచి మోదీ ప్రభవించగా ట్రంప్ రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష పదవీ అభ్యర్థిత్వాన్ని సర్వోత్కృష్టుడైన 'బయటి వ్యక్తి'గా కైవసం చేసుకున్నారు. మోదీ తనను తాను ఒక హిందూత్వ యోధుడుగా తీర్చిదిద్దుకున్నారు. లావాదేవీలు, ఒప్పందాల విషయంలో అనితరసాధ్యుడైన నేర్పరిగా ట్రంప్ ప్రసిద్ధి పొందారు. మోదీలో భావజాల అభినివేశం పరిపూర్ణంగా ఉండగా ట్రంప్‌లో వ్యాపార కాంక్షలు ఆయన స్వాభావిక ప్రవృత్తిగా ఉండడం కద్దు. ఈ నాయకులిరువురూ వ్యక్తి పూజను ప్రోత్సహించినవారే. ఇరువురిలోను స్వానురాగ ప్రవృత్తి అమితంగా ఉంది. మోదీ తన పదేళ్ల ప్రధాన మంత్రిత్వ కాలంలో తరచు అధికార రాజకీయాల సంప్రదాయ సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరించి భారత రాజకీయాలపై తనదైన ముద్ర వేశారు. అప్పుడప్పుడూ తన ప్రత్యర్థులను ఆత్మరక్షణలోకి నెట్టివేసేందుకు దిగ్భ్రాంతికరమైన నిర్ణయాలు తీసుకున్నారు. తద్వారా ప్రత్యర్థులను భయోత్పాతానికి గురిచేశారు. 2016లో పెద్దనోట్ల రద్దు అటువంటి చర్యే. నల్లధనాన్ని సంపూర్ణంగా నిర్మూలించే పేరిట ఆయన ఆ నిర్ణయం తీసుకున్నారు. విధాన నిర్ణయాల రూపకల్పన ప్రక్రియను చాలవరకు కేంద్రీకృతం చేసినప్పటికీ రాజకీయ ఔచిత్య లక్షణరేఖను మోదీ ఎన్నడూ ఉల్లంఘించలేదు. ఒక పొరుగుదేశాన్ని బెదిరించేందుకు అర్ధరాత్రి సమయంలో మోదీ ట్వీట్ చేయడమనేది ఎన్నడూ జరగలేదు. ఆయన ఆ విధంగా వ్యవహరించడమనేది ఎప్పటికీ జరగని పని అని కూడా నిశ్చితంగా చెప్పవచ్చు. మోదీకి భిన్నంగా ట్రంప్ నిత్యం ఆమోదయోగ్యమైన రాజకీయ ప్రవర్తనా నియమాలకు విరుద్ధంగా వ్యవహరించడం పరిపాటి. అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన వారం రోజుల్లోనే ఆయన ఎన్నో కటువైన ప్రకటనలు చేశారుబీ తీవ్ర పర్యవసానాలకు దారితీసే ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులు జారీ చేశారు. అవన్నీ తన ప్రత్యర్థులు, వ్యతిరేకులను గందరగోళపరిచేందుకు, వారిని సవాల్ చేసేందుకు ఉద్దేశించినవేనని మరి చెప్పనవసరం లేదు. అమెరికా అధ్యక్షుడిది అద్వితీయమైన వైయక్తిక వ్యవహారశైలి. రాజకీయ విజ్ఞతకు అందులో స్థానం లేదు. ఎవరేమనుకున్నా ట్రంప్ లెక్క చేయరు. తాను చేయాలనుకున్నది చేసి తీరుతారు. తన నిర్ణయాలకు, చర్యలకు విస్తృత స్థాయిలో ఆమోదం పొందేందుకు మోదీ తప్పక ప్రయత్నిస్తారు. స్వచ్ఛ భారత్ ప్రచారానికి లోగోగా వినియోగించుకునేందుకు మహాత్మాగాంధీ కళ్లజోడును ఎంపిక చేసుకోవడమే అందుకొక నిదర్శనం. ట్రంప్‌కు తన స్వదేశ గతంతో తాదాత్మ్యత లేదు. చరిత్ర గురించిన ఆయన దృష్టి స్వయం ప్రతిష్ఠకు మాత్రమే పరిమితమయింది. ఇప్పుడు మనం అసలు ప్రశ్నకు వద్దాం: ఆ నాటి చెలిమికి ఐదు సంవత్సరాలు అంతరాయమేర్పడిన అనంతరం ఇప్పుడు మళ్లీ పాత స్నేహం కుసుమిస్తున్న సమయంలో డొనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీ ఎలా కలిసికట్టుగా ముందుకు సాగుతారు? ఎటువంటి రాజకీయ అనుబంధంలోనైనా మిత్రుడు లేదా భాగస్వామి కంటే తాను తక్కువ స్థానంలో ఉండడాన్ని మన మోదీ ససేమిరా అంగీకరించరు కదా. ఇక ట్రంప్ విషయానికి వస్తే జన నీరాజనాలను మరెవ్వరితోను కలిసి పంచుకోవడానికి ఆయన ఎట్టి పరిస్థితులలోను సుముఖత చూపరు గాక చూపరు. తమ ఉభయులలో తానే గొప్ప అనే అభిజాత్యాన్ని ప్రదర్శించేందుకు ట్రంప్, మోదీ ఇరువురూ తప్పక ప్రయత్నిస్తారు. ప్రతి ఒక్కరినీ సతాయించేందుకు లేదా భయపెట్టేందుకు డొనాల్డ్ ట్రంప్ సిద్ధమైనప్పటికీ ఆయనతో సమావేశమయినప్పుడు తమ వైఖరి, అభిప్రాయాలను నిక్కచ్చిగా వ్యక్తం చేసేందుకు ప్రధాని మోదీ ఆయన మంత్రివర్గ సహచరులు, ఉన్నతాధికారులు దృఢనిశ్చయంతో ఉన్నారు. సౌష్ఠవం లోపించిన స్నేహ బంధంగా భారత్%-%అమెరికా ద్వైపాక్షిక సంబంధాలను పరిగణించాలి. నడుస్తున్న చరిత్రను ప్రభావితం చేయగల శక్తి సామర్థ్యాలు ప్రస్తుతం లేకపోయినప్పటికీ అమెరికా ఇప్పటికీ ప్రపంచ అగ్రగామిగా వెలుగొందుతోంది. అగ్రరాజ్య హెూదాను ప్రగాఢంగా కోరుకుంటున్న భారత్, అంతర్జాతీయ వ్యవహారాలలో తనకొక ప్రత్యేక గుర్తింపు, మరింత ప్రాధాన్యాన్ని భారత్ ఎంతగా అభిలషిస్తోందో మరి చెప్పనవసరం లేదు. 'అమెరికా ఫస్ట్' అనే లక్ష్యానికి అనుగుణమైన రీతిలో ఒక సువిశాల లాభప్రద మార్కెట్‌గా భారత్‌ను ట్రంప్ భావిస్తున్నారనడంలో సందేహం లేదు. అయితే భారత్‌ను ఒక విశ్వసనీయమైన వ్యూహాత్మక మిత్ర దేశంగా వాషింగ్టన్ చూడగలదనే ఆశాభావం మోదీకి ఇంకా ఉన్నది. భారత్, చైనాలు అధిక సుంకాలతో బాగా లబ్ధి పొందుతున్న దేశాలుగా ట్రంప్ గట్టిగా భావిస్తున్నారు. తన విలక్షణ శబ్దాడంబరంతో నిరసిస్తున్నారు కూడా. ఇది మనకు ఎంతైనా ఆందోళనకరమైన విషయమే. దౌత్య మర్యాదలు పాటించే ఓర్పు, నేర్పు ట్రంప్‌కు లేవు. సభ్యతా సంస్కారాలకు విరుద్ధంగా వ్యవహరించేందుకు ఆయన వెనుకాడరు. ఆయన ప్రపంచ దృక్పథంలో వాణిజ్య ప్రయోజనాలకు అగ్ర ప్రాధాన్యమున్నది. మరి ఇటువంటి నాయకుడిని మిత్రుల ప్రశస్త మాటలు, పాత స్నేహాలు కదిలిస్తాయా? చెప్పవచ్చిన దేమిటంటే భవిష్యత్తులో భారత్, చైనాలు రెండిటితోనూ తన సొంత షరతులపై వ్యవహరించేందుకు, ఒప్పందాలు చేసుకునేందుకు ట్రంప్ తప్పక ప్రయత్నిస్తారు. ఎందుకు? అమెరికా ప్రయోజనాలు కాపాడేందుకే. ఈ విషయమై ఎవరికీ ఎటువంటి సందేహం ఉండనక్కరలేదు. అమెరికాతో మన సంబంధాలు ఎలా పరిణమించనున్నాయి? ఈ విషయంలో వచ్చే కొద్ది నెలలపాటు భారత్ చాలా జాగ్రత్తగా ఉండాలి. అంతిమంగా జరిగేది మన ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటుందో లేదో ఇప్పుడే చెప్పలేము. వేచి చూడాలి. ట్రంప్‌తో సఖ్యతకు మోదీ ప్రయత్నిస్తారా? 2019 అమెరికా అధ్యక్ష ఎన్నికల తరుణంలో తనకు బహిరంగంగా పరిపూర్ణ మద్దతునిచ్చిన విషయాన్ని ట్రంప్‌కు ఆయన గుర్తు చేయవచ్చు. పాత స్నేహసరసతలు ప్రస్తుత సంబంధాలపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయన్నది నిశ్చితంగా చెప్పలేము. సమస్యేమిటంటే తననుతాను గొప్పగా ప్రకటించుకునే రియాల్టీ షోలో అమెరికా అధ్యక్షుడు ఒక బిగ్‌బాస్ లాంటి వ్యక్తి. ఈ షోలో కేవలం ఒకే ఒక్కరి బిగ్‌బాస్ మాటే తొలి, తుది మాట. దానికే సమస్త ప్రాధాన్యం. భారత్‌తో సహా విశాల ప్రపంచమంతా కేవలం ప్రేక్షకులు మాత్రమే. మరి ఈ ట్రంప్ షోలో తదుపరి అంకం ఏమిటో ఎవరికీ తెలియదు. నమ్మకంగా చెప్పగలిగేవారు కూడా ఎవరూ లేరు.


# విద్యకు అరకొర నిధులు



కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయిస్తున్న నిధులు అంతకంతకూ క్షీణించిపోతున్నాయి. నాణ్యమైన విద్యను అందిస్తామని హామీనిచ్చిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆ మాటను ఎప్పుడో మర్చిపోయింది. బడ్జెట్‌లో విద్యకు మనం చేస్తున్న కేటాయింపులు ప్రపంచ దేశాలతో పోల్చితే చాలా తక్కువ. విద్యారంగం మీద ప్రాధాన్యం మేరకు ఖర్చు చేస్తున్న దేశాలు చక్కటి అభివృద్ధి సాధిస్తున్నాయి. అరకొర నిధుల కేటాయింపుతో విద్యాభివృద్ధి అసాధ్యం. జాతీయ విద్యా విధానంలో ప్రమాణాలతో కూడిన ఆధునిక, నాణ్యమైన విద్యను అందిస్తామని మోదీ గ్యారెంటీ పేరుతో విడుదల చేసిన సంకల్ప పత్రంలో బీజేపీ వాగ్దానం చేసింది. పాఠ్యప్రణాళిక ప్రక్రియ, ఉపాధ్యాయ శిక్షణ, మౌలిక వసతుల కల్పన, సాంకేతిక అంశాలను వినియోగిస్తూ జ్ఞాన నైపుణ్యాలను ఆధునీకీకరిస్తామని హామీ ఇచ్చింది. జాతీయ విద్యా విధానంలో చెప్పినట్టుగా అత్యుత్తమ పాఠశాల విద్య అందించడానికి పీఎం శ్రీ, ఏకలవ్య పాఠశాలలను అభివృద్ధి చేస్తామని కూడా హామీ ఇచ్చింది. మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ తన మొదటి బడ్జెట్‌లో విద్యారంగాన్ని విస్మరించింది. గణనీయమైన నిధులు, సంస్కరణల వాగ్దానాలు చేసినప్పటికీ అనేక కీలక అంచనాలను అందుకోవడంలో బడ్జెట్ విఫలమైంది. స్థూల జాతీయోత్పత్తిలో విద్యపై ప్రభుత్వ వ్యయం చాలా తక్కువగా కేవలం 2.7 శాతంగానే ఉన్నది. జాతీయ విద్యా విధానం స్థూల జాతీయోత్పత్తిలో 6 శాతాన్ని సిఫారసు చేసింది. విద్య నాణ్యతను ఈ తక్కువ వ్యయం నేరుగా ప్రభావితం చేస్తుంది. బీజేపీ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది 2013-14 బడ్జెట్‌లో 3.16 శాతం నిధులను విద్యకు కేటాయించగా, 2024-25లో అది 1.53 శాతానికి తగ్గిపోయింది. ఉన్నతవిద్యకు కేటాయింపులు 2013-14లో 1.6 శాతం ఉండగా 2024-25లో ఒక శాతానికి పడిపోయాయి. ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో 2.53 శాతం నిధులను మాత్రమే విద్యకు కేటాయించారు. అందులో పాఠశాల విద్యకు 1.5 శాతం, ఉన్నత విద్యకు 0.988 శాతం నిధులు దక్కాయి. ఈ మాత్రం నిధులతో దేశంలోని 1,50,000 ఉన్నత పాఠశాలల్లోని 10 వేల బడుల్లో అటల్ టింకరింగ్ ప్రయోగశాలలను అభివృద్ధి చేస్తామని, వచ్చే నాలుగేండ్లలో 40 వేల పాఠశాలలకు విస్తరిస్తామని ప్రతిపాదించారు. పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తామని, రూ. 500 కోట్లతో ఏఐ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో దాదాపు 10 లక్షలకుపైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని నీతి ఆయోగ్ విడుదల చేసిన 'సాత్' (సస్టెయినబుల్ యాక్షన్ ఫర్ ట్రాన్స్‌ఫామింగ్ హ్యూమన్ క్యాపిటల్) నివేదిక తెలిపింది. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో 33 శాతం అధ్యాపకుల ఖాళీలు, ఐఐటీల్లో 40 శాతం, ఐఐఎంలలో 31.6 శాతం బోధన పోస్టులు ఖాళీగా ఉన్న విషయాన్ని, వాటిని భర్తీచేసే విషయాన్ని కేంద్ర ఆర్థికమంత్రి పట్టించుకోలేదు. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ 200 విశ్వవిద్యాలయాల్లో భారతీయ యూనివర్సిటీలు మూడు మాత్రమే ఉన్నాయి. నిధుల కేటాయింపు లేకుండా భారతీయ సంస్థలు అంతర్జాతీయంగా పోటీ పడలేని పరిస్థితి ఉన్నది. అవసరాల మధ్య అంతరాన్ని తగ్గించడానికి అవసరమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు కూడా బడ్జెట్ ప్రాధాన్యం ఇవ్వలేదు. ఉపాధిని పెంపొందించడానికి బలమైన వృత్తి శిక్షణ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల కోసం సిఫారసులు చేసినప్పటికీ, స్కిల్ ఇండియా మిషన్ 1.4 కోట్ల మంది వ్యక్తులకు శిక్షణను ఇచ్చినప్పటికీ విద్యా ఫలితాలను మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మార్చడానికి మరింత మద్దతు అవసరమని నిపుణులు చెప్తున్నారు. కొత్తగా పరిశోధన కేంద్రాల స్థాపన, డిజిటల్ విద్యను మెరుగుపరచడానికి, అట్టడుగు వర్గాలకు అవసరమైన సహాయాన్ని అందించడానికి విద్యా రంగానికి మరిన్ని నిధులు కేటాయించాలి. భారత్ తన జీడీపీలో విద్యకు కేటాయిస్తున్న 2.53 శాతం నిధులు ప్రపంచవ్యాప్తంగా సిఫారసు చేసిన ఆరు శాతం కంటే తక్కువ కావడం గమనార్హం. 26 కోట్ల మందికి పైగా పాఠశాల విద్యార్థులున్న దేశంలో, ఉన్నత విద్యకు డిమాండ్ పెరుగుతున్న తరుణంలో విద్యకు ఇంత తక్కువ కేటాయింపులు సరికాదు. బీజేపీ ఎన్నికల వాగ్దానాలకు, ఆచరణలో విద్యా రంగానికి నిధుల కేటాయింపునకు నక్కకు నాకలోకానికి ఉన్న తేడాను తెలుపుతుంది. ఈ అరకొర నిధులతో విద్యారంగాన్ని ఏ మాత్రం అభివృద్ధి చేయలేం. విద్యారంగం మీద ప్రాధాన్యం మేరకు ఖర్చు చేస్తున్న దేశాలు చక్కటి, వినూత్న ఆర్థిక వ్యవస్థలను నిర్మించుకుంటున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని మన దేశంలో విద్యకు చేసే ఖర్చును రెట్టింపు చేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు. ఫలితంగా..భారత్‌లోని మారుమూల ప్రాంతాలనే సంబంధం లేకుండావిద్యార్థులకు నాణ్యమైన బడులు, అందరికీ వనరుల లభ్యత, సమాన అవకాశాలుంటాయి.

## ఆత్మకు లేవు దూరభారాలు


భక్తి



'ఆత్మ ఒక చోట ఉన్నా.. దూరంగా పయనించగలదు. పడుకొని ఉన్నా.. అన్ని వైపులకూ వెళ్లగలదు..'అని పై ఉపనిషత్ వాక్యానికి భావం. శరీరానికి తప్ప ఆత్మకు దూరభారాలు లేవు. తరించిపోయిన పరమాత్మ స్వరూపులైన మహానుభావులకు అసలే లేవు. ప్రేమావతారులైన శ్రీ కుసుమ హరనాథుని జీవితంలో ఇలాంటి సంఘటనలెన్నో కనిపిస్తాయి. ఆయన ఎక్కడెక్కడి భక్తులనో వెళ్లి పలకరించేవాడనీ, రక్షించేవాడనీలోక ప్రసిద్ధి. హరనాథ భక్తులైన భావనారుషి అనుభవం పరిశీలిస్తే ఈ విషయం అవగతం అవుతుంది. ప్రభు హరనాథుని భక్తకోటిలో భావనారుషి గురించి తెలియనివారు ఉండరు. విజయనగరం జిల్లా, శృంగవరపు కోట సమీపంలోని తెన్నుబొడ్డవరలో ఉండేవారాయన. ఒక వేసవిలో దువ్వాడ శ్రీ హరనాథ ఆశ్రమంలో శ్రీమతి వీరమాచనేని అనసూయమ్మగారు ఏడు రోజులు శ్రీమద్భాగవత కాలక్షేపం జరిపారు. సప్తాహం అనంతరం భావనారుషి బస్సులో అరకులోయ మార్గంలో బయల్దేరారు. దారిలో ఒక లారీ అతి వేగంగా ఎదురుగా వచ్చింది. లోయ పక్కగా వెళ్తున్న వీరి బస్సు.. పట్టుదప్పి ఒక తాటిచెట్టు లోతు లోయలో పడిపోయింది. చాలామంది ప్రయాణికులు క్షతగాత్రులయ్యారు. భావనారుషి భయంతో 'కుసుమహరా' అని గట్టిగా గురునామం స్మరించారు. ఆశ్చర్యం. వెనుకనుంచి రెండు చేతులతో నడుమును గట్టిగా పట్టుకొని, లోతైన ఆ లోయ నేలపై తనను కూర్చుండబెట్టినట్టు అనిపించింది. భావనారుషి కండ్లు తెరిచి చూస్తే నేలపై ఉన్నారు. శరీరాన్ని తడిమి చూసుకుంటే ఒక్క గాయమూ లేదు. చుట్టూ చూస్తే.. ఎవరూ కనిపించ లేదు. ప్రేమైక హరనాథుడే తనను రక్షించాడని భావనారుషి బలంగా విశ్వసించారు. మర్నాడు దినపత్రికల్లో దెబ్బతిన్న బస్సు ఫొటో వేశారు. భావనారుషికి జరిగిన అనుభవాన్ని దువ్వాడ శ్రీ కుసుమ హరనాథ పత్రికలో శ్రీ రాధే గోవిందపంతు వివరంగా రాశారు కూడా! ఆ వ్యాసంలో చిట్ట చివరన ఒక విచిత్రమైన చలోక్తి వాక్యమున్నది. 'శ్రీ హరనాథునికి ఒక బలహీనత ఉన్నది. ఏమిటది? శ్రీ హరనాథుడు భక్త జనుల కష్టాలను విచారించకుండా ఉండలేరు. అది ఆయన బలహీనత' అని భావనారుషి అనుభవానికి ముగింపు పలికారు గోవిందపంతు.





## చెత్తని పక్కాగా తుడిచేద్దాం



ఒకేసారి పెద్ద సంఖ్యలో ఫొటోలు, వీడియోలు, డాక్యుమెంట్లు షేర్ చేస్తుంటాం. దీంతో వాట్సాప్ వినియోగదారులకు స్టోరేజ్ సమస్యలు రావడం చాలా సహజం. ముఖ్యంగా గ్రూప్ చాట్‌లు, అనవసరమైన ఫార్వర్డ్ మెసేజ్‌లు స్టోరేజ్ ఫుల్ అయ్యేలా చేస్తాయి. ఫలితంగా ఫోన్ పనితీరు మందగిస్తుంది. కొత్త ఫైల్స్ స్టోర్ చేయడానికి స్థలం ఉండదు. వాట్సాప్ స్టోరేజ్‌ను సమర్థంగా నిర్వహిస్తే.. సగం సమస్య పరిష్కారం అయినట్టే. ఇందుకోసం మొదట మీ మొబైల్లో వాట్సాప్ ఓపెన్ చేసి, సెట్టింగ్స్‌కు వెళ్లండి. అక్కడ స్టోరేజ్ అండ్ డేటాను ఎంచుకోవాలి. అందులో మేనేజ్ స్టోరేజ్ ఆప్షన్‌ను ట్యాప్ చేయాలి. అప్పుడు 'లార్జ్ ఫైల్స్', 'ఫార్వర్డ్ మెనీ టైమ్స్' కేటగిరీలు చూడొచ్చు. ఫైల్స్‌ను త్వరగా గుర్తించడానికి లార్జెస్ట్ ద్వారా సార్టింగ్ చేయండి. ఎక్కువ స్థలం ఆక్రమిస్తున్న ఫైళ్లను సులభంగా గుర్తించవచ్చు. మీరు తొలగించదలచిన ఫైల్‌ను ఎంచుకుని, డిలిట్ చేసేయొచ్చు. అలాగే, గ్రూప్‌లోని మెసేజ్‌లన్నీ ఒకేసారి క్లియర్ చేయడానికి, ప్రత్యేక చాట్ క్లీనప్ ఆప్షన్‌ను కూడా వినియోగించుకోవచ్చు.

## ఈ నూనె వాడితే.. గుండెకు చాలా మంచిది





**శరీరంలో కొలెస్ట్రాల్ తగ్గించడంలో.. రెండు రకాల కొవ్వులు ఉన్నాయి. అవి.. ఆరోగ్యకర, అనారోగ్యకరమైన కొవ్వులు. వీటిలో చెడు కొవ్వులు.. శరీరానికి హాని చేస్తాయి. చెడు కొలెస్ట్రాల్ శరీరంలో అధికంగా చేరి.. మనిషిని అనారోగ్యానికి గురి చేస్తుంది. చెడు కొలెస్ట్రాల్ వల్ల కాలేయం, గుండెకు సంబంధించిన జబ్బులతోపాటు ఊబకాయం తదితర సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయి. ఒకవేళ శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ఉందని తెలిస్తే.. ఈ కింది చిట్కాలు ఫాలో అయితే చాలు. వాటిని తగ్గించుకోవచ్చు. అవి ఏటంటే..**

శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో ఐదు రకాల నూనెలు సహాయపడుతాయి. శరీరంలోని కొలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయపడే నూనెలతో మీ గుండెను ఆరోగ్యంగా పదిలంగా ఉంచుకోవచ్చు.

నువ్వుల నూనె: ఈ నూనెలో పొగ శాతం అధికంగా ఉంటుంది. ఇందులో కొలెస్ట్రాల్ స్థాయి తక్కువగా ఉంటుంది. ప్రతి టేబుల్ స్పూన్‌లో 5 గ్రాముల కంటే ఎక్కువ మోనోశాచురేటెడ్ కొవ్వుతోపాటు 2 గ్రాముల కొవ్వు ఉంటుంది. ఈ నువ్వుల నూనె.. కూరలు చేయడానికి లేకుంటే సలాడ్‌లో తయారీలో ఉపయోగించవచ్చు. కానీ నువ్వుల నూనెలో కొద్ది పాటి వగరు ఉంటుంది. దీని కారణంగా వంటల్లో వినియోగించడానికి పలువురు సందేహిస్తారు.







వేరుశెనగ నూనె: ఈ నూనెలో చాలా పోషకాలుంటాయి. మార్కెట్‌లో ఈ నూనె ధర అధికంగా ఉంటుంది. అలాగే ఈ నూనెలో కొలెస్ట్రాల్ స్థాయిలు సైతం స్వల్పంగా ఉంటాయి. అందువల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అంతేకాదు క్యాన్సర్ వ్యాధిని నిరోధించడంలో సైతం సహాయ పడుతుంది. ఈ నూనె వినియోగంతో గుండె పనితీరును మెరుగు పరచుకోవచ్చు. నాడీ వ్యవస్థ మెరుగుపరచడానికి.. రోగనిరోధక శక్తిని బలోపేతం చేయటానికి..రక్తపోటును తగ్గించటానికి.. చర్మాన్ని రక్షించడంలో వేరు శనగ నూనె కీలక పాత్ర పోషిస్తుంది.

ఆలివ్ ఆయిల్: ఆలివ్ ఆయిల్‌లో కొలెస్ట్రాల్ ఉండదు. దీనిని ఎక్కువగా సలాడ్‌లు లేదా పాస్తాలో ఉపయోగిస్తారు. ఆలివ్ ఆయిల్‌లో ఒలియోకాంతల్ అనే పదార్థం ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌తోపాటు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది. ఈ నూనె రక్తంలో కొలెస్ట్రాల్, చెడు కొలెస్ట్రాల్ (%ాణా%) ట్రైగ్లిజరైడ్స్ స్థాయిని తగ్గిస్తుంది. అలాగే ఆలివ్ ఆయిల్‌లో ఉండే గుండె-ఆరోగ్యకరమైన కొవ్వులు మంచి కొలెస్ట్రాల్ స్థాయిని మెరుగుపరుస్తుంది.

చియా సీడ్ ఆయిల్: ఆల్ఫా-లినోలెనిక్ యాసిడ్, ఇది గుండె ఆరోగ్యకరమైన ఒమేగా-3 కొవ్వు ఆమ్లాల ఉత్పత్తికి దోహదం చేస్తుంది. చియా విత్తనాలు ఫైబర్, ప్రోటీన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లను అందిస్తుంది. బంగారు రంగులో ఉండే నూనెను చియా అంటారు. ఇది తక్కువ ఫ్రైయింగ్, పాస్తా, సలాడ్‌ల తయారీలో వినియోగిస్తే మంచిది. ఇది తక్కువ రుచిని కలిగి ఉంటుంది. వీటిలో ఫైబర్ స్వల్పంగా ఉంటుంది. కొలెస్ట్రాల్, బ్లడ్ షుగర్‌తోపాటు రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే ఇతర ఆరోగ్య ప్రయోజనాలను ప్రోత్సహించడంలో దోహదపడుతోంది.

అవోకాడో ఆయిల్: అవోకాడో నూనెలో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు పుష్కలంగా ఉంటాయి, ముఖ్యంగా ఒలేయిక్ యాసిడ్, ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది కొవ్వులు చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది, రక్తపోటును తగ్గించడంతోపాటు గుండె జబ్బుల నుంచి రక్షిస్తుంది. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్‌లను కలిగి ఉంటుంది. అవకాడో ఆయిల్ శరీరం సహజంగా తయారు చేయలేని లుటిన్ వంటి ఆరోగ్యకరమైన యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటుంది. కాబట్టి అవోకాడో ఆయిల్‌తో సహా కంటి ఆరోగ్యాన్ని పెంపొందించే లుటిన్‌ని పొందవచ్చు.

## చలికి పెరుగు సరిగా తోడుకోవట్లేదా.. ఈ సింపుల్ టిప్స్‌తో సమస్యకు చెక్..!




భోజనంలో ఎన్ని రకాల వెరైటీలు ఉన్నాసరే చివరలో కొద్దిగా పెరుగుతో తింటేనే సంతృప్తి కలుగుతుంది. అందుకే చాలామంది తాము తినే భోజనంలో కచ్చితంగా పెరుగు ఉండేలా చూసుకుంటారు. అయితే చలికాలం వచ్చిందంటే పెరుగు తోడుకోవడం సమస్యగా మారుతుంది. పెరుగు సరిగా గడ్డకట్టకుండా పాలుపాలుగానే ఉండిపోతుంది. తక్కువ ఉష్ణోగ్రతలే ఇందుకు కారణం. అయితే కొన్ని సింపుల్ టిప్స్ పాటిస్తే ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు. ఆ టిప్స్?ఏమిటో ఇప్పుడు చూద్దాం..

%సాధారణంగా పెరుగు తోడుకోవాలంటే గది ఉష్ణోగ్రత 37 నుంచి 45 డిగ్రీల మధ్య ఉండాలి. కానీ చలికాలంలో ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు ఉండవు. అందుకే ఆ వెచ్చదనాన్ని కలిగించడానికి మనమే బయటి నుంచి ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. అందుకోసం పెరుగు తోడుపెట్టిన తర్వాత ఆ పాత్రని ఒక దళసరి వస్త్రంతో చుట్టాలి. ఆపై గాలి లోపలికి చొరబడకుండా పాత్ర మీద మూత పెట్టాలి. పాత్రను చలిగాలి తగిలేచోట పెట్టకుండా కాస్త వెచ్చగా ఉండే ప్రదేశంలో పెట్టాలి. అప్పుడే పెరుగు గట్టిగా తోడుకునే అవకాశం ఉంటుంది. ఇంట్లో ఓవెన్ ఉన్నవారు ఆ ఓవెన్‌ను ఒక రెండు నిమిషాలపాటు 180 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద వేడిచేసి ఆఫ్ చేయండి. ఇప్పుడు అందులో పెరుగు తోడేసిన పాత్రను 6 నుంచి 7 గంటలు లేదా రాత్రంతా ఉంచండి. ఉదయం లేచేసరికి గడ్డ పెరుగు రెడీగా ఉంటుంది. పైగా రుచికరంగా కూడా తయారవుతుంది. బియ్యం డబ్బా కూడా పెరుగు గట్టిగా తోడుకోవడానికి తోడ్పడుతుంది. పెరుగు తోడేసిన పాత్రను బియ్యం డబ్బాలో పెడితే ఆ వెచ్చదనానికి పెరుగు గట్టిగా తోడుకుంటుంది. పెరుగు తోడుపెట్టిన పాత్రను థర్మాకోల్‌తో చేసిన పెట్టెలో పెట్టినా వెచ్చగా ఉంటుంది. కాబట్టి పెరుగు గట్టిగా తోడుకుంటుంది.

పెరుగు నాణ్యత

పెరుగు గట్టిగా, చిక్కగా, కమ్మగా ఉండాలంటే మనం తోడుకు ఉపయోగించే పెరుగు కూడా నాణ్యమైనదై ఉండాలట. పెరుగు తోడుపెట్టడానికి ఉపయోగించే పాలు కూడా నాణ్యమైనవే అయి ఉండాలి. పాలతో నీటి శాతం ఎక్కువగా ఉండి పలుచగా ఉంటే ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా అది గట్టిగా తోడుకోదు. కాబట్టి పాలు చిక్కగా ఉండేలా చూసుకోవాలి. పాలల్లో తోడు కోసం పెరుగు వేసేముందు అవి గోరువెచ్చగా ఉన్నాయో.. లేదో చెక్ చేసుకోవాలి. మరీ వేడిగా ఉన్న పాలల్లో తోడు వేస్తే అది అంత చిక్కగా, కమ్మగా ఉండకపోవచ్చు. పైగా పెరుగు కాస్త జిగురుగా, నీళ్లలా కూడా అనిపించే అవకాశం ఉంది.

## నెయిల్ పాలిష్ ఎంత ప్రమాదకరమో తెలుసా..



చాలా మంది మహిళలు నెయిల్ పాలిష్‌ను ఇష్టపడతారు. వారు తమ గోర్లు అందంగా కనిపించడానికి తరచుగా దీనిని ఉపయోగిస్తారు. కొంతమంది మహిళలు నెయిల్ పాలిష్ లేకుండా తమ గోళ్లను ఎప్పుడూ ఉంచరు. మరికొందరు మహిళలు పెళ్లిళ్లు లేదా పండుగలు వంటి ప్రత్యేక సందర్భాలలో మాత్రమే తమ గోళ్లకు నెయిల్ పాలిష్ వేస్తారు. అయితే, గోళ్ల అందాన్ని పెంచే నెయిల్ పాలిష్ వాడటం ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం.

నెయిల్ పాలిష్ మానవ శరీరంపై అనేక హానికరమైన ప్రభావాలను కలిగిస్తుంది. నెయిల్ పాలిష్‌లో ఉండే రసాయనాలు శరీరంలోకి ప్రవేశించి నాడీ వ్యవస్థ, మెదడు, జీర్ణవ్యవస్థ, హార్మోన్ల వ్యవస్థ, వెన్నెముకపై ప్రభావం చూపుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. నెయిల్ పాలిష్‌ను 9-10 గంటల పాటు పూయడం వల్ల గొంతు వాపు, దురద, చర్మంపై మంటలు, ఇతర సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని కూడా పేర్కొన్నారు.

**క్యాన్సర్..**

నెయిల్ పాలిష్ వాడకం శరీరంపై ప్రమాదకర ప్రభావాలను చూపుతుంది. నెయిల్ పాలిష్‌లో ప్రధానంగా ఫార్మాల్డిహైడ్ అనే రసాయనం ఉంటుంది, ఇది గోళ్ల చర్మం ద్వారా నేరుగా రక్తప్రవాహంలోకి ప్రవేశిస్తుంది. ఈ రసాయనాన్ని ఎక్కువగా వాడటం వల్ల హార్మోన్లలో మార్పులు వస్తాయని, కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

**శ్వాస సంబంధిత సమస్యలు**

నెయిల్ పాలిష్ శరీరంలోకి ప్రవేశించి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని కలిగిస్తుంది. కొన్ని సందర్భాల్లో, నెయిల్ పాలిష్ నోటి ద్వారా శరీరంలోకి ప్రవేశించి, వాంతులు, విరేచనాలు వంటి అనారోగ్యాలను కలిగిస్తుంది. నెయిల్ పాలిష్‌ను ఉపయోగించినప్పుడు అందులోని పదార్థాలను తనిఖీ చేయాలని వైద్యులు సిఫార్సు చేస్తున్నారు.

ప్రస్తుతం, కొన్ని కంపెనీలు తక్కువ-రిస్క్ పదార్థాలతో నెయిల్ పాలిష్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. అయితే, నెయిల్ పాలిష్ వాడకాన్ని పరిమితం చేయడం ఉత్తమం.

## పారేయక్కర్లేదు మళ్లీ వాడుకోవచ్చు!







**మహిళలు తరచూ తేలికపాటి మేకప్ వేసుకుంటూ ఉంటారు. ఒక్కోసారి లిప్‌స్టిక్ విరిగిపోతుంటుంది. నెయిల్ పాలిష్ లాంటివి పొడారిపోతుంటాయి. కొన్ని చిట్కాలతో వీటిని సరిచేసి చక్కగా ఉపయోగించుకోవచ్చు. ఆ వివరాలు...**

మస్కారా

కళ్లకు మస్కారా వేసుకునేటప్పుడు బాటిల్‌ను తెరచి ఉంచాల్సి వస్తుంది. ఆ కారణంగా మస్కారా తేమను కోల్పోయి గట్టిపడుతుంది. అలాంటప్పుడు మస్కారా బాటిల్‌లో మూడు చుక్కల బాదం నూనె వేసి కలపాలి. రెండు గంటల తరవాత చిక్కని ద్రవంలా మారి మస్కారా వేసుకోవడానికి అనువుగా ఉంటుంది.

నెయిల్ పాలిష్

సీసా మూత ఎంత గట్టిగా బిగించినప్పటికీ నెయిల్ పాలిష్ తడారిపోయి గట్టిపడుతుంటుంది. అలాంటప్పుడు సీసాలో నాలుగు చుక్కల నెయిల్ పాలిష్ రిమూవర్ వేసి కలపాలి. అయిదు నిమిషాల తరవాత నెయిల్ పాలిష్ ద్రవరూపంలోకి వచ్చి కొత్తదానిలా మెరుస్తుంది.

**కాంపాక్ట్ పౌడర్**

కాంపాక్ట్ పౌడర్‌ను కొంతకాలం వాడిన తరవాత పొడిబారి బాక్స్‌లోనే ముక్కలుగా విరిగిపోతుంటుంది. వీటి మీద కొద్దిగా రబ్బింగ్ ఆల్కహాల్ రాసి దగ్గరగా చేరిస్తే చాలు. అయిదు నిమిషాల్లో ముక్కలన్నీ చక్కగా అతుక్కుంటాయి. కాంపాక్ట్ మృదువుగా మారి పఫ్‌తో అద్దడానికి వీలుగా తయారవుతుంది.

**లిప్‌స్టిక్**

లిప్‌స్టిక్ తేమను కోల్పోయి పూర్తిగా పొడిబారి రంగు మారితే దానిని అయిదు నిమిషాలు వేడినీటిలో ఉంచాలి. లిప్‌స్టిక్ మృదువుగా అవడమే కాకుండా దాని రంగు తిరిగి వస్తుంది. లిప్‌స్టిక్ విరిగితే పది నిమిషాలు ఫ్రిజ్‌లో ఉంచాలి. విరిగిన భాగాలు అతుక్కుని మళ్లీ ఉపయోగించు కోవడానికి వీలుగా మారుతుంది.






## భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు.. ఈ రోజు టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..



**న్యూఢిల్లీ- నవభూమి:**అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాలు ఉన్నప్పటికీ, కనిష్టాల వద్ద మదుపర్లు కొనుగోళ్లు సాగిస్తుండడంతో మంగళవారం ఉదయం దేశీయ సూచీలు లాభాల బాటలో సాగుతున్నాయి. ఈ వారంలో 5,6 తేదీలలో ఆర్బీఐ ద్రవ్యపరపతి మీటింగ్ జరగనుంది. కీలక వడ్డీ రేట్లను 0.25 శాతం తగ్గించవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తుండడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరుస్తోంది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ లాభాలతో మొదలయ్యాయి.సోమవారం ముగింపు (77, 186)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం 500 పాయింట్లకు పైగా లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత లాభాల్లోకి దూసుకెళ్లింది. ఒక దశలో దాదాపు 750 పాయింట్లుకు పైగా లాభపడి 77, 951 వద్ద గరిష్టానికి చేరుకుంది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో 692 పాయింట్ల లాభంతో 76, 878 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదులుతోంది. ప్రస్తుతం 204 పాయింట్లు లాభపడి 23, 565 వద్ద కొనసాగుతోంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంక్ తదితర హెవీ వెయిట్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను లాభాల వైపు నడిపిస్తున్నాయి. సెన్సెక్స్‌లో మదర్సన్, సోనా బీఎల్‌డబ్ల్యూ, ఏబీబీ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు లాభాల్లో ఉన్నాయి. ట్రెంట్, టాటా కెమికల్స్, బర్గర్ పెయింట్స్, యునైటెడ్ బ్రూవరీస్ షేర్లు భారీ నష్టాల్లో ఉన్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 898 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది.

## గిఫ్ట్ ఐటీ ప్రధాన కార్యాలయమైన అర్థ భారత్ COO, ICAI నుండి సిఏ ఉమెన్ ఆఫ్ ది ఇయర్" అవార్డును గెలుచుకున్న అశ్విని




**న్యూఢిల్లీ-నవభూమి:**కేంద్ర న్యాయ – న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఒక గొప్ప కార్యక్రమంలో అర్థ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ IFSC LLP యొక్క చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అశ్విని సావ్రికర్‌కు ఉమెన్ చార్టర్డ్ అకౌంటెంట్ ఆఫ్ ది ఇయర్ అవార్డును ప్రదానం చేశారు. దానికి మిస్టర్. రంజిత్ కుమార్ అగర్వాల్, ప్రెసిడెంట్, ICAI చరణ్‌జోత్ సింగ్ నందా, ICAI వైస్ ప్రెసిడెంట్ మరియు ప్రీతి పరాస్ సావ్లా, ICAI సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ – చైర్‌పర్సన్, ICAI, WMEC కూడా హాజరయ్యారు. గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్–సిటీ లో ఏర్పాటు చేసిన మొదటి డిస్ట్రెస్డ్ డెట్ ఫండ్ అయిన 1100 కోట్ల రూపాయల విలువైన అర్థ గ్లోబల్ ఆపర్చునిటీస్ ఫండ్‌కు అర్థ భారత్ ఇన్వెస్ట్మెంట్ మేనేజర్‌గా పనిచేస్తుంది. ఇది భారతదేశంలోని ఏకైక అంతర్జాతీయ ఆర్థిక సేవల కేంద్రం. శ్రీమతి సావ్రికర్ అర్థభారత్ వద్ద రిస్క్ మేనేజ్మెంట్, కంప్లయన్స్, బ్యాక్–ఆఫీస్ కార్యకలాపాలు, హెచ్‌ఆర్, ఫైనాన్స్ మరియు అడ్మినిస్ట్రేషన్‌ను పర్యవేక్షిస్తారు. ఈ అవార్డును భారతదేశంలోని %CA%లకు అత్యున్నత నియంత్రణ సంస్థ అయిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసింది. అవార్డును స్వీకరించిన తరువాత, శ్రీమతి సావ్రికర్ ఇలా వ్యాఖ్యానించారు, "ఈ అవార్డు ఆర్థిక రంగంలో మహిళా నిపుణుల బలానికి నివాళి, వారు భారతదేశాన్ని అమృత్ కల్ వైపు నడిపించడానికి తమ నైపుణ్యాన్ని అందిస్తున్నారు మరియు వికసిత్ భారత్ యొక్క దృష్టిని సాధించడంలో ప్రభుత్వానికి సహాయపడుతున్నారు. ఈ గుర్తింపు ప్రతి మహిళా పెద్ద కలలు కనడానికి, ఉన్నత లక్ష్యాన్ని సాధించడానికి మరియు అలా చేయడంలో, వారి కుటుంబాలను మరియు దేశాన్ని గర్వపడేలా చేయడానికి ప్రోత్సహిస్తుందని నేను ఆశిస్తున్నాను "అని అన్నారు. ICAI ద్వారా స్థాపించబడిన CA ఉమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు, వృత్తిలో అత్యుత్తమ సేవలందిస్తున్న మహిళా %CA%లు, సభ్యులు మరియు విద్యార్థులను గుర్తిస్తుంది. ఇది వారి అభిరుచి, అంకితభావం మరియు సంకల్పం సానుకూల సామాజిక ప్రభావాన్ని సృష్టించిన వారిని గౌరవిస్తుంది. సభ్యులకు మార్గదర్శకత్వం వహించడం, సెషన్‌లు నిర్వహించడం, అవగాహన కల్పించడం, జ్ఞానాన్ని అందించడం మరియు సామాజిక మార్పును స్వీకరించడం ద్వారా ICAIకి గణనీయంగా సహకరించిన మహిళా సభ్యుల నుండి అవార్డు గ్రహీతలు ఎంపిక చేయబడతారు' అని CA ఉమెన్ ఎక్సలెన్స్ అవార్డులపై ICAI వివరణాత్మక నోట్ పేర్కొంది. CA సంస్థ గోఖలే – సాథేలో ఇంటర్న్‌షిప్‌తో తన ప్రయాణాన్ని ప్రారంభించిన అశ్విని సావ్రికర్, 22 ఏళ్ల చిన్న వయస్సులో చార్టర్డ్ అకౌంటెంట్‌గా అర్హత సాధించారు, ఆమె గ్రాడ్యుయేషన్‌తో పాటు ఈ కఠినమైన అర్హతను పూర్తి చేయగలిగింది.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు.. ఈ రోజు బంగారం, వెండి ధరలు ఇవే..



**న్యూఢిల్లీ-నవభూమి:**బంగారం వెండి కొనాలనుకుం టున్నారా? బంగారం ధరలు ఆల్‌టైమ్ గరిష్టానికి దగ్గరగా ఉన్నాయి. కొన్ని రోజుల క్రితం వరకు 80 వేలకు దిగువన కొనసాగిన బంగారం ఒక్కసారిగా పెరిగిపోయింది. కేంద్ర ప్రభుత్వం బంగారం దిగుమతులపై పన్నును పెంచబోతుండడమే దీనికి కారణంగా కనిపిస్తోంది.బంగారం వెండి కొనాలనుకుంటున్నారా? బంగారం ధరలు ఆల్‌టైమ్ గరిష్టానికి దగ్గరగా ఉన్నాయి. కొన్ని రోజుల క్రితం వరకు 80 వేలకు దిగువన కొనసాగిన బంగారం ఒక్కసారిగా పెరిగిపోయింది. కేంద్ర ప్రభుత్వం బంగారం దిగుమతులపై పన్నును పెంచబోతుండడమే దీనికి కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (ఫిబ్రవరి 4న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 84, 040కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 77, 040కి చేరింది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 84, 190కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 77, 190కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 84, 040కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 77, 040కి చేరింది. వెండి ధరలు కూడా స్థిరంగానే ఉన్నాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)

హైదరాబాద్‌లో రూ. 84, 040, రూ. 77, 040
విజయవాడలో రూ. 84, 040, రూ. 77, 040
ఢిల్లీలో రూ. 84, 190, రూ. 77, 190
ముంబైలో రూ. 84, 040, రూ. 77, 040
వడోదరలో రూ. 84, 090, రూ. 77, 090కోల్‌కతాలో రూ. 84, 040, రూ. 77, 040
చెన్నైలో రూ. 84, 040, రూ. 77, 040
బెంగళూరులో రూ. 84, 040, రూ. 77, 040
కేరళలో రూ. 84, 040, రూ. 77, 040
పుణెలో రూ. 84, 040, రూ. 77, 040

ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కేజీకి)

హైదరాబాద్‌లో రూ. 106, 900
విజయవాడలో రూ. 106, 900
ఢిల్లీలో రూ. 99, 400
చెన్నైలో రూ. 106, 900
కోల్‌కతాలో రూ. 99, 400
కేరళలో రూ. 106, 900
ముంబైలో రూ. 99, 400
బెంగళూరులో రూ. 99, 400
వడోదరలో రూ. 99, 400
అహ్మదాబాద్‌లో రూ. 99, 400



## భారత్‌లో ఆ కారును దేకలే.. కానీ జపాన్‌లో భారీ డిమాండ్.. ఏకంగా బుకింగ్స్ నిలిపివేత!




**న్యూఢిల్లీ-నవభూమి:** మారుతీ సుజుకీ ఇండియా కంపెనీ చాలా రకాల మోడల్స్ మార్కెట్లోకి తీసుకొచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో బ్రెజా, గ్రాండ్ విటారా, ఫ్రాంక్స్, జిమ్ని ఎస్‌యూవీలను లాంచ్ చేసిన సంగతి తెలిసిందే. అందులో బ్రెజా, గ్రాండ్ విటారా, ఫ్రాంక్స్ కార్లు మంచి సేల్స్ సాధించినప్పటికీ జిమ్మి మాత్రం అంచనాలను అందుకోలేకపోయింది. సేల్స్‌లో నిరాశపరిచింది. 960 కోట్ల పెట్టుబడితో మారుతీ సుజుకీ 5 డోర్ల జిమ్మి కారును తయారు చేయడం ప్రారంభించింది. భారత్‌లో దీనిని 2023లో లాంచ్ చేసింది. ఆ తర్వాత రెండు నెలలకు ఫ్రాంక్స్ కారును తీసుకొచ్చింది. తర్వాత వచ్చిన కారు మంచి సేల్స్ అందుకున్నా జిమ్ని అందుకోలేకపోయింది. భారతీయులకు ఈ కారు పెద్దగా నచ్చలేదని అర్థమైంది. ఫైనాన్షియల్ ఇయర్ 2024లో జిమ్మి కేవలం 17 వేల సేల్స్ సాధించింది. అదే ఫ్రాంక్స్ 1.34 లక్షలు, బ్రెజా 1.69 లక్షల సేల్స్ సాధించాయి. అంటే భారతీయులు జిమ్మి కారును దేకలేదని స్పష్టమవుతోంది.అయితే, భారతీయులు పక్కనపెట్టేసిన మారుతీ జిమ్ని 5 డోర్ కారు కు జపాన్‌లో భారీ డిమాండ్ ఉంది. ఎంతలా అంటే బుకింగులను తాత్కాలింగా నిలిపేయాల్సి వచ్చింది. జపాన్‌లో సుజుకీ జిమ్ని బుకింగులను జనవరి 30, 2025 నుంచి మొదలు పెట్టగా ఏప్రిల్ 3, 2025 నుంచి డెలివరీలు అందిస్తామని కంపెనీ పేర్కొంది. ఈ ఎస్‌యూవీ కారుకు జపాన్ ప్రజల నుంచి మంచి డిమాండ్ వచ్చింది. బుకింగులు ప్రారంభించిన నాలుగు రోజుల్లోనే 50 వేలకుపైగా అడ్వాన్స్ బుకింగ్స్ రావడం గమనార్హం. డిమాండ్‌కి తగినట్లుగా సరఫరా లేకపోవడంతో వెయిటింగ్ పీరియడ్ పెరిగింది. దీంతో బుకింగ్స్ తాత్కాలికంగా నిలిపివేసింది మారుతీ సుజుకీ. తిరిగి ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయంపై క్లారిటీ ఇవ్వలేదు.జపాన్‌లో సుజుకీ జిమ్ని 5 స్పీడ్ మాన్యువల్ వేరియంట్ ధర రూ.14.88 లక్షల నుంచి ప్రారంభమవుతోంది. ఆటోమేటిక్ వెర్షన్ ధర రూ.15.43 లక్షలుగా ఉంది. అదే భారత్‌లో ఈ కారు ప్రారంభ ధర రూ.12.74 లక్షలుగా ఉంది. రూ.14.79 లక్షల వరకు నిర్ణయించింది. మహీంద్రా థార్ రాక్స్, ఫోర్స్ గురా? వంటి 5 డోర్ ఎస్‌యూవీ కార్లకు జిమ్ని పోటీ ఇస్తోంది. ఈ ఎస్‌యూవీ కారులో 1.5 లీటర్ 4 సిలిండర్ పెట్రోల్ ఇంజిన్ ఉంటుంది. 105 హార్స్ పవర్ శక్తిని,134 ఎన్‌ఎం టార్క్ విడుదల చేస్తుంది. 5 స్పీడ్ మాన్యువల్ 4 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను తీసుకొచ్చారు. మాన్యువల్ వేరియంట్ 16.94 కిలోమీటర్లు మైలేజ్, ఆటోమేటిక్ వేరియంట్ లీటర్‌కు 16.39 కిలోమీటర్లు మైలేజ్ ఇస్తుందని కంపెనీ తెలిపింది.

### వెనక్కి తగ్గిన ట్రంప్.. సెన్సెక్స్ 1000 పాయింట్లు జంప్..

## బంగారం ధరలో 'భారీ' మార్పు!



**ముంబై-నవభూమి:**అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ అప్పటికప్పుడు తీసుకుంటున్న కఠిన నిర్ణయాలతో ప్రపంచ దేశాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఇటీవల మెక్సికో, కెనడా నుంచి అమెరికాకు వచ్చే ఉత్పత్తులపై 25 శాతం సుంకం విధిస్తానని ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. మరోవైపు చైనా నుంచి వచ్చే దిగుమతులపైనా 10 శాతం దిగుమతి సుంకం ప్రకటించారు. ఈ క్రమంలోనే మళ్లీ అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో.. వాణిజ్య యుద్ధం మళ్లీ వస్తుందన్న భయంతో.. ప్రపంచ స్టాక్ మార్కెట్లు భారీగా పతనం అయ్యాయి. ఇదే క్రమంలో అనిశ్చిత పరిస్థితుల్లో సురక్షిత పెట్టుబడిగా ఉండే, ఆర్థికంగా భరోసా కల్పించే బంగారంపై పెట్టుబడులు మళ్లగా.. రికార్డు స్థాయిలో బంగారం ధరలు పెరిగాయి.అయితే ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. అమెరికా, మెక్సికోలపై విధించిన టారిఫ్స్‌పై డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తగ్గారు. ప్రస్తుతానికి ఈ సుంకాల విధింపును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలోనే మళ్లీ స్టాక్ మార్కెట్లకు పాజిటివ్ సెంటిమెంట్ తోడైంది. వాణిజ్య యుద్ధ భయం సంకేతాలు కలిగించిన ట్రంప్ నుంచి సానుకూల ప్రకటన రావడంతో ఆసియా సహా మన స్టాక్ మార్కెట్ సూచీలు కూడా పుంజుకుంటున్నాయి. ఇన్వెస్టర్లు భారీగా కొనుగోళ్లు జరుపుతున్నారు. ఈ వార్త రాసే సమయంలో మధ్యాహ్నం 2 గంటలకు బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ సెన్సెక్స్ ఏకంగా 1100 పాయింట్లకుపైగా పెరిగి 78,300 మార్కుపైన ట్రేడవుతోంది. ఇదే సమయంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ నిఫ్టీ 320 పాయింట్ల లాభంతో 23 వేల 670 మార్కుపైన కొనసాగుతోంది. పలు హెవీ వెయిట్ స్టాక్స్ కూడా ఈ క్రమంలోనే రాణిస్తూ మార్కెట్లకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి.ఇలా మార్కెట్లు లాభాల్లో ఉన్న క్రమంలోనే బంగారం ధరలు కూడా మరోవైపు దిగొస్తున్నాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో కిందటి సెషన్లో ఏకంగా 2830 డాలర్ల వద్ద ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయిని తాకగా.. ఇప్పుడు వార్త రాసే సమయంలో అది 2810 డాలర్ల దిగువకు చేరింది. స్పాట్ సిల్వర్ రేటు 31.60 డాలర్ల వద్ద ఉండేది. దీనికి ముందు మాత్రం.. సుంకాల విధింపు నేపథ్యంలో స్పాట్ గోల్డ్ రేటు 2780 డాలర్ల నుంచి గరిష్టాలకు చేరగా.. ట్రంప్ వెనక్కి తగ్గిన నేపథ్యంలోనే మళ్లీ బంగారం ధరలు దిగొస్తున్నాయి. ఇలా ఒక్కరోజు వ్యవధిలోనే భారీగా పెరగడం.. మళ్లీ వెనక్కి తగ్గడం జరగడం గమనార్హం. ఇక రూపాయి విలువ కూడా కాస్త పుంజుకుంది. ప్రస్తుతం రూ. 87.07 వద్ద ఉంది. ఇక దేశీయంగా గోల్డ్ రేట్లు చుక్కలు చూపిస్తున్నాయి. తాజాగా ఫిబ్రవరి 4న 22 క్యారెట్స్ గోల్డ్ రేటు హైదరాబాద్ మార్కెట్లో రూ. 1050 పెరిగి తులం రూ. 78,100 కు చేరింది. 24 క్యారెట్ల పసిడి ధర రూ. 85,200 కు చేరడం ఆందోళన కలిగిస్తోంది.

### మార్జినల్ రిలీఫ్ అంటే ఏంటి..? ట్యాక్స్ లిమిట్ దాటినా..

## అసలు పన్ను ఎలా ఆదా చేసుకోవచ్చంటే..?



**న్యూఢిల్లీ-నవభూమి:** బడ్జెట్ 2025-26లో కేంద్ర ప్రభుత్వం మధ్యతరగతి వర్గానికి భారీ ఉపశమనం కల్పించింది. ఆదాయపు పన్ను భారాన్ని గణనీయంగా తగ్గించింది. ఈసారి ట్యాక్స్ రిబేట్‌ను కొత్త పన్ను విధానంలో రూ. 7 లక్షల నుంచి రూ. 12 లక్షలకు పెంచుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అంటే రూ. 12 లక్షల వరకు సంపాదించే వ్యక్తులకు పన్ను ఉండదని చెప్పారు. ఇంకా పన్ను శ్లాబుల్ని కూడా సవరించారు. ఇదే సమయంలో వేతన జీవులు (శాలరీడ్ పర్సన్స్- జీతం పొందేవారు) అయితే స్టాండర్డ్ డిడక్షన్ కింద పన్ను వర్తించే ఆదాయంపై రూ. 75 వేల వరకు తగ్గించుకోవచ్చు. అంటే ఇక్కడ వేతన జీవులు మాత్రం గరిష్టంగా రూ. 12.75 లక్షల వరకు ట్యాక్స్ చెల్లించాల్సిన పని లేదు.అదే ఇక్కడ ఇతర సెల్ఫ్ ఎంప్లాయిడ్ ఇండివిడ్యువల్స్ (స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులు- అంటే వేతన జీవులు కానివారు), హిందూ అవిభాజ్య కుటుంబాలకు (%ఎఖఫీ%) చెందినవారు స్టాండర్డ్ డిడక్షన్ పొందలేరు. వీరికి రూ. 12 లక్షల వరకు ఆదాయంపై మాత్రమే ట్యాక్స్ ఉండదు. అయితే ఆపైన రూపాయి సంపాదించినా ప్రస్తుత పన్ను శ్లాబుల ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది.ఇక్కడ ఉదాహరణకు చూస్తే సంవత్సరానికి రూ. 12,10,000 సంపాదించే వ్యక్తి.. ప్రస్తుతం పన్ను శ్లాబుల ప్రకారం (మొదట 4 లక్షలకు 0 శాతం, తర్వాత 4 లక్షలపై 5 శాతం అంటే రూ. 20 వేలు, ఆపైన 4 లక్షలపై 10 శాతం అంటే రూ. 40 వేలు, పైన 10 వేలపై 15 శాతం అంటే రూ. 1500) ఇలా మొత్తం రూ. 61,500 పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇక్కడ పన్ను చెల్లిస్తే అతని టేక్ హోమ్ శాలరీ రూ. 12,10,000–61,500= రూ. 11,48,500 అవుతుంది. అదే రూ. 12 లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి.. నో ట్యాక్స్ కాబట్టి వారి టేక్ హోమ్ రూ. 12 లక్షలుగా ఉంటుంది. అంటే ఇక్కడ 12 లక్షల కంటే ఎక్కువ సంపాదించిన వారికి టేక్ హోమ్ తగ్గుతుందని గమనించొచ్చు.

**మార్జినల్ రిలీఫ్:**

అయితే ఇక్కడే పన్ను చెల్లింపుదారుల కోసం కొత్త పన్ను విధానంలో మార్జినల్ రిలీఫ్ ఉంటుంది. ఇది పన్ను వర్తించే ఆదాయంపై కొద్ది మొత్తం ఎక్కువ సంపాదించే వారికి ఊరట కల్పిస్తుంది. అంటే వారికి ట్యాక్స్ శ్లాబుల ప్రకారం పడే పన్ను.. రూ. 12 లక్షలకు మించి ఉన్న ఆదాయం కంటే ఎక్కువ ఉన్నప్పుడు మార్జినల్ రిలీఫ్ వర్తిస్తుంది. అప్పుడు.. రూ. 12 లక్షలకుపైన ఎంత ఆదాయం ఎక్కువ ఉంటే అది చెల్లిస్తే సరిపోతుంది. దీనితో కూడా పన్ను ఆదా చేసుకోవచ్చు. దీనిని ఉదాహరణలతో చూద్దాం ఒక వ్యక్తి (వేతన జీవులు కాని వారు) రూ. 12.10 లక్షలు సంపాదిస్తే.. ట్యాక్స్ శ్లాబుల ప్రకారం రూ. 61,500 పన్ను చెల్లించాలి. కానీ ఇక్కడ ఆ వ్యక్తికి రూ. 12 లక్షలకు మించి ఉన్న ఆదాయం రూ. 10 వేలు. దీని కంటే ట్యాక్స్ ఎక్కువ పడుతుంది. ఇక్కడ మార్జినల్ రిలీఫ్ వర్తిస్తుంది. కాబట్టి పైన ఉన్న ఆదాయం అయిన రూ. 10 వేలు చెల్లిస్తే చాలు. ఇలా రూ. 61,500–10000= 51,500 ఆదా చేసుకోవచ్చు. ఇదే విధంగా రూ. 12.50 లక్షల ఆదాయంపైన చూస్తే పన్ను శ్లాబుల ప్రకారం మొదటి 4 లక్షలపై 0, తర్వాతి రూ. 4 లక్షలపై 5 శాతం 20 వేలు, తర్వాతి 4 లక్షలపై 10 శాతం 40 వేలు, తర్వాతి 50 వేలపై 15 శాతం రూ. 7500 ఇలా మొత్తం రూ. 67,500 ట్యాక్స్ చెల్లించాల్సి వస్తుంది. ఇక్కడ కూడా రూ. 12 లక్షలపైన ఉన్న ఆదాయం రూ. 50 వేల కంటే.. ట్యాక్స్ ఎక్కువ పడుతుంది. కాబట్టి పైన ఆదాయం అయిన రూ. 50 వేల వరకు ట్యాక్స్ చెల్లిస్తే చాలు. ఇక్కడ రూ. 67500– రూ. 50000= రూ. 15 వేలు ఆదా చేసుకోవచ్చు.

## రతన్ టాటా ఫ్రెండ్ శంతను నాయుడికి.. టాటా మోటార్స్‌లో కీలక బాధ్యతలు



**న్యూఢిల్లీ-నవభూమి:** దివంగత పారిశ్రామికవేత్త రతన్ టాటాతో అత్యంత సన్నిహితంగా మెలిగిన వ్యక్తి శంతను నాయుడు రతన్ టాటాతో ఆ యువకుడి స్నేహం అందరినీ ఆశ్చర్యపరిచిందని చెప్పవచ్చు. టాటాకు అత్యంత విశ్వాసపాత్రుడైన అసిస్టెంట్‌గా వ్యవహరించారు శంతను. అయితే, రతన్ టాటా మరణానంతరం ఆయన ప్రియ మిత్రుడు శంతను నాయుడు ఎటు వెళ్లారు? అనే విషయం తెలుసుకునేందుకు చాలా మంది ఆసక్తి చూపించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆ యువకుడు తాజాగా లింక్డ్‌ఇన్ వేదికగా ఓ కీలక ప్రకటన చేశారు. తాను టాటా గ్రూప్‌లో కీలక బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు.దేశీయ దిగ్గజ ఆటో మొబైల్ సంస్థ టాటా మోటార్స్‌లో స్ట్రాటజిస్ట్ ఇనీషియేటివ్స్ విభాగానికి హెడ్, జనరల్ మేనేజర్‌గా నియామకమైనట్లు శంతను నాయుడు లింక్డ్‌ఇన్‌లో రాసుకొచ్చారు. 'టాటా మోటార్స్‌లో జనరల్ మేనేజర్, హెడ్– స్ట్రాటజిక్ ఇనీషియేటివ్‌గా కొత్త ప్రయాణం మొదలు పెట్టినందుకు సంతోషంగా ఉంది. మా నాన్న టాటా మోటార్స్ ప్లాంట్ నుంచి తెల్ల చొక్కా, నేవీ ప్యాంట్ వేసుకుని ఇంటికొచ్చేవారు. ఆయన కోసం కిటికీ వద్ద నిలబడి ఎదురు చూసేవాడిని. ఇప్పుడు లైఫ్ ఫుల్ సర్కిల్‌లోకి వచ్చింది.' అంటూ లింక్డ్‌ఇన్ ప్రొఫైల్‌లో శంతను నాయుడు రాసుకొచ్చారు.శంతను నాయుడు తన ఆటో మొబైల్ ఇంజినీరింగ్ డిగ్రీని సావిత్రి బాయి పూలే పుణె యూనివర్సిటీలో 2014 లో పూర్తి చేశారు. ఆ తర్వాత కార్నెల్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ డిగ్రీని 2016 లో అందుకున్నారు. 2018 లో రతన్ టాటా సహాయకుడిగా చేరారు. రతన్ టాటాకి అత్యంత సన్నిహితుడిగా మారడంతో యావత్ దేశ ప్రజల దృష్టిని ఆకర్షించారు. రతన్ టాటా కోసం బర్త్ డే సాంగ్ పాడిన నాయుడు వీడియో వైరల్‌గా మారింది. వీధి శునకాలను వేగంగా వెళ్లే కార్ల నుంచి ఎలా రక్షించవచ్చో ఒక కొత్త సాంకేతికతను 2014 లో డెవలప్ చేసిన క్రమంలో రతన్ టాటా దృష్టిని ఆకర్షించారు. ఈ ప్రాజెక్టులో రతన్ టాటా పెట్టుబడి పెట్టారు. శంతను నాయుడు మెంటర్‌గా బాస్‌గా, క్లోజ్ ఫ్రెండ్‌గా మారారు.

## మహిళలకు బడ్జెట్‌లో నిరాశ.. ఆ గొప్ప స్కీమ్‌కు చెక్ పెట్టినట్లేనా.. ఒక్కసారి రూ. 2 లక్షలు జమ చేస్తే..!



**న్యూఢిల్లీ-నవభూమి:**2023 బడ్జెట్ లో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇక్కడ వయసుతో సంబంధం లేకుండా మహిళలు ఎవరైనా చేరొచ్చు. మైనర్ల పేరిట వారి తల్లిదండ్రులు లేదా గార్డియన్స్ అకౌంట్ ఓపెన్ చేసేందుకు వీలుంటుంది. మహిళల్లో ఆర్థిక సాధికారత పెంపొందించేందుకు.. మహిళలకు పొదుపు అలవాటు చేసేందుకు.. ఉద్దేశించిన పథకం ఇది. ఈ స్కీంకు ఆరంభంలో మంచి ఆదరణే లభించింది. పెద్ద మొత్తంలో అకౌంట్లు ఓపెన్ చేశారు కూడా. 2023 బడ్జెట్లో ఈ స్కీంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన చేయగా.. అదే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది.అయితే ఈ స్కీమ్ ప్రారంభించిన సమయంలోనే 2025 మార్చి 31 వరకు అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. అయితే ఇప్పుడు అందుకోసం దాదాపు మరో 2 నెలల్లోపే గడువు ఉన్న క్రమంలో ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో ఈ స్కీమ్ పొడిగింపుపై ప్రకటన వస్తుందని అంతా ఆశించారు. అయితే.. వారికి నిరాశే ఎదురైంది. అసలు ఈ స్కీం గురించి ఎలాంటి ప్రకటనా రాకపోవడం గమనార్హం. అంటే ప్రస్తుతానికి స్కీమ్ గడువు మార్చి 31 వరకే ఉంది. అంటే ఆసక్తి గల మహిళా పెట్టుబడిదారులు.. ఇందులో ఆలోపే చేరడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈ స్కీమ్ తీసుకొచ్చింది కేంద్ర ప్రభుత్వం. ఇందులో వార్షిక ప్రాతిపదికన 7.50 శాతం వడ్డీ రేటు ఉంది. ప్రస్తుతం రెండేళ్ల వ్యవధికి చాలా బ్యాంకులు ఆఫర్ చేస్తున్న వడ్డీ రేట్ల కంటే ఇందులోనే కాస్త ఎక్కువ వడ్డీ ఉందని చెప్పొచ్చు. అందుకే ఈ స్కీంకు మంచి ఆదరణ వచ్చింది.పెట్టుబడి విషయానికి వస్తే.. దీంట్లో కనీసం రూ. 1000 నుంచి డబ్బులు జమ చేయొచ్చు. గరిష్టంగా రూ. 2 లక్షల వరకు డిపాజిట్ చేసేందుకు అవకాశం ఉంది. స్కీమ్ గడువు కూడా రెండేళ్లుగా ఉంటుంది అంటే ఇప్పుడు 2025, ఫిబ్రవరి 5న ఇందులో చేరితే.. మెచ్యూరిటీ 2027, ఫిబ్రవరి 5న అవుతుందన్నమాట. ఇప్పుడు డబ్బులు జమ చేస్తే.. సరిగ్గా రెండేళ్లకు మీ చేతికి డబ్బులు వస్తాయి. ఏడాది తర్వాత కూడా డబ్బుల్ని పాక్షికంగా 40 శాతం వరకు ఉపసంహరించుకోవచ్చు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే అకౌంట్ నుంచి వైదొలిగే అవకాశం ఉంటుంది. ఇక్కడ మెచ్యూరిటీ రాబడిపై ట్యాక్స్ వర్తిస్తుంది.ఇక ఇందులో రూ. లక్ష జమ చేసినట్లయితే 7.50 శాతం వడ్డీ రేటు ప్రకారం.. ఏడాదిలో రూ. 16,022 వడ్డీ వస్తుంది. అదే రూ. 2 లక్షలు జమ చేసినట్లయితే అప్పుడు రూ. 32,044 వడ్డీ వస్తుంది. ప్రస్తుతానికి ఈ పథకం గురించి ఎలాంటి ప్రకటనా చేయనందున పొడిగింపుపై స్పష్టత లేదు. మరి.. మార్చి 31 లోపు కేంద్రం ఈ స్కీమ్ గురించి ఏమైనా ప్రకటన చేసే అవకాశం ఉంది. లేని పక్షంలో ఈ స్కీమ్‌కు ఇక ముగింపు పలికినట్లేనని భావించొచ్చు. ఇప్పటికే సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్కు సంబంధించి.. కొత్త ట్రాంచిలు రానందున ఆ స్కీమ్‌ను దాదాపు ముగించినట్లేనని కేంద్రం కూడా క్లారిటీ ఇచ్చింది. మరి ఈ పథకం గురించి ఏం చెబుతుందో చూడాలి.

## ప్రయాణికులకు గుడ్ న్యూస్.. త్వరలో టోల్‌ట్యాక్స్ స్మార్ట్ కార్డులు

**న్యూఢిల్లీ-నవభూమి:**హైవేలపై ప్రయాణించే వాహనదారులకు గుడ్ న్యూస్. ఎందుకంటే మరికొన్ని రోజుల్లో స్మార్ట్ కార్డ్ పథకం రాబోతుంది. దీని ద్వారా అనేక మంది వాహనదారులకు చెల్లింపు మొత్తం తగ్గడంతోపాటు వేగవంతమైన వ్యవస్థ అమల్లోకి రానుంది. జాతీయ రహదారులను ఉపయోగించే సాధారణ ప్రయాణికులకు గుడ్ న్యూస్ రాబోతుంది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా అన్ని టోల్ బూత్‌లలో 'మంత్లీ టోల్ ట్యాక్స్ స్మార్ట్ కార్డ్'ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టేందుకు యోచిస్తోంది. ఈ నిర్ణయంపై కేంద్ర రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ స్పీడుగా చర్యలు తీసుకుంటోంది. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల ఈ పథకాన్ని ప్రవేశపెట్టడానికి అనుకూలంగా ఉన్నట్లు వెల్లడించారు.


ఈ స్మార్ట్ కార్డ్ పథకం అమలులోకి వచ్చిన తర్వాత ఈ కార్డు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని టోల్ ప్లాజాల్లో చెల్లుబాటు అవుతుంది. ఈ కార్డుదారులకు టోల్ ఛార్జీలపై తగ్గింపు కల్పిస్తుందని వివిధ నివేదికలు చెబుతున్నాయి. అయితే ఈ కొత్త స్మార్ట్ కార్డు పథకం సాధారణ ప్రయాణికులకు టోల్ ఛార్జీలను తగ్గించి, వారిపై ఆర్థిక భారాన్ని భారీగా తగ్గిస్తుంది. ఇందులో ముఖ్యంగా వాణిజ్య వాహనాలు, సుదీర్ఘ ప్రయాణాలు చేసే వారికి మంచి ఉపశమనం కలగనుంది. ఈ విధానం ద్వారా సాధారణ ప్రయాణికులు, వాణిజ్య వాహనాలు, ఎక్స్‌ప్రెస్ వేలో తరచుగా ప్రయాణించే వారికి మరింత మేలు జరుగుతుంది. ఈ స్మార్ట్ కార్డు పథకం టోల్ చెల్లింపులను సరళీకృతం చేయడానికి అద్భుతంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ప్రత్యేకంగా వాణిజ్య వాహనాలు, తరచుగా ప్రయాణించే వాహనాలు, ఎక్స్‌ప్రెస్‌వేలపై గడిపే ట్రాకింగ్ చేసిన వాహనాలు ఈ పథకంలో ప్రయోజనాలు పొందుతాయని అంచనా వేస్తున్నారు.

## మహాకుంభ్ మృతుల లెక్కలు దాచిపెడుతున్నారు



**న్యూఢిల్లీ- నవభూమి:** మహాకుంభ్ మేళాలో ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతుల లెక్కలను దాచిపెడుతున్నారని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్, ఎంపీ అఖిలేష్ యాదవ్ బీజేపీ ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించారు. తొక్కిసలాటలో చనిపోయిన వారి అసలైన లెక్కను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి బడ్జెట్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేందుకు లోక్‌సభలో మంగళవారంనాడు జరిగిన చర్చలో అఖిలేష్ మాట్లాడుతూ, మహాకుంభ్ ఏర్పాట్లపై మాట్లాడానికి బదులుగా ఆ ఆవెంట్‌ను ప్రచారం చేసుకునేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం బిజీగా ఉందన్నారు. 100 కోట్ల మంది భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశామని బీజేపీ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ అమృత్‌స్నాన్ సకాలంలో నిర్వహించడంలో విఫలమైందని, తొలిసారి అమృత్ స్నాన్ సంప్రదాయం దెబ్బతిందని అన్నారు. మహాకుంభ్‌లో జరిగిన తొక్కిసలాట దుర్ఘటనపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, అసలు లెక్కల్ని ప్రభుత్వం తొక్కిపెట్టిందని అఖిలేష్ అన్నారు. సాక్ష్యాలను ధ్వంసం చేసేందుకు జేసీబీలను ప్రభుత్వం ఉపయోగించిందని ఆరోపించారు. మహాకుంభ్ యాత్రకు వచ్చిన కుటుంబాలకు తమ ప్రియతములను కోల్పోయి మృతదేహాలతో వెనక్కి వెళ్లాల్సి వచ్చిందన్నారు. ప్రధాని, రాష్ట్రపతి సంతాపం తెలిపిన తర్వాత 17 గంటలకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి సంతాపం తెలిపారని, ఘటన జరిగినట్టు అంగీకరించారని అన్నారు.

## రాహుల్ చైనా వ్యాఖ్యలపై రాజ్‌నాథ్ నిప్పులు



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్– చైనా సరిహద్దు పరిస్థితిపై ఆర్మీ చీఫ్ చేసిన ప్రకటనపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేయడంపై కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నిప్పులు చెరిగారు. రాహుల్ పార్లమెంటు ప్రసంగంలో తప్పుడు ఆరోపణలు చేశారని మండిపడ్డారు. ఇరువైపులా ట్రెడిషనల్ పెట్రోలింగ్ డిస్ట్రబెన్స్‌పైనే ఆర్మీ చీఫ్ చెప్పారని, ఆయన చెప్పని మాటలు చెప్పినట్టుగా రాహుల్ మాట్లాడటం సరికాదని అన్నారు. ''జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన విషయాల్లో రాహుల్ గాంధీ బాధ్యతారహిత వ్యాఖ్యలకు పాల్పడడం విచారకరం. భారత భూభాగం ఏదైనా చైనా చేతుల్లోకి వెళ్లిందంటే అది ఆక్సాయ్ చిన్‌లోని 38,000 చదరపు కిలోమీటర్ల భూభాగం మాత్రమే. 1962 యుద్ధం తరువాత ఇది జరిగింది. 1963లో పాకిస్థాన్ చట్టవిరుద్ధంగా చైనాకు 5,180 చదరపు కిలోమీటర్ల భూమిని ధారాదత్తం చేసింది. చరిత్రపై రాహుల్ అవగాహన పెంచుకోవాలి" అని రాజ్‌నాథ్ సింగ్ సోషల్‌మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. రాహుల్ గాంధీ రాష్ట్రపతి బడ్జెట్ ప్రసంగంపై సోమవారంనాడు జరిగిన చర్చలో పాల్గొంటూ, 'మేక్ ఇన్ ఇండియా'లో భారత్ విఫలమైందని, ఆ కారణంగానే చైనా దేశంలో తిష్టవేసుకు కూచుందని ఆరోపించారు. చైనాబలగాలు మన భూభాగంలోనే ఉన్నాయనే విషయాన్ని ప్రధాని మోదీ ఖండించారని, దీనిపై ఆర్మీ చీఫ్ మాత్రం వాస్తవం మాట్లాడారని అన్నారు. చైనా బలగాలు మన భూభాగంలోనే ఉన్నాయని ఆర్మీ చీఫ్ చెప్పినట్టు రాహుల్ పేర్కొన్నారు. తయారీ రంగంలో భారత్ వెనుకబడటం వల్ల చైనా వస్తువులు దేశంలోకి వస్తున్నాయని అన్నారు. ఉత్పత్తిరంగంపై భారత్ పూర్తి స్థాయి దృష్టిసారించాలని పేర్కొన్నారు.

## కేజ్రీవాల్ ఆరోపణలు.. స్పందించిన ఈసీ



**న్యూఢిల్లీ-నవభూమి:** బీజేపీ ముందు కేంద్ర ఎన్నికల సంఘం లొంగిపోయిందంటూ ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపణలు గుప్పించారు. ఈ ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం తనదైన శైలిలో మంగళవారం తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించింది. ఢిల్లీ ఎన్నికల్లో ఎన్నికల సంఘాన్ని దుర్వినియోగం చేస్తున్నారంటూ తరచూ ఆరోపణలు గుప్పిస్తున్నారని.. ఇలాంటి దురాశలకు ఎన్నికల సంఘం లొంగదని స్పష్టం చేసింది. ఈ ఎన్నికల్లో ఈసీఐని ఒకే సభ్య సంస్థగా భావించి.. ఉద్దేశపూర్వకంగా ఒత్తిడి తెచ్చే వ్యూహాలను సైతం గమనించామంది.

ఈ నేపథ్యంలో వివేకంతో వ్యవహరించాలని నిర్ణయించినట్లు తెలిపింది. అయితే ఎక్స్ ఖాతా వేదికగా ఈసీఐ స్పందిస్తూ.. ఎక్కడ ఆమ్ ఆద్మీ పేరు కానీ.. కేజ్రీవాల్ పేరు కానీ లేకుండా కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. ఈ ఎన్నికల వేళ.. రాజకీయ పార్టీలతోపాటు అభ్యర్థులు లేవనెత్తిన సమస్యలపై 1.5 లక్షల మంది అధికారులు చర్యలు తీసుకుంటున్నారని వివరించింది. వారంతా న్యాయ బద్ధంగా.. ఎక్కడ పక్షపాతం లేకుండా.. స్టాండర్డ్ అపరేటింగ్ ప్రొసిజర్ ద్వారా నిపక్షపాతంగా పని చేస్తున్నారని ఈసీఐ స్పష్టం చేసింది. కేంద్రంలోని బీజేపీకి కేంద్ర ఎన్నికల సంఘం లొంగిపోయిందని మాజీ సీఎం కేజ్రీవాల్ సోమవారం న్యూఢిల్లీలో విలేకర్ల సమావేశంలో ఆరోపించారు. మీ పని మీరు చేయండి.. మీ పదవికి న్యాయం చేయండంటూ కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాజీవ్ కుమార్?కు అరవింద్ కేజ్రీవాల్ ఈ సందర్భంగా సూచించారు. దేశ రాజధాని న్యూఢిల్లీ నగర ప్రజల మెదళ్లలో కొన్ని సందేహాలు ఉన్నాయన్నారు. వాటిని తీర్చండంటూ కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ కు ఆయన సూచించారు. ఈ మాసాంతం మీరు ఉద్యోగం నుంచి రిటైర్ అవుతున్నారు. ఆ క్రమంలో మీకు.. గవర్నర్? లేదా రాష్ట్రపతి? పదవి ఆశను కేంద్రం చూపించిందా? అంటూ ప్రశ్నించారు. ఈ రెండు పోస్టుల్లో మీకు ఏ ఆశ చూపించిందంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో తాను నమస్కరించి ఆయనకు ఒకటే సూచన చేయదలుచుకున్నానని తెలిపారు. మీ పని మీరు చేయండి.. మీ ఉద్యోగానికి తగిన న్యాయం చేయండని తాను రెండు చేతులు నమస్కరిస్తూవేడుకొంటున్నానన్నారు. మీరు ఉద్యోగం నుంచి రిటైరవుతోన్న వేళ.. దేశాన్ని.. అలాగే దేశంలోని ప్రజా స్వామ్యాన్ని సైతం నాశనం చేయవద్దంటూ తాను వేడుకొంటున్నట్లు తెలిపారు. మరోవైపు.. న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలో తన ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ నగదు పంచుతున్నాడని ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ ఈ మాసం మొదట్లో ఆరోపించిన విషయం విధితమే. అతడిపై సీఈసీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన విమర్శించారు. అలాగే హర్యానా నుంచి న్యూఢిల్లీకి యమునా నది ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో హర్యానా ప్రభుత్వం ఆ యమునా నదిలో విషం కలిపిందంటూ ఆయన ఆరోపణ గుప్పించిన సంగతి తెలిసిందే.

70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 05వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు ఫిబ్రవరి 8వ తేదీన వెలువడనున్నాయి. అయితే ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీ బీజేపీ, ఆప్ మధ్య ఉండనుంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సైతం అభ్యర్థులను బరిలో దింపింది. ఇక ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి.. ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ కు ఝలక్ ఇవ్వాలని బీజేపీ భావిస్తోంది. అయితే వరుసగా మరోసారి అధికారాన్ని అందుకొని.. బీజేపీకి తన గెలుపుతో సత్తా చాటాలని ఆప్ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల్లో ఏ పార్టీ అభ్యర్థికి ఓటర్లు పట్టం కట్టాడు అనేది తెలియాలంటే మాత్రం ఫిబ్రవరి 8వ తేదీ వరకు ఆగాల్సిందేనన్నది సుస్పష్టం.

## మన్మోహన్ సింగ్ స్మారక నిర్మాణానికి భూమి కేటాయించిన సర్కారు.. ఎక్కడో తెలుసా?



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత దేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గతేడాది డిసెంబర్ 26వ తేదీన 92 ఏళ్ల వయసులో తీవ్ర అనారోగ్యం పాలై కన్నుమూసిన విషయం అందరికీ తెలిసిందే. అయితే సింగ్ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో కేంద్ర ప్రభుత్వం నిగంబోధ్ ఘాట్‌లో నిర్వహించగా.. కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా విమర్శించింది. మాజీ ప్రధానికి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వలేదంటూ ఆరోపించింది. స్మారక నిర్మాణం విషయంలో కూడా బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య వాగ్వాదాలు జరిగాయి. అయితే తాజాగా కేంద్ర ప్రభుత్వం మన్మోహన్ సింగ్ స్మారక నిర్మాణం కోసం భూమిని కేటాయించినట్లు తెలుస్తోంది. ఆ పూర్తి వివరాలు మీకోసం. దేశ అభ్యున్నతి కోసం ఎన్నో సేవలు అందించిన మన్మోహన్ సింగ్ స్మారక నిర్మాణం కోసం తాజాగా కేంద్ర ప్రభుత్వం భూమి కేటాయించింది. ఢిల్లీలోని రాజ్ ఘాట్ ప్రాంగణంలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ స్మారక నిర్మాణం కోసం గత నెలలోనే కేంద్ర ప్రభుత్వం భూమి కేటాయించగా.. దాని పక్కనే పక్క మరో ప్లాట్‌లోనే సింగ్ స్మారక నిర్మాణం కోసం కూడా భూమి ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను ఆయన కుటుంబ సభ్యులకు కూడా సర్కారు వివరించింది.

అయితే ఈ ప్రక్రియ కోసం మన్మోహన్ సింగ్ కుటుంబ సభ్యులు త్వరగా ట్రస్ట్ ఏర్పాటు చేయాలని కూడా గృహ నిర్మాణం మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అభ్యర్థించింది. ఒకసారి సింగ్ కుటుంబ సభ్యులు ట్రస్ట్‌ను ఏర్పాటు చేస్తే ఈ స్థలాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పజెప్పడంతో పాటు నిర్మాణం కోసం రూ.25 లక్షల రూపాయలు అందిస్తుంది. ఇప్పటికే ఈ భూమిని చూసేందుకు రావాలంటూ సింగ్ కుటుంబ సభ్యులను ఆహ్వానించినప్పటికీ వాళ్లు వెళ్లలేదు.

**రాష్ట్రీయ స్మృతి స్థలంలో..!**

యమునా నది ఒడ్డున ఉన్న రాష్ట్రీయ స్మృతి స్థలం.. రాష్ట్రపతులు, ఉప రాష్ట్రపతులు, ప్రధాన మంత్రుల అంత్యక్రియలు, స్మారక చిహ్నాలకు సాధారణ ప్రదేశంగా కొనసాగుతోంది. ప్రస్తుతం ఇక్కడ మాజీ ప్రధానులు అటల్ బిహారీ వాజ్‌పేయూ, పీవీ నరసింహా రావు, చంద్ర శేఖర్, ఐకే గుజ్రాల్ సహా ఏడుగురు నాయకులు స్మారక చిహ్నాలను కల్గి ఉంది. మిగిలిన రెండు స్థలాలను ఇప్పుడు మన్మోహన్ సింగ్, ప్రణబ్ ముఖర్జీలకు కేటాయించారు. మరి దీనిపై సింగ్ కుటుంబ సభ్యులు ఎలా స్పందించబోతున్నారో చూడాలి.

### అంగన్వాడీ మెనూలో బిర్యానీ, చికెన్ ఫ్రై..

## ప్రభుత్వాన్ని కదిలించిన ఓ చిన్నారి కోరిక



**కేరళ-నవభూమి:** అంగన్వాడీలో మెనూపై ఓ చిన్నారి కోరిక రాష్ట్ర ప్రభుత్వాన్ని కదిలించింది. రాష్ట్ర వ్యాప్తంగా మార్పులకు నాంది కాబోతోంది. ఆ చిన్నారి మాటలకు మంత్రి స్పందించి తగు చర్యలు ఆదేశించడానికి కారణమైంది. ఉప్మాకు బదులుగా బిర్యానీ చికెన్ ఫ్రై కావాలని అమాయకంగా అడుగుతోన్న ఓ చిన్నారి వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారి ఏకంగా ప్రభుత్వ పెద్దలనే ఆలోచనలో పడేసింది. దీంతో కేరళలోని చిన్నారుల సంరక్షణ కేంద్రాల మెనూలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఈ మేరకు కేరళ ఆరోగ్య, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి వీణా జార్జ్ స్పందించారు. వైరల్ అవుతోన్న వీడియోలో టోపీ ధరించిన త్రాజుల్ ఎస్ శంకర్(శంకు) అనే బాలుడు ఇంటి వద్ద చేసిన బిర్యానీ తింటూ అమాయకంగా తన తల్లిని.. 'నాకు అంగన్వాడీలో ఉప్మాకు బదులుగా బిర్నానీ (బిర్యానీ) పోరిచా కోజి (చికెన్ ఫ్రై) కావాలి' అని అడగటం వినిపిస్తోంది. బుజ్జిబుజ్జి మాటలకు మురిసిపోయిన తల్లి.. దానిని వీడియో తీశారు. ఆ వీడియో తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేయడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇది మంత్రి వీణ జార్జ్ దృష్టిలో పండింది. దీంతో ఆమె తన ఫేస్‌బుక్ పేజ్‌లో ఆ వీడియోను షేర్ చేశారు. ఆ చిన్నారి అమాయకంగా చేసిన అభ్యర్థనను పరిగణన లోకి తీసుకుంటున్నట్టు ఆమె చెప్పారు. అంతేకాదు, మెనూను సమీక్షిస్తామని తెలిపారు.

ఇక, ఆ చిన్నారి వీడియోకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. బాలుడికి మద్దతుగా కామెంట్లు చేస్తున్నారు. కొందరైతే స్వయంగా తామే బిర్యానీ పంపుతామని ఆఫర్ ఇస్తున్నారు. అంతేకాదు, జైళ్లలో ఖైదీలకు అందించే ఆహారాన్ని తగ్గించాలని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు మెరుగైన పోషకాహారం అందించాలని మరి కొందరు సూచించారు. జైళ్లలో గోధుమలతో తయారుచేసి ఆహారాన్ని తిరిగి అమల్లోకి తీసుకొచ్చి.. అంగన్వాడీల్లో చిన్నారులకు వారానికి ఒకసారి బిర్యానీ, చికెన్ పెట్టాలని కోరారు. ఆ చిన్నారి కోరిక సమంజసంగానే ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి వెంటనే స్పందించి, మెనూపై రివ్యూ చేయాలని ఆదేశాలు జారీ చేయడాన్ని ప్రశంసిస్తున్నారు.

"చిన్నపిల్లల కోరికలు సాధారణంగా చిన్నవిగా.. హృదయాన్ని హత్తుకునేలా ఉంటాయి.. కాబట్టి, వీలైనంత వరకూ వారి కోరికలను తీర్చడం ముఖ్యం" అని ఓ నెటిజన్ అన్నారు. కేరళలో 2022 నుంచి అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు గుడ్లు, పాలను సరఫరా మొదలుపెట్టారు. ఇది స్థానిక సంస్థలు, అధికారుల సమన్వయంతో రాష్ట్రంలో విజయవంతంగా నడుస్తోందని మంత్రి తెలిపారు.

## ట్రంప్ యాక్షన్‌కు చైనా రియాక్షన్.. అమెరికా వస్తువులపై 15 శాతం సుంకాలు



**వాషింగ్టన్- నవభూమి:** అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోననే ఆందోళనల నడుమ చైనా నుంచి స్ట్రాంగ్ రియాక్షన్ వచ్చింది. చైనా నుంచి దిగుమతి అయ్యే అన్ని వస్తువులపై 10% సుంకం విధిస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేసిన విషయం తెలిసిందే. దీనికి ప్రతీకార చర్యగా అమెరికా నుంచి తాము దిగుమతి చేసుకునే బొగ్గు, లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్‌లపై 15 శాతం సుంకాలు విధిస్తున్నట్లు చైనా తాజాగా ప్రకటించింది. అయితే, చమురు, వ్యవసాయ పరికరాలపై టారిఫ్ మాత్రం 10 శాతం ఉంటుందని స్పష్టంచేసింది. టంగ్‌స్టన్ సంబంధిత వస్తువుల ఎగుమతులపై నియంత్రణ విధించింది. పీవీహెచ్ కార్పొరేషన్, కల్విన్ కెలిన్, ఇల్యుమినా ఇంక్ వంటి అమెరికా సంస్థలను విశ్వసనీయత లేనివాటి జాబితాలో పెట్టింది. దీంతో పాటు అనైతిక వ్యాపార విధానాలను అవలంభిస్తోందన్న ఆరోపణలతో అమెరికాకు చెందిన టెక్ దిగ్గజం గూగుల్‌పైనా విచారణకు చైనా ఆదేశిచింది. ప్రపంచంలో పెద్ద దేశాలుగా చలామణి అవుతోన్న చైనా, అమెరికాలు ఒకదానిపై ఒకటి సుంకాలు విధించుకోవడంతో వాణిజ్య యుద్ధ భయాలు మొదలయ్యాయి. ఇప్పటికే చైనా కరెన్సీ యువాన్ విలువ పతనం కాగా.. ఆ ప్రభావం ఇతర దేశాల కరెన్సీలపైనా పడింది. ఆస్ట్రేలియా డాలర్, న్యూజిలాండ్ డాలర్ విలువలు కనిష్ఠానికి పడిపోయాయి. ట్రంప్ చర్యలపై కెనడా, మెక్సికోలు కూడా గట్టిగానే స్పందించాయి. మెక్సికో అధ్యక్షురాలు మాట్లాడుతూ...అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. అయితే, ఈ రెండు దేశాల విషయంలో ట్రంప్ కొంచెం తగ్గారు. సరిహద్దుల్లో భద్రత, అక్రమ వలసదారుల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మెక్సికో, కెనడాలకు విధించిన సుంకాల పెంపు అమలను 30 రోజుల పాటు నిలిపివేశారు. దిగుమతి సుంకాలు పెంపుతో అమెరికన్లపై భారం తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆ దేశాల నుంచి వచ్చే ఉత్పత్తులను మరింత ఖరీదైనవిగా మారుతాయని, ప్రజలు వాటిని కొనుగోలు చేయడం మానేస్తారని నిపుణులు అంటున్నారు. అంతేకాదు, ఇది తీవ్ర ద్రవ్యోల్బణానికి దారితీస్తుందని ఆర్థిక వేత్తలు హెచ్చరికలు చేస్తున్నారు.

## కెనడా, మెక్సికోలకు ట్రంప్ బిగ్ రిలీఫ్.. సుంకాలు 30 రోజుల పాటు వాయిదా!

**వాషింగ్టన్- నవభూమి:** వాణిజ్య యుద్ధానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెరలేపడంతో అటు ప్రపంచ దేశాలు, ఇటు అమెరికన్లు ఆందోళనకు గురవుతున్నారు. సరిహద్దు, మిత్రదేశాలైన కెనడా, మెక్సికోతో పాటు చైనాలపై భారీగా దిగుమతి సుంకాలను విధిస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఆయన నిర్ణయం ప్రతీకార చర్యలకు కారణమవడమే కాదు.. ధరలు కూడా పెరిగే ప్రమాదం ఉందనే ఆందోళన నెలకుంది. అటు, కెనడా తాము కూడా అమెరికా ఉత్పత్తులపై సుంకాలను పెంచుతామని హెచ్చరించింది. మెక్సికో, కెనడా ఉత్పత్తులపై 25 శాతం సుంకాలను విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఆదివారం కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. తాజాగా, ఈ ఉత్తర్వుల అమలు విషయంలో ట్రంప్ కాస్త సమయం ఇచ్చారు. వీటిని నెలరోజుల పాటు నిలిపివేయాలని ట్రంప్ తాజాగా నిర్ణయించారు. ఇరు దేశాలూ అమెరికా సరిహద్దుల వెంట భద్రతను కట్టుదిట్టం చేస్తాయని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. 10,000 మంది భద్రతా బలగాలను తమ సరిహద్దులకు పంపించి మత్తుపదార్థాలు, మనుషుల అక్రమ రవాణాను అడ్డుకుంటామని కెనడా, మెక్సికోలు వాగ్దానం చేయడంతో ట్రంప్ కాస్త వెనక్కితగ్గారు.

అటు, టారిఫ్ అమలు ఉత్తర్వులు 30 రోజుల పాటు నిలిపివేసిన విషయాన్ని కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో ధ్రువీకరించారు. ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్ట్ పెట్టారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సోమవారం ఫోన్ కాల్‌లో మాట్లాడినట్టు ట్రూడో వెల్లడించారు. సరిహద్దుల్లో వలసదారులు, డ్రగ్స్ అక్రమ రవాణాను అడ్డుకోడానికి చర్యలు తీసుకోడానికి కట్టుబడి ఉన్నామని ఈ సందర్భంగా ఉద్ఘాటించినట్టు వివరించారు. 'ట్రంప్‌తో ఫోన్ కాల్‌లో మాట్లాడాను.. ఇరువురి మధ్య సంభాషణ చాలా బాగా జరిగింది.. ప్రతిపాదిత సుంకాలను 30 రోజుల పాటు నిలిపివేసి.. కలిసి పనిచేయాలని నిర్ణయించారు.. సరిహద్దుల భద్రత కోసం కెనడా 9 మిలియన్ డాలర్లు ఖర్చుచేయడానికి అంగీకరించింది. ఇందులో భాగంగా 10 వేల మంది సైనికులను మోహరించనున్నాం' అని ట్రూడో తెలిపారు. అంతేకాదు, వ్యవస్థీకృత నేరాలను ఎదుర్కోవడానికి కొత్త నిఘా ఒప్పందంపై సంతకం చేశానని ప్రధాన మంత్రి చెప్పారు. ఇందుకు అయ్యే వ్యయంలో 200 మిలియన్ డాలర్లు కెనడా భరిస్తుంది. అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా, మనీలాండరింగ్‌ను నిరోధించడానికి ఉమ్మడి కెనడా–యుఎస్ టాస్క్‌ఫోర్స్‌ను ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. అలాగే, డ్రగ్ స్మగ్లర్లను ఉగ్రవాదుల జాబితాలో చేర్చాలని ట్రంప్ చేసిన ప్రతిపాదనకు ట్రూడో అంగీకరించారు. అలాగే ఓపియాయిడ్ ఫెంటానిల్‌కు వ్యతిరేకంగా చేపట్టిన చర్యలను పర్యవేక్షించడానికి ఒక అధికారిని నియమించారు. అయితే, చైనా విషయంలో మాత్రం ట్రంప్ వెనక్కితగ్గినట్టు లేదు.

## ఎలాన్ మస్క్ 'డోజ్'లో 22 ఏళ్ల తెలుగు ఇంజినీర్.. ఎవరీ ఆకాశ్ బొబ్బా?



**వాషింగ్టన్- నవభూమి:** అమెరికా అధ్యక్షుడిగా విజయం సాధించిన తర్వాత.. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్, భారత సంతతికి చెందిన వ్యాపారవేత్త వివేక్ రామస్వామిలను డోజ్‌కు సారథులుగా ట్రంప్ నియమించారు. ఇరువురూ కలిసి డోజ్‌ను సృష్టించారు. ప్రభుత్వ వ్యవస్థ ప్రక్షాళన, వృథాను అరికట్టాలనే ఉద్దేశంతో దీనిని తీసుకొచ్చారు. అయితే, ఇటీవలే వివేక్ దీనిని నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆరుగురు యువ ప్రతిభావంతులను మస్క్ తాజాగా నియమించారు. అయితే, దీనిపై ఆందోళన వ్యక్తమవుతోంది. ట్రంప్ కార్యవర్గంలో ఎలాన్ మస్క్ సారథ్యం వహిస్తోన్న డోజ్ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ)లో ఓ తెలుగు యువకుడికి చోటుదక్కింది. తెలుగు సంతతికి చెందిన యువ ఇంజినీర్ ఆకాశ్ బొబ్బాను మస్క్ నియమించారు. ఆకాశ్‌తో సహా ఆరుగురు యువకులను డోజ్‌లో రిక్రూట్ చేసుకున్నారు. వీరంతా 19 నుంచి 24 ఏళ్లలోపు వారే కావడం చెప్పుకోదగ్గ అంశం. అత్యంత కీలకమైన ప్రభుత్వ వ్యవస్థలో వీరిని నియమించడంపై సర్వత్రా ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ వృథా ఖర్చులను తగ్గించడం, వ్యవస్థలో సమూల మార్పులే లక్ష్యంగా డోజ్ ఏర్పాటైన విషయం తెలిసిందే. 19 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్సు గల యువ నిపుణుల బృందాన్ని నియమించడం, వారిలో కొందరు కాలేజీ విద్య పూర్తి చేయనివారు ఉండటం గమనార్హం. ఓ యువకుడు ఇంకా చదువుతున్నట్లు సమాచారం. వారి అర్హతలు, సున్నితమైన ప్రభుత్వ డేటా వారికి యాక్సెస్ ఇవ్వడంపై ఆందోళన చెందుతున్నారు. ఇక, ఆకాశ్ బొబ్బా విషయానికి వస్తే నిర్వహణ, వ్యవస్థాపకత, సాంకేతిక కార్యక్రమంలో భాగంగా యూసీ బర్కిలీకి హాజరయ్యాడు. మెటా, పలాంటిర్, హెడ్జ్ ఫండ్ బ్రిడ్జ్‌వాటర్ అసోసియేట్స్‌లో ఇంటర్న్‌గా పనిచేశాడు. ఏఐబీ డేటా ఎనాలిసిస్, ఫైనాన్షియల్ మోడలింగ్‌లో అనుభవం ఉంది. ఆకాశ్ అంతర్గత ప్రభుత్వ రికార్డులలో ఆఫీస్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (%ఖావీ%)లో 'నిపుణుడు'గా పేర్కొన్నారు. మస్క్‌కు చెందిన కృత్రిమ మేధ సంస్థ %ఇూా×%లో కొత్త చీఫ్ ఆఫ్ స్టాఫ్ అమండా స్కేల్స్‌కు ఆకాశ్ రిపోర్ట్ చేయనున్నట్టు తెలుస్తోంది. ఇక, యూసీ బర్కిలీలో ఉన్నప్పుడు జరిగిన ఓ సంఘటన గురించి.. ఆకాశ్ సహచరుడు చారిస్ జాంగ్ ఎక్స్‌లో వెల్లడించారు. ఆకాశ్ ప్రతిభ, కోడింగ్ నైపుణ్యాలను తెలియజేస్తూ ఆ అద్భుతమైన సంఘటనను అతడు గుర్తుచేసుకున్నాడు. 'ప్రాజెక్ట్ గడువుకు రెండు రోజుల ముందు అనుకోకుండా మొత్తం డేటా డిలీట్ అయ్యింది.. కానీ, ఆకాశ్ మా భుజం తట్టి ఒక్క రాత్రిలోనే దానిని మళ్లీపూర్తిచేశాడు' అని చెప్పుకొచ్చాడు. అందరికంటే మేమే ముందుగా ప్రాజెక్ట్ నివేదిక సమర్పించి.. మొదటిస్థానంలో నిలిచామని చెప్పాడు. కాగా, మస్క్‌తో పాటు డోజ్ సారథిగా భారత సంతతి వ్యాపారవేత్త వివేక్ రామస్వామిని డొనాల్డ్ ట్రంప్ నియమించారు. కానీ, ఆయన ఆ బాధ్యతల నుంచి తాను తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన మర్నాడే వివేక్ ఈ నిర్ణయం తీసుకున్నాయి. అయితే, ఆయన ఓహియో గవర్నర్ ఎన్నికల్లో పోటీకోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్టు పరోక్షంగా వెల్లడించారు. వాస్తవానికి అమెరికా ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిత్వానికి వివేక్ కూడా పోటీపడ్డారు. కానీ, తర్వాత ట్రంప్‌నకు తన మద్దతు తెలిపారు.

### వక్ఫ్ బిల్లుపై ముందుకెళ్లి 90ల నాటి పరిస్థితి కోరుకుంటున్నారా?

## అసదుద్దీన్ ఒవైసీ వార్నింగ్



**న్యూఢిల్లీ-నవభూమి:** వక్ఫ్ సవరణ బిల్లు 2024ను పార్లమెంట్ ముందుకు ఈ బడ్జెట్ సమావేశాల్లోనే మోదీ ప్రభుత్వం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హైదరాబాద్ ఎంపీ, ఆల్ ఇండియా మజ్లీస్ ఇ-ఇత్తేహదుల్ ఇస్లామీన్ అధినేత అసుద్దీన్ ఒవైసీ హెచ్చరించారు. బిల్లు ఆమోదం పొందితే దేశంలో సామాజిక అస్థిరతకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లును మొత్తం ముస్లిం సమాజం తిరస్కరించిందని ఒవైసీ చెప్పారు. సోమవారం ఆయన పార్లమెంట్ ఎదుట మీడియాతో మాట్లాడుతూ.. వక్ఫ్ బిల్లును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని తేల్చిచెప్పారు. "నేను ఈ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాను.. ప్రతిపాదన వక్ఫ్ చట్టాన్ని తీసుకొస్తే అది రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26, 14లను ఉల్లంఘిస్తుంది.. ఈ దేశంలో సామాజిక అస్థిరతకు దారితీస్తుంది. దీనిని మొత్తం ముస్లిం సమాజం తిరస్కరించింది.. వక్ఫ్ ఆస్తులు ఏమీ ఏదీ మిగలవు" అని అన్నారు. 'మీరు దేశాన్ని వికసిత్ భారత్'గా మార్చాలనుకుంటున్నారు.. మేము 'వికసిత్ భారత్'ను కోరుకుంటున్నాం... మీరు ఈ దేశాన్ని 80లు.. 90ల ఆరంభంలోకి తీసుకెళ్లాలనుకుంటే అది మీ బాధ్యత' అని మోదీ ప్రభుత్వానికి పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. 'గర్వించదగ్గ భారతీయ ముస్లింగా నేను మసీదులో అంగుళం స్థలం కూడా వదులుకోను.. నా దర్గాలో ఇంచు భూమిని కోల్పోను... దీనికి నేను అనుమతించను... మేము ఇకపై ఇక్కడికి వచ్చి మెతక ప్రసంగాలు చేయం... మేము భారతీయులుగా గర్విస్తున్నాం... నా సమాజం కోసం నిలబడి నిజాయితీగా మాట్లాడాల్సిన సభ ఇది.. ఇది నా ఆస్తి, ఎవరూ ఇవ్వలేదు. మీరు దానిని నా నుంచి లాక్కోలేరు. వక్ఫ్ నాకు ఒక ఆరాధన స్థలం' అని ఒవైసీ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లులో 'వక్ఫ్ బై యూజర్ (దీర్ఘకాలం వక్ఫ్ బోర్డు వినియోగంలో ఉండే ఆస్తి దానికే శాశ్వతంగా సంక్రమిస్తుంది. కోర్టుల్లో సవాల్ చేయడానికి వీల్లేదు)' అనే నిబంధనను తొలగించడాన్ని ఒవైసీ వ్యతిరేకించారు. అంతకు ముందు వక్ఫ్ సవరణ బిల్లుపై ప్రతిపక్షసభ్యులు కళ్యాణ్ బెనర్జీ (లోక్‌సభ), నదీముల్ హక్ (రాజ్యసభ)లు జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి సమర్పించిన అసమ్మతి నోట్‌లోని కీలక అంశాలను తొలగించడాన్ని తీవ్రంగా నిరసించారు. తమ అభ్యంతరాలను ఎటువంటి నోటీసు లేదా వివరణ తీసుకోకుండానే ఏకపక్షంగా తొలగించారని స్పీకర్‌కు రాసిన లేఖలో ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభానికి రెండు రోజుల ముందే వక్ఫ్ సవరణ చట్టంపై నియమించిన జేపీసీ.. తన నివేదికను స్పీకర్ ఓం బిర్లాకు అందజేసిన విషయం తెలిసిందే.

## ఫౌజీ షూటింగ్ లేటెస్ట్ అప్డేట్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ క్షణం తీరిక లేకుండా సినిమాలు చేసుకుంటూ వెళ్తున్నాడు. ప్రస్తుతం మారుతి దర్శకత్వంలో ది రాజా సాబ్ చేస్తున్న ప్రభాస్ ఈ సినిమాతో తన కెరీర్లోనే మొదటిసారి హార్రర్ కామెడీ జానర్ ను ట్రై చేస్తున్నాడు. ఈ సినిమాను పూర్తి చేయకుండానే ప్రభాస్ సీతారామం డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో మరో సినిమాను మొదలుపెట్టి సెట్స్ పైకి తీసుకెళ్లాడు. 1940 నాటి యుద్ధ నేపథ్యంలో రూపొందనున్న ఈ సినిమాలో ఇన్ స్టా స్టార్ ఇమాన్వీ హీరోయిన్ గా ఎంపికైన విషయం తెలిసిందే. ఈ సినిమాకు ఫౌజీ అనే టైటిల్ ను పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమాకు సంబంధించిన 30 రోజుల షూటింగ్ ఇప్పటికే పూర్తైనట్టు తెలుస్తోంది. ఫౌజీ కీలక భాగం షూటింగ్ కారైకుడి, హైదరాబాద్ ప్రాంతాల్లో జరుగనుంది. సామ్ ది రూలర్ తర్వాతి షెడ్యూల్ రేపటి(ఫిబ్రవరి 5) నుంచి హైదరాబాద్‌లో మొదలుపెట్టనున్నట్టు తెలుస్తోంది. ఈ షెడ్యూల్‌ను ఎలాంటి బ్రేకుల్లేకుండా డైరెక్టర్ హను ప్లాన్ చేసినట్టు సమాచారం. ఫిబ్రవరిలో మొదలుపెడితో మార్చి ఎండింగ్ వరకు ఈ షెడ్యూల్ షూటింగ్ నిరంతరాయగా కొనసాగుతుందని యూనిట్ సభ్యులు చెప్తున్నారు. ప్రభాస్ కు గాయం అవడంతో ఈ సినిమా షూటింగ్ బాగా ఆలస్యమైంది. ఆ గ్యాప్ ను కవర్ చేయడానికే హను ఈ షెడ్యూల్ ను ఎలాంటి బ్రేకులు లేకుండా ప్లాన్ చేశాడని అంటున్నారు. వీలైనంత త్వరగా షూటింగ్ ను పూర్తి చేసి, వచ్చే ఏడాది సమ్మర్‌కు సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.





## పొడుగు కాళ్ల అందం చూశారా!

బాలీవుడ్ బ్యూటీ వాణి కపూర్ ఇండస్ట్రీలో అడుగు పెట్టి దశాబ్ద కాలం అయ్యింది. కెరీర్ ఆరంభంలో ఒడిదొడుకులు ఎదుర్కొన్నా ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. ఈ ఏడాది వాణి కపూర్ నుంచి మూడు భారీ బడ్జెట్ సినిమాలు రాబోతున్నాయి. ముద్దుగుమ్మ మూడు సినిమాల్లోనూ హీరోయిన్‌గా నటించడం ద్వారా ఈ అమ్మడు తన స్థాయిని మరింత పెంచుకోబోతుంది. టాలీవుడ్‌లో ఈమె కేవలం ఒకే ఒక్క సినిమా ఆహా కళ్యాణం సినిమాలో కనిపించింది. నాని హీరోగా నటించిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడింది. దాంతో మళ్లీ సౌత్‌లో ఈ అమ్మడు కనిపించడం లేదు. బాలీవుడ్‌కే ఈ అమ్మడు పరిమితం అయ్యింది. సౌత్‌లో ఈమె సినిమాలు రాకున్నా సోషల్ మీడియాలో ఫోటోలతో అన్ని చోట్ల వైరల్ అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపుగా 8 మిలియన్ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న వాణి కపూర్ రెగ్యులర్‌గా సోషల్ మీడియా ద్వారా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలిచింది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం. మూడు పదుల వయసు దాటినా పాతికేళ్ల పడుచు అందాలతో వాణి కపూర్ చూపు తిప్పుకోనివ్వడం లేదంటూ నెటిజన్స్ ఈ ఫోటోలకు కామెంట్స్ చేస్తున్నారు. సాధారణంగానే వాణి కపూర్‌ని పొడుగు కాళ్ల సుందరి అంటారు. అలాంటి వాణి కపూర్ లో యాంగిల్‌లో తన కాళ్ల అందాన్ని చూపిస్తూ కన్నుల విందు చేస్తూ ఉంటే ఇంకా ఏమైనా ఉందా... ముద్దుగుమ్మ ఫోటోకి లక్షల లైక్స్ రావాల్సిందే. ఈ ఫోటోను వాణి కపూర్ షేర్ చేసిన గంటల వ్యవధిలోనే వేలల్లో లైక్స్, షేర్స్ దక్కాయి. తన పొడుగు కాళ్ల అందంను ఇలా చూపించడం ద్వారా మరింత ఈ అమ్మడు పాపులారిటీని సొంతం చేసుకుంది. ఇంతటి అందంకు ఇన్నాళ్లు ఎందుకు ఆఫర్లు రాలేదు అనేది ఆశ్చర్యంగా ఉంది అంటున్నారు. ఇకపై అయినా ఈమె వరుసగా సినిమాలు చేయాలని అభిమానులు, సోషల్ మీడియా ఫాలోవర్స్ కోరుకుంటున్నారు. వాణి కపూర్ తాజా ఫోటోలతో మరోసారి వార్తల్లో నిలిచింది. పొడుగు కాళ్లతో ఎప్పుడూ అందరి దృష్టిని ఆకర్షించే ఈ అమ్మడు మరోసారి అదే తరహాలో తన అందంతో కన్నుల విందు చేస్తుంది. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఈ అమ్మడు రైడ్ 2, అబీర్ గులాల్ సినిమాల్లో నటిస్తోంది. ఈ ఏడాదిలోనే ఆ రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. వాటితో పాటు బద్దమీజ్ గిల్ సినిమాలోనూ వాణి కపూర్ నటిస్తోంది. పలు అవార్డులు రివార్డులు అందుకున్న ఈ అమ్మడు ఓటీటీ ఎంట్రీకి సైతం ఆసక్తి చూపిస్తుంది. త్వరలోనే ఈ అమ్మడి నుంచి ఒక వెబ్ సిరీస్ వచ్చే అవకాశాలు ఉన్నాయని సమాచారం అందుతోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## 'తండేల్' కోసం రాజు, బుజ్జితల్లి తీసుకున్నది ఎంతంటే..!



నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా చందు మొండేటి దర్శకత్వంలో రూపొందిన 'తండేల్' సినిమా ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. భారీ అంచనాల నడుమ బన్నీ వాసు ఈ సినిమాను నిర్మించారు. అల్లు అరవింద్ ఈ సినిమాకు సమర్పకుడిగా వ్యవహరిస్తున్న కారణంగా అంచనాలు భారీగానే ఉన్నాయి. సాధారణంగా గీతా ఆర్ట్స్ నుంచి సినిమా అంటే మినిమం ఉంటుంది అనే నమ్మకంతో ప్రేక్షకులు ఉంటారు. కనుక ఆ నమ్మకంను నిలబెట్టుకునేందుకు బన్నీ వాసు చాలానే ఎక్కువ ఖర్చు చేసి ఈ సినిమాను నిర్మించారు. కార్తికేయ 2 సినిమా తర్వాత చందు మొండేటి నుంచి వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. సామ్ ది రూలర్ తండేల్ సినిమాలో శ్రీకాకుళంకు చెందిన మత్స్యకారులను గురించి చూపించబోతున్నారు. సినిమా కథలో 50 శాతం నిజం ఉంటే, మిగిలిన 50 శాతంను కల్పితంగా మేకర్స్ చెబుతున్నారు. పాకిస్తాన్ జైల్లో పడే ఇండియన్ జాలర్లను ఎలా కాపాడారు అనే విషయాలను సినిమాలో చూపించబోతున్నారు. నాగ చైతన్య సాధారణ కుర్రాడి నుంచి తండేల్(నాయకుడు)గా ఎలా మారాడు అనేది సినిమా కథగా చెబుతున్నారు. అల్లు అరవింద్ చెబుతున్న దాని ప్రకారం నాగ చైతన్య కెరీర్ బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చాడట. ఇది ఆయన కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ మూవీగా నిలుస్తుందని అంటున్నారు. అంతే కాకుండా సాయి పల్లవి సైతం మరోసారి తన సత్తా చాటబోతుందని అంటున్నారు. ఈ సినిమాలో నాగ చైతన్య తండేల్ రాజు పాత్రలో కనిపిస్తే, సాయి పల్లవి పక్కింటి అమ్మాయి తరహాలో బుజ్జి తల్లి పాత్రలో కనిపించబోతుంది. రాజు పాత్రలో కనిపించినందుకు గాను నాగ చైతన్య రూ.15 కోట్ల పారితోషికంను అందుకున్నాడని తెలుస్తోంది. ఇక సాయి పల్లవి సైతం ఈ సినిమాకు గాను అత్యధికంగా పారితోషికం అందుకుంది. సాధారణంగా తెలుగు కమర్షియల్ హీరోయిన్స్ రెండు నుంచి మూడు కోట్ల పారితోషికం అందుకుంటున్నారు. కానీ సాయి పల్లవి మాత్రం బుజ్జి తల్లి పాత్ర కి ప్రాణం పెట్టినందుకు గాను ఏకంగా రూ.5 కోట్ల పారితోషికంను అందుకుందని తెలుస్తోంది.

దర్శకుడు చందు మొండేటి గత చిత్రం కార్తికేయ 2 సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకున్న కారణంగా ఈ సినిమాకు ఆయన సాలిడ్ చెక్‌ను అందుకుని ఉంటారు. ఇక పుష్ప 2 వంటి భారీ బ్లాక్ బస్టర్ సక్సెస్‌ను దక్కించుకున్న మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకు సంగీతాన్ని అందించారు. ఆయన ఈ సినిమాకి గాను భారీ మొత్తంలో పారితోషికంను అందుకున్నారని తెలుస్తోంది. మొత్తానికి ఈ సినిమా బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్‌గా నిలుస్తుంది అనే నమ్మకంతో భారీ పారితోషికాలు ఇవ్వడం మాత్రమే కాకుండా కొన్ని సీన్స్‌కి ఊహకు సైతం అందని భారీ ఖర్చు చేశామని మేకర్స్ చెబుతున్నారు. సినిమాకు పాజిటివ్ బజ్ క్రియేట్ అయిన నేపథ్యంలో హిట్ టాక్ వస్తే భారీ వసూళ్లు నమోదు చేసే అవకాశాలు ఉన్నాయి. తాము పెట్టిన బడ్జెట్ రావాలంటే హిట్ టాక్ రావాల్సిందే అని బన్నీ వాసు ఒక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు.

## వారి నుంచి ప్రాణహాని ఉంది: లావణ్య సంచలన ఆరోపణలు



టాలీవుడ్‌లో పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారిన లావణ్య - మస్తాన్ సాయి కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఇటీవల లావణ్య ఇచ్చిన ఫిర్యాదుతో నార్సింగి పోలీసులు మస్తాన్ సాయిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో అతనితో పాటు ఖాజా అనే మరో యువకుడిని కూడా అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఇద్దరూ కలిసి లావణ్యను బెదిరించారని, ఆమెను మానసికంగా వేధించారని ఫిర్యాదులో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ కేసులో మస్తాన్ సాయి పై బిఎన్ఎస్ యాక్ట్‌లోని 329(4), 324(4), 109, 77, 78 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల దర్యాప్తులో మస్తాన్ సాయి వద్ద నుంచి అనేక కీలక ఆధారాలు బయటపడ్డాయి. అతని వద్ద ఉన్న ఒక ల్యాప్‌టాప్, రెండు హార్డ్ డిస్క్‌లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అందులో 200 కి పైగా ప్రైవేట్ వీడియోలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వీడియోలే కీలక సాక్ష్యాలు కావడంతో కేసు మరింత ముదురుతోంది. సామ్ ది రూలర్ లావణ్యతో పాటు మరికొంతమంది యువతులను మస్తాన్ సాయి మోసం చేసాడనే ఆరోపణలతో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. తాజాగా, లావణ్య నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి, మీడియాతో మాట్లాడారు. తన ప్రాణాలకు ముప్పు ఉందని, గత కొన్ని రోజులుగా తనను బెదిరిస్తున్నట్లు వెల్లడించారు.. ఆమె మాట్లాడుతూ.. నేను ఇచ్చిన ఫిర్యాదుపై స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు పోలీసుల దగ్గరకు వెళ్లాను. కానీ ఇప్పటికీ నాకు బెదిరింపు కాల్స్ వస్తూనే ఉన్నాయి.మస్తాన్ సాయి, అతని తల్లిదండ్రులు నన్ను చంపేందుకు ప్రయత్నిస్తున్నారు. నన్ను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. నా దగ్గర హార్డ్ డిస్క్ ఉందని తెలిసాక, దాన్ని దొంగిలించేందుకు ప్రయత్నించారు. ప్రాణభయం కారణంగా నా జీవితమే కుదుటపడడం లేదు.. అంటూ లావణ్య తెలిపారు. ఇన్నాళ్లుగా తన వద్ద సరైన సాక్ష్యాలు లేకపోవడంతో తాను ఓపిక పట్టానని, కానీ ఇప్పుడు తనకు లభించిన ఆధారాలను పోలీసులకు అందజేశానని తెలిపారు. ఇక మస్తాన్ సాయి తనపై అనేక కుట్రలు పన్నాడని, ఈ కేసును పక్కదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని కూడా ఆమె ఆరోపించారు. తనకు న్యాయం జరగాల్సిందేనని, తాను ఎంత వరకు పోరాడాల్సి వస్తే అంత వరకు పోరాడతానని లావణ్య స్పష్టం చేశారు.

## నానా హైరానా... ఇలాంటివి ఎన్నో?



సంక్రాంతికి వచ్చిన 'గేమ్ ఛేంజర్' సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. అతి తక్కువ వసూళ్లకే థియేటర్ల నుంచి కనిపించకుండా పోయింది. సంక్రాంతికి వస్తున్నాం జోరు ముందు గేమ్ ఛేంజర్ నిలవలేక పోయాడు. కథలో బలం ఉన్నా దాన్ని చూపించలేక దర్శకుడు చేతులు ఎత్తేశాడు. సినిమా మొత్తం కట్ కాపీ పేస్ట్ అన్నట్లుగా ఉందని, అతుకుల బొంత మాదిరిగా సినిమా ఉందనే విమర్శలు వచ్చాయి. కొన్ని పాత్రలను ఎందుకు చూపించారో అర్థం కాలేదు, కొన్ని పాత్రలను ఎక్కడ ఎండ్ చేశాడో అర్థం కాలేదు. సినిమా మొత్తం నిడివి 5 గంటలు వచ్చిందని, దాన్ని కట్ చేసే క్రమంలో ఇలా వచ్చిందని శంకర్ ఓపెన్‌గానే చెప్పారు. సామ్ ది రూలర్ గేమ్ ఛేంజర్‌లోని కట్ చేసిన సన్నివేశాల సంగతి పక్కన పెడితే షూటింగ్ పూర్తి చేసి విడుదలకు ముందు ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చిన నానా హైరానా పాటను పెట్టక పోవడం చాలా ఆశ్చర్యంగా అనిపించింది. నానా హైరానా పాటకి మంచి స్పందన వచ్చింది. సినిమాలోని బెస్ట్ మెలోడీ అంటూ తమన్ సైతం చెప్పుకొచ్చాడు. అంతే కాకుండా నానా హైరానా పాటకి ఇప్పటివరకు ఎప్పుడూ వాడని సరికొత్త టెక్నాలజీని వాడటంతో పాటు అద్భుతమైన విజువల్స్ ఉన్న చోట షూట్ చేశామని అన్నారు. థియేటర్‌లో పాటను చూస్తే కచ్చితంగా కన్నుల పండుగ అన్నట్లుగా ఉంటుంది అని యూనిట్ సభ్యులు మరీ మరీ చెప్పారు. తీరా చూస్తే సినిమాలో పాటకు ఛాన్స్ లేదని తొలగించారు. ఎక్కడ పెట్టినా స్క్రీన్‌ప్లే డిస్టర్బ్ అవుతుందని తొలగించినట్లుగా యూనిట్ సభ్యులు చెప్పారు. విడుదలై కొన్ని రోజుల తర్వాత తీసుకు వస్తామని అన్నారు. పాటను యాడ్ చేశారా లేదా అనేది కూడా చాలా మందికి తెలియదు. సినిమాలో పాటను యాడ్ అయితే చేశారు.. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. సినిమా విడుదలైన తర్వాత హైరానా పాట గురించి ఏ ఒక్కరూ పెద్దగా పట్టించుకోలేదు. థియేటర్‌లో ఆ పాటను మిస్ అయ్యాం అని మొదటి రెండు రోజులు ఫ్యాన్స్ నిరుత్సాహం వ్యక్తం చేశారు కానీ మొత్తంగా సినిమా పోవడంతో పాట గురించి పెద్దగా చర్చ జరగలేదు.





## విండీస్ స్టార్ అన్‌ప్లేయబుల్ డెలివరీ.. ఈ బాల్ బుమ్రా కూడా వేయలేడు



క్రికెట్‌లో ప్రతి పేస్ బౌలర్ బంతిని స్వింగ్ చేయాలనుకుంటాడు. ఎందుకంటే బాల్ ఒక్కసారి స్వింగ్ అవడం షురూ అయితే ఎంతటి తోపు బ్యాటరైనా తప్పించుకోలేడు. క్యాచ్, ఎల్బీడబ్ల్యూ, బౌల్డ్.. ఇలా ఎన్నో ఆప్షన్ ఓపెన్ అవుతాయి. అందుకే బంతి స్వింగ్ అవ్వొద్దని బ్యాటర్లు కోరుకుంటారు. అయితే టెస్టులు, వన్డేల్లో బంతి స్వింగ్ అవడానికి స్కోప్ ఉంటుంది. ముఖ్యంగా లాంగ్ ఫార్మాట్‌లో పేస్ వికెట్లను తయారు చేస్తారు. కాబట్టి ఆ చాన్స్ ఉంటుంది. టీ20 క్రికెట్‌లో మాత్రం స్వింగ్‌ను ఎక్స్‌పెక్ట్ చేయలేం. కానీ ఓ పొట్టి ఫార్మాట్ మ్యాచ్‌లో బంతి అనూహ్యంగా స్వింగై బ్యాటర్‌తో పాటు ఇరు జట్ల అభిమానులను షాక్‌కు గురిచేసింది.బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్-2025లో అద్భుతం చోటుచేసుకుంది. ఖులానా టైగర్స్ వర్సెస్ రంగాపూర్ రైడర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో పేసర్ కైల్ మేయర్స్ స్టన్నింగ్ డెలివరీ వేశాడు. అతడు సిక్స్ స్టంప్ మీద వేసిన బంతి పిచ్ మీద పడ్డాక ఒకేసారి స్వింగ్ అయింది. బనానా షేప్‌లో దూసుకెళ్లి వికెట్లను గిరాటేసింది. దీంతో బాల్‌ను ఫేస్ చేసిన బ్యాటర్ ఖవాజా నఫే షాక్‌కు గురయ్యాడు. బాల్ పడటం, అతడు డిఫెన్స్ చేయడం, బ్యాట్‌ను దాటుకొని వెళ్లి స్టంప్స్‌ను గిరాటేయడం రెప్పపాటులో జరిగిపోయాయి. ఈ డిస్మిసల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీన్ని చూసిన నెటిజన్స్.. ఇది మామూలు డెలివరీ కాదని అంటున్నారు. ఇంత స్వింగ్ బహుశా బుమ్రాకు కూడా సాధ్యం కాదేమోనని కామెంట్స్ చేస్తున్నారు. ఈ బాల్‌ను డిఫెండ్ చేసే మొనగాడే లేడని చెబుతున్నారు.

## భారత్-ఇంగ్లండ్ వన్డే సిరీస్.. లైవ్ స్ట్రీమింగ్ ఫుల్ డీటెయిల్స్ మీ కోసం..



చాంపియన్స్ ట్రోఫీకి సమయం దగ్గర పడుతోంది. అన్ని జట్లు ఈ టోర్నీకి ముందు పలు వన్డేలు ఆడుతూ వాతావరణాన్ని హీటెక్కిస్తున్నాయి. ఇన్నాళ్లూ టెస్టులు, టీ20లు ఆడుతూ సైలెంట్‌గా ఉన్న టీమిండియా కూడా ఒకేసారి టాప్ గేర్ వేసి బరిలోకి దిగుతోంది. ఇంగ్లండ్ జట్టుతో ఫిఫ్టీ ఫిఫ్టీ ఫైట్‌కు రెడీ అవుతోంది. ఫిబ్రవరి 6వ తేదీ నుంచి ఈ రెండు టీమ్స్ మధ్య వన్డే సిరీస్ మొదలవనుంది. ఈ సిరీస్‌లో గెలవడంతో పాటు చాంపియన్స్ ట్రోఫీకి ముందు దీన్ని సన్నాహకంగా వాడుకోవాలని రోహిత్ సేన భావిస్తోంది. 50 ఓవర్ల ఫార్మాట్‌కు అలవాటు పడటమే కాదు.. స్క్వాడ్‌ను పూర్తి స్థాయిలో పరీక్షించుకోవడం, వ్యూహాలకు పదును పెట్టడానికీ దీన్ని సదవకాశంగా భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఇంట్రెస్టింగ్ సిరీస్ ఎక్కడ లైవ్ స్ట్రీమింగ్ కానుందో ఇప్పుడు చూద్దాం..షెడ్యూల్ ఇదే..భారత్-ఇంగ్లండ్ వన్డే సిరీస్ ఫిబ్రవరి 6న స్టార్ట్ కానుంది. ఈ మ్యాచ్‌కు నాగ్‌పూర్‌లోని వీసీఏ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది. మధ్యాహ్నం 1.30 గంటలకు మ్యాచ్ స్టార్ట్ అవుతుంది. ఫిబ్రవరి 9వ తేదీన రెండో వన్డే జరగనుంది. కటక్‌లోని బారాబతి స్టేడియం ఈ మ్యాచ్‌ను హోస్ట్ చేయనుంది. ఆ మ్యాచ్ కూడా మధ్యాహ్నం 1.30 గంటలకే మొదలవుతుంది. సిరీస్‌లోని చివరి వన్డే ఫిబ్రవరి 12న జరగనుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం ఈ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది.

## స్టార్ క్రికెటర్ రిటైర్మెంట్.. చాంపియన్స్ ట్రోఫీకి ముందు షాకింగ్ డెసిషన్



శ్రీలంక సీనియర్ బ్యాటర్ దిముత్ కరుణరత్నే సుదీర్ఘ కెరీర్‌కు గుడ్‌బై చెప్పేశాడని తెలుస్తోంది. ఇంటర్నేషనల్ క్రికెట్ నుంచి తాను తప్పుకుంటానని లంక బోర్డుకు అతడు సమాచారం అందజేశాడట. ఆస్ట్రేలియా జట్టుతో గాలె వేదికగా జరిగే టెస్టే అతడి కెరీర్‌లో ఆఖరి మ్యాచ్ అని సమాచారం. ఫిబ్రవరి 6వ తేదీన మొదలయ్యే ఈ టెస్ట్ కరుణరత్నేకు మైల్‌స్టోన్ మ్యాచ్ కానుంది. గాలె టెస్ట్ అతడి కెరీర్‌లో 100వది. అందుకే ఆటకు గుడ్‌బై చెప్పేందుకు ఇదే సరైన సమయమని కరుణరత్నే భావిస్తున్నట్లు తెలుస్తోంది. అతడి రిటైర్మెంట్ నిర్ణయంపై అభిమానులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.కుమార సంగక్కర, మహేళ జయవర్ధనే, సనత్ జయసూర్య లాంటి దిగ్గజాల నిష్క్రమణ తర్వాత శ్రీలంక బ్యాటింగ్‌కు మూలస్తంభంగా నిలిచాడు కరుణరత్నే. పరుగుల వరద పారిస్తూ ఎన్నో మ్యాచుల్లో లంకను గెలిపించాడు. చాలా మ్యాచుల్లో టీమ్‌ను ఓటమి కోరల్లో నుంచి బయటపడేశాడు. అయితే గత కొన్నాళ్లుగా ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్నాడు కరుణరత్నే. 14 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు గుడ్‌బై చెప్పేందుకు అదే కారణమై ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక, కెరీర్‌లో 99 టెస్టులు ఆడిన ఈ బ్యాటర్.. 7172 పరుగులు చేశాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**